1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 6
సంచిక : 9
పుటలు : 52
రు. 25 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఫిబ్రవరి 2021

యు.జి.సి. గుర్తింపు పొందిన తెలుగు పత్రిక



'పద్మశ్రీ' గౌరవాన్ని పొందిన దండారి కళాకారుడు,
గోండు మూలవాసుల కీర్తిపతాక – కనకరాజు

ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ 21-2-2021: తెలుగులో ఏలుబడికి కట్టుబడే పార్టీలకే ఓటు

రైతు కష్టాలు, కన్నీళ్ళ కడగండ్లు చూసి చలించిపోయి సామాజిక చైతన్యం, కలిగించి రైతు ప్రాశస్త్యం, ప్రయోజనం గురించి వివరిస్తూ పద్య రచన చేసిన సుప్రసిద్ధ కవులు, రచయితల ప్రయత్నాన్ని ప్రశంసిస్తూ......వారి ఆకాంక్షలతో...చిత్రరూపం, రైతన్నకు అక్షరాభిషేకం



తే॥గీ॥ రైతులేమాత్రము నిరాశ రగులవలదు
మంచికాలమ్ము తప్పకేతెంచు నిజము
భీతివలదెందు చితికిన రైతులకును
ప్రభుత యేతెంచి సాయమ్ము పడుట జరుగు!

కాలమొక్కరీతి కలకాలము సాగునె? కష్టకాలమే
మూలన నక్కియుండి నిను ముంచిన నేమిలె భావియందు నీ
పాలిటికిన్ వరంబులయి వచ్చు శుభప్రదమౌ దినాలు, నిన్
బోలు కృషీవలావళిని బ్రోవడె దైవము ఆర్ధ చిత్తుడై!

డొక్కలు మాడ్చుకొంచు నెవడును పనిచేయుట సాధ్యమౌనె? ఓ
బక్కగ కనంగలేదే? కొని వచ్చెను నీకయి నీ పడంతి బల్
మక్కువతోడ నోగిరము మధ్వి సమాన మనోజ్ఞరూప, నీ
కెక్కుడు ప్రీతి పాత్రమగు ఎర్రటి కారము ముద్ద పప్పులో!

ఉ॥ మట్టిని ముద్దులాడి శ్రమించెడి కర్షకుండు, చే.
పట్టిన పంటలన్ని తిన ప్రాప్తములేక తుఫాను దెబ్బతో
కొట్టుకు పోయెనే! వరద- కొంచము కూడ మిగల్చకుండ, నిం
కెట్టుల జీవనమ్ము పరమేశ్వర రైతుకు శాపమయ్యెనే

అమ్మలగన్నయయ్య దయనందిన ఆ కవిసార్వభౌముకున్
నెమ్మి నొసంగునట్టిదగు నిష్ఫల సేద్యమిదంచు దల్చకన్
నమ్మికనుంచి, కష్టపడి, నాలుగు గింజల పంటకోసమై
అమ్ముడు బోవుచున్ పరుల ఆకలి దీర్చెడి రైతు వర్గమున్
క్రమ్మిన చింత చీకటులు గ్రక్కున చీల్చెడి రోజు రావలెన్

చం॥ పలువురు రైతు సోదరులు ప్రాణములన్ త్యజియింప భావ్యమా!
వలసల నెంచుకోవలదు పాడియు, పంటయు నిచ్చు సేద్యమున్
హలమును చేతబూని దరహాసముతో పయనించుమోయి, నీ
కలతలు దీరిపోవు కలగాదిది సత్యము విశ్వసించుమా!

వాని తెక్కల కష్టంబు లేనినాడు
సస్య రమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు, వాడికి భుక్తిలేదు !

రూపశిల్పి
జోస్యుల వేణుగోపాల్
సాయి అపర్ణ గ్రాఫిక్,
గాంధీనగర్, విజయవాడ-3
ఫోన్ : 9440436806

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




**ఫిబ్రవరి 2021**

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి. వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరు నామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన సొంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

5.దయచేసి ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం: | తెలుగులో ఏలుబడికి కట్టుబడే పార్టీలకే ఓటు | | 07 |
| అమ్మనుడి పండుగ ప్రత్యేకం | తెలంగాణాతెలుగు భాషాభివృద్ధి:... | గట్లప్రవీణ్, పి.ప్రకాష్ | 09 |
| అమ్మనుడి పండుగ ప్రత్యేకం | ఎరుకల భాష–మాతృ.... | వారిజారాణి, సుబ్రహ్మణ్యశర్మ | 12 |
| విద్య–మాధ్యమం | ఆంగ్ల విద్య | రవీంద్రనాథ్ టాగూర్ | 13 |
| కొత్తమాట: | కొత్తమాటల పుట్టింపు | స.వెం.రమేశ్ | 18 |
| చదువు–ఆటలు: | అక్షరాలతో ఆటలు -1 | సి.వి.క్రిష్ణయ్య | 21 |
| వార్తావ్యాసం: | మహిళా చైతన్య కెరటం... | షేఖ్ మహబూబ్ బాషా | 29 |
| సంప్రదాయం–సాధికారత: | అమ్మనుడికి పట్టం కట్టిన... | పి.శివరామకృష్ణ'శక్తి' | 41 |
| సాహిత్యరంగం: | ప్రభావాలూ - ప్రలోభాలూ | మధురాంతకం నరేంద్ర | 47 |
| మాటల నిర్మాణం: | పదనిష్పాదనకళ | వాచస్పతి | 23 |
| ఆత్మకథ : | కొయ్యబొమ్మలాట కళాకారుడు | చంద్రప్ప సోబటి | 38 |
| నవల : | మాఊరు | అగరం వసంత్ | 43 |
| ధారావాహికలు: | పడమటి గాలితో... | గుజ్జర్లమూడి కృపాచారి | 26 |
| | అడుగుజాడలూ ఆనవాళ్లు-6 | ఈమని శివనాగిరెడ్డి | 34 |
| కవితలు : | మన తెలుగు | మేడిశెట్టి తిరుమలకుమార్ | 42 |
| | ఉసురు కింద ఉరిబాధ | దుర్గాప్రసాద్ అవధానం | 49 |



| ఫోటోలు | కార్టూన్లు | బొమ్మలు | కంప్యూటర్ |
|---|---|---|---|
| **అనుమల గంగాధర్** | **సరసి** | **చిదంబరేశ్వరరావు** | **బండారు రఘురాం** |

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.


రచనలను, వార్తలను, వాట్సయాప్‌లో పంపవద్దు: 'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సయాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
నుడి నాడు నెనరు   మాసపత్రిక

## చందా వివరాలు

| | | |
|---|---|---|
| జీవిత చందా | : | రూ.5000 |
| 4 సం॥ చందా | : | రూ.1000 |
| 1 సం॥ చందా | : | రూ. 300 |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు చెక్కు లేదా డి.డి.ని **'తెలుగుజాతి'** పేర పంపాలి.

## బ్యాంక్‌ఖాతా, ఫోను వివరాలు

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'తెలుగుజాతి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**TELUGU JAATHI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **914020020387880**

**IFSC Code : UTIB0000556**

**గూగుల్ పే/ ఫోన్ పే**

ద్వారా కూడా చందాను చెల్లించవచ్చును

ఆన్‌లైన్‌లో చందాను పంపేవారు వెంటనే ఇంటినెంబరు, వీధి పేరు, పోస్టాఫీసు, ఊరిపేరు, పిన్‌కోడ్ నెంబరుతో సహా తమ పూర్తి చిరునామాను, ఫోన్ నెంబరు, మెయిల్ ఐడి తదితర వివరాలను జాబు ద్వారా తెలుపగలరు.

**94929 80244** ఫోన్‌కు సందేశం గాని, వాట్స్‌యాప్ ద్వారా గాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి,**
గుంటూరు జిల్లా - 522 211.
ఫోన్ : 94929 80244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం, ముగింపు తేదీ- పత్రిక కవరుమీద మీచిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా కాలం ముగిసిపోయిన తర్వాత పత్రిక పంపబడదు. దయచేసి వెంటనే చందా పైకం పంపి, చందాను కొనసాగించుకోగోరుతున్నాము.
3. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
4. మీ ఇంటి నెంబరుతో సహా పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలుపండి.
5. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.
6. 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు మాత్రమే పోస్టులో పంపించగలము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలియజేయండి.

'అమ్మనుడి' పత్రికను నడపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ముఖ్య ఆధారంగా ఉన్నది గనుక - మీరు చందాదారులుగా చేరడంతో పాటు, మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.

-ప్రచురణకర్త

## ప్రోత్సాహకులుగా చేరండి

రు. 10,000/-లు, ఆపైన- విరాళంగా పంపి, 'తెలుగుజాతి ట్రస్టు'కు ప్రోత్సాహకులుగా మాతో చేరి సహకరించగోరుతున్నాము. అట్టి 'ప్రోత్సాహకులకు' పత్రికను శాశ్వతంగా పంపుతూ, ట్రస్టు ప్రచురించే ఇతర పుస్తకాలను కూడా వారికి సాదరంగా పంపగలము. దయచేసి మీరు ప్రోత్సాహకులుగా చేరి మా కృషికి తోడ్పడగోరుతున్నాము.

**తెలుగుజాతి (ట్రస్టు) ప్రచురణ**



# అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవాన్ని 2021 ఫిబ్రవరి 21న ఎల్లెడలా నిర్వహిద్దాం

## తెలుగు భాషోద్యమ సమాఖ్య పిలుపు

ప్రతి ఏటా ఫిబ్రవరి 21ని అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవంగా జరుపుకోవాలని యునెస్కో (ఐరాస) పిలుపు ఇచ్చింది. ఆ పిలుపునందుకొని 2000 సం. నుండి ప్రపంచమంతటా కార్యక్రమాలు జరుగుతున్నాయి. 2003లో అదే రోజున తెలుగు భాషోద్యమ సమాఖ్యను స్థాపించి, ప్రతి ఏటా ఫిబ్రవరి 21న తెలుగు ప్రాంతాలన్నింటా యునెస్కో సందేశాన్ని ప్రచారం చేస్తూ, ఆ సందర్భంగా అనేక కార్యక్రమాలను చేపడుతున్న సంగతి అందరికీ తెలిసిందే.

'మాతృభాష (అమ్మనుడి) లో చదువులు, ప్రజల భాషలో పరిపాలన' అనే ఆశయంతో అనేకమంది భాషోద్యమకారులు, విద్యా సంస్థలు, సంఘాలు, కృషి చేస్తూనే ఉన్నారు. ఈ ఏడాది కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ, ఇతర రాష్ట్రాల్లోని తెలుగు తావుల్లోనూ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకొందాం. దీనికి మరింత సరళమైన తెలుగుమాటగా – "ఎల్లనాదుల అమ్మనుడుల పండుగ" అని పిలుచుకొందాం. ఈ మాటను విస్తారంగా ప్రచారంలోకి తెద్దాం.

**–తెలుగు భాషోద్యమ సమాఖ్య**

## విద్య, సామాజ ప్రగతికై అనేక భాషలను ప్రోత్సహించాలి మాతృభాషలోనే తొలి చదువులుండాలి: 'యునెస్కో' పిలుపు

2021 సంవత్సరపు అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం ప్రధానాంశం **'విద్య, సమాజ ప్రగతికి అనేక భాషలను ప్రోత్సహించడం'** అని 'యునెస్కో' ప్రకటించింది. ఏ ఒక్కరిని వెనుకబడనీయకుండా అందరినీ కలుపుకుంటూ ముందుకు సాగడానికి ప్రతీ ఒక్కరూ పలు భాషలు నేర్చుకోవడం ముఖ్యమని యునెస్కో భావిస్తోంది.

**చిన్నవయసు నుండి విద్య మాతృభాషలోనే ప్రారంభం కావాలని, తద్వారా మాత్రమే విషయ పరిగ్రహణకు చక్కని పునాది పడుతుందని అంతర్జాతీయ సంస్థ యునెస్కో నమ్ముతోంది.**

అనేక భాషలు క్రమేణా అంతరించి పోతున్నందువల్ల ప్రస్తుత ప్రపంచంలో భాషావైవిధ్యం ప్రమాదంలో పడింది. ప్రపంచ వ్యాపితంగా దాదాపు 40 శాతం ప్రజానీకానికి వారు మాట్లాడే, లేదా అర్థం చేసుకునే భాషలో చదువుకునే అవకాశం లేకుండా పోతోంది.

పలు భాషలు, పలు సంస్కృతులతో కూడిన సమాజాలు కేవలం వారి వారి భాషల ద్వారా మాత్రమే ఉనికిని పొందుతున్నాయి. అవి మాత్రమే వారి సంప్రదాయాలను, జ్ఞానాన్ని, సంస్కృతిని ముందుకు తీసుకుపోతాయి. అందువల్ల మాతృభాషతో కూడిన అనేక భాషల విద్యావిధానం ఎక్కువమందిని ఆకట్టుకుంటోంది.

| జ్ఞానం | శాంతి | హక్కులు | ఏకత | వైవిధ్యం |
|---|---|---|---|---|
| ఉత్తమ జ్ఞానసాధన వ్యవస్థలు, ప్రపంచ అవగాహన | నిలకడైన అభివృద్ధికై వినిమయం, శాంతిని, సయోధ్యను నెలకొల్పడం | ప్రాథమిక మానవహక్కులు, స్థానిక ప్రజలకు స్వాతంత్ర్యం | సామాజిక ఏకత, అక్షరాస్యత,బీదరికాన్ని తగ్గించడం, అంతర్జాతీయసహకారం | సాంస్కృతిక విలువలు, వైవిధ్యం, వారసత్వం |



**ఈ లక్ష్యాల సాధన కోసం.... విద్య మాతృభాషలోనే ప్రారంభం కావాలి**

# ప్రాచీనతెలుగు విశిష్టకేంద్రాన్ని కాపాడుకొనేందుకు ఉద్యమించండి

కేంద్ర ప్రభుత్వం మైసూరులోని భారతీయభాషల సంస్థను ఒక విశ్వవిద్యాలయంగా మార్చేందుకూ, ప్రాచీనవిశిష్ట భాషల కేంద్రాలను దానిలో చేర్చేందుకు నిర్ణయించి, ఇందుకోసం ప్రణాళికను రూపొందించేందుకు ఒక నిపుణుల సంఘాన్ని నియమించిన సంగతి, దానివల్ల మనకు జరుగనున్న అన్యాయాన్ని గురించిన అంశాలు జనవరి 'అమ్మనుడి'లో మన ముందుకు వచ్చాయి. తెలుగుకు ప్రాచీనభాషా ప్రతిపత్తికై 2004 నుండి 2008 వరకు జరిగిన ఉద్యమంలో ముందుగా కదిలి అందరినీ మేల్కొల్పినవారిలో ఒకరైన ఆచార్య ఆర్.వి.యస్.సుందరం, ఇప్పుడు కొందరు మిత్రులతో ఈ విషయమై చర్చించి మన తక్షణ కార్యక్రమాన్ని సూచిస్తూ చేసిన విజ్ఞప్తిని ఈ కింద ఇస్తున్నాము. తెలుగు భాషోద్యమకారులూ, ఆసక్తిగల సంస్థలూ, వ్యక్తులూ ఇందుకోసం కదలి వెంటనే ఉద్యమించాలని కోరుతున్నాము. **–తెలుగుభాషోద్యమ సమాఖ్య 98480 16136**

### ప్రపంచంలోని తెలుగు సోదరులందరికీ విజ్ఞప్తి:

ఈ క్రింది మనవి ముఖ్యమంత్రి గారికి, మంత్రివర్యులకు, రాష్ట్రంలోని, కేంద్రంలోని ప్రజాప్రతినిధులకు, ప్రధానమంత్రి గారికి, ఉపాధ్యక్షులకు, తెలుగు సంఘాలకు, ఇందుకోసం ఏర్పడిన గోపాలస్వామి కమిటీకి (gopalaswamin@gmail.com) చేరవలసి ఉంది. తెలుగు వారికి తెలుగులో, ఇతరులకు ఆంగ్లంలో మీకు తోచిన మార్పులను చేసి పంపండి. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులకు అందజేయండి. సంక్షిప్త సందేశాలను ట్విట్టర్, ఇతర మాధ్యమాల ద్వారా పంపండి. మనం మేల్కొనకపోతే ఎంతో కష్టపడి సంపాదించుకున్న ప్రాచీన హోదాను పోగొట్టుకుంటాము **–ఆర్.వి.యస్.సుందరం**

## ప్రాచీనతెలుగు విశిష్టకేంద్రానికి స్వతంత్రప్రతిపత్తి కోసం ఉద్యమించండి

**భా**రత ప్రభుత్వం ప్రాచీన భాషల అభ్యున్నతికోసం సంస్కృతం, తమిళం, తెలుగు, కన్నడ, ఒడియా, మలయాళ భాషలకు ప్రాచీన హోదా ప్రకటించి అమలు చేస్తోంది. తమిళానికి ప్రాచీన హోదా ఇచ్చినప్పుడు (2004) తెలుగువారు, కన్నడిగులు నాలుగు సంవత్సరాలు పోరాడి 2008లో ప్రాచీన హోదాను సంపాదించుకున్నారు. ఇది తెలుగు వారి ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. 3000 సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు భాషకి ప్రాచీన హోదా రావటంవల్ల ఆ భాషాసాహిత్యాల ప్రాచీనతనిగురించి, వైశిష్ట్యాన్ని గురించి లోతుగా పరిశోధనలు జరిపేందుకు అవకాశం లభించింది.

సంస్కృతం, తమిళం ప్రాచీన హోదాని పొందటమే కాకుండా స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించుకున్నాయి. తెలుగు కేంద్రానికి కూడా అలాంటి స్వతంత్ర ప్రతిపత్తి లభించాల్సి ఉంది. ఇది ఇలా ఉండగా మైసూరులోని భారతీయ భాషా సంస్థను (సి.ఐ.ఐ.ఎల్) భారతీయ భాషల విశ్వవిద్యాలయంగా మార్చాలని భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఆ విశ్వవిద్యాలయ విధివిధానాలు, మార్గదర్శకాలను రూపొందించడానికి 11 మంది సభ్యులతో కమిటీని నియమించింది. ఈ కమిటీలో ఉభయ రాష్ట్రాల్లోని ఒక్క తెలుగు వారు కూడా లేకపోవడం విచారించదగ్గ విషయం. ప్రాచీన భాషల కేంద్రాలు భారత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయబోయే భారతీయ భాషల విశ్వవిద్యాలయంలో భాగంగా ఉండడానికి తగిన సూచనలను ఇవ్వవలసిందిగా విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం నియమించిన సమితిని ప్రభుత్వం కోరింది. వెంటనే తమిళ సోదరులు తమిళ కేంద్రాన్ని భారతీయ భాషల విశ్వవిద్యాలయంలో కలపడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి తమ వ్యతిరేకతను తెలియజేయడమే కాకుండా, పత్రికల ద్వారా కూడా తెలియజేశారు. తమిళ కేంద్రాన్ని వదలి తెలుగులాంటి ఇతర భాషలని మాత్రమే చేర్చే ప్రసక్తి ఉన్నా తమిళులు తమని మాత్రం వదిలెయ్యాలని పోరాటానికి సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని తెలుగువారు తప్పక గమనించాలి.

ప్రస్తుతం నెల్లూరులో ఉన్న ప్రాచీన తెలుగు కేంద్రాన్ని విశ్వవిద్యాలయంలో కలపడం వల్ల, స్వయం ప్రతిపత్తిని కోల్పోవడమే కాకుండా, అభివృద్ధి కుంటుపడుతుంది. దీనికి కేటాయించవలసిన ఆదాయవ్యయాలు కూడా విశ్వవిద్యాలయ పరిధిలోకి వెళ్ళి కుదించుకుపోయే అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో తెలుగుశాఖలు చాలా పనిచేస్తున్నాయి. అదే విధంగా హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలోను, అనంతపురంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలోను తెలుగుశాఖలున్నాయి. వీటన్నింటిలోను బోధన ప్రధానంగాను పరిశోధన పరిమితంగాను ఉన్నాయి.

ఈ నేపథ్యంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని భారతీయ భాషల విశ్వవిద్యాలయంలో కలపడం వల్ల తీవ్రమైన నష్టం కలుగుతుంది. ఈ కేంద్రం లక్ష్యాలను విశ్వవిద్యాలయం ద్వారా సాధించడం సులభతరం కాదు. కాబట్టి ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని స్వయం ప్రతిపత్తి కేంద్రంగానే విశ్వవిద్యాలయంలో కలపకుండా ఉంచాలని తెలుగు భాషాభిమానులు, సాహిత్యకారులు కోరుకుంటున్నారు. ముఖ్యంగా ఇది తెలుగువారి ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం. తెలుగుని కించపరచే ఈ ప్రయత్నాన్ని అడ్డుకోవలసి ఉంది.

ఈ విషయానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ప్రాచీన తెలుగు విశిష్ట కేంద్రానికి భూమిని కేటాయించాలి. కేంద్రానికి స్వతంత్ర ప్రతిపత్తిని కలిగించేందుకు చర్య తీసుకోవాలని కేంద్రానికి వెంటనే లేఖ రాయాలి. ప్రజాప్రతినిధులందరూ దీనిపై దృష్టి సారించి తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలి. లోకసభలోనూ, రాజ్యసభలోనూ మన ప్రతినిధులు ఈ విషయాన్ని ప్రస్తావించాలి. తమిళానికి ఇచ్చినట్లే తెలుగు కేంద్రానికికూడా స్వతంత్ర ప్రతిపత్తిని ఇవ్వాలని ఒత్తిడి తేవాలి.

**ప్రాచీన తెలుగు విశిష్ట కేంద్రం**
**స్వతంత్ర ప్రతిపత్తి సాధన సమితి**

సంపుటి : 6 సంచిక : 9
అమ్మనుడి
ఫిబ్రవరి 2021

సంపాదక హృదయం

# తెలుగులో ఏలుబడికి కట్టుబడే పార్టీలకే ఓటు

ఫిబ్రవరి 21 – ఎల్లనాడుల అమ్మనుడుల పండుగ. దీన్ని గొప్పగా జరుపుకోవలసిన బాధ్యత ప్రజలకూ, ప్రభుత్వానికీ ఉంది. ఇరవై రెండేళ్లుగా 'యునెస్కో' ఈ కట్టుబాటును మన ముందుకు తెచ్చింది. దీన్ననుసరించి ప్రపంచంలో ఎన్నో దేశాల ప్రభుత్వాలు, ప్రజాసంస్థలు, ప్రజలు జరుపుకొంటున్నారు. మన దేశంలో కూడా క్రమంగా ఈ అలవాటు పుంజుకొంటున్నది. కేంద్రప్రభుత్వం కూడా నాలుగైదేళ్లుగా ఈ పిలుపునిస్తున్నది.

ఉమ్మడి తెలుగురాష్ట్రంలో యునెస్కో పిలుపును ముందుగా పట్టించుకున్నది 'జనసాహితి' సాహిత్య సంస్థ. 2003 ఫిబ్రవరి21న తెలుగు భాషోద్యమసమాఖ్య పెద్దఎత్తున ప్రారంభమై తెలుగు రాష్ట్రంలోనే కాక, పొరుగురాష్ట్రాల్లోని తెలుగువారిలో కూడా కదలిక కలిగించింది. క్రమంగా ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ, దేశంలో పలురాష్ట్రాల్లోనూ పనిచేస్తున్న తెలుగు సాంస్కృతిక సంఘాలు ఈ పండుగను జరుపుకొంటున్నాయి. అయితే రెండు రాష్ట్రాలుగా ఏర్పడిన తర్వాత రెండు ప్రభుత్వాలూ ఈ సంగతిని పట్టించుకోవడంలేదు.

భాష ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రాలే అయినా, ప్రజల భాషల్లోనే పాలించాలనే ప్రాథమిక సూత్రానికి అవి కట్టుబడి ఉండడం లేదు. తప్పనిసరి అవసరం అయినంతవరకే ప్రజలభాష వారికి కావాలి. ఓట్లకోసం, సీట్లకోసం తప్ప దేనికీ ప్రజాభాషలను పట్టించుకోరు.

పరిమితికి మించి ఆంగ్ల భాషను వినియోగిస్తూ క్రమంగా విద్యారంగాన్నంతా ఆంగ్లంలో నడిపే ధోరణి ప్రబలడంతో, పరిపాలనారంగమంతా ఆ భాషకు లొంగిపోయింది. నేటితరం పిల్లలు తెలుగు లిపిని చదవలేని స్థితి ఏర్పడింది. మచ్చుకు, ఇప్పుడువస్తున్న తెలుగు సినిమాల పేర్లు, వాటి ప్రకటనలనూ చూడండి. అంతా ఇంగ్లీష్‌లోనే. సినిమా పేరు మాత్రమే తెలుగులో, తక్కిన వివరమంతా ఆంగ్లంలో. కొన్న సినిమాలకైతే ప్రకటనల్లో ఒక్క తెలుగు అక్షరం కూడా ఉండదు. ఏ తెలుగు దినపత్రికను చూసినా ఈ ధోరణి కనబడుతుంది. ఏరంగంలోనైనా ఇదే పోకడ. ప్రభుత్వ పథకాలను మాత్రం భారీగా తెలుగులో కూడా పత్రికల్లో ప్రభుత్వం ప్రకటిస్తుంది– అవి ఓట్లను తెచ్చేవి గనుక! ప్రభుత్వమే కాదు, బ్యాంకులతో సహా అన్ని సంస్థల్లో ఇదే ధోరణి. ప్రభుత్వ జి.ఒ.లు అన్నీ ఆంగ్లంలోనే. వాటి గురించి మాట్లాడడం మాత్రమే తెలుగులో! ప్రజావేదికల మీదా చట్టసభల్లోనూ మన రాజకీయ నేతలు తిట్టుకొనేదీ, కొట్టుకొనేదీ తెలుగులోనే! ఆ పని ఆంగ్లంలో చేతగాదు కనుక!

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ, రెండవసారి ఏర్పడిన ప్రభుత్వాలు తెలుగులో పరిపాలించడాన్ని పూర్తిగా మరిచిపోయాయి. విద్యారంగం సంగతి సరేసరి! ఆంధ్రప్రదేశ్‌లో అయితే ఆంగ్లాన్ని అతిగా నెత్తిన పెట్టుకొని మోస్తున్న సంగతి అందరకూ తెలిసిందే. ప్రాథమిక విద్యలో తెలుగు విషయంలో అవమానకరమైన ధోరణిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రవర్తిస్తున్నారు. ప్రజలను పూర్తిగా తప్పుదారి పట్టిస్తూ రాజకీయ ప్రయోజనమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఈ ధోరణిని ప్రదర్శించడం లేదుగాని తెలుగు భాష కోసం పాలనలో గాని, చదువుల్లోగాని వారు చేస్తున్నదేమీలేదు. ప్రజల భాషల విషయంలో కేంద్రప్రభుత్వవిధానాన్ని 'అమ్మనుడి'లో ఇటీవల చర్చించుకొంటూనే ఉన్నాం. కొత్తవిద్యావిధానంలో ప్రజాభాషల విషయంలో కేంద్రం సవతి తల్లి ప్రేమనూ, డొల్లతనాన్నీ స్పష్టంగా విమర్శించాం. మొదట్లో కొందరు మా అభిప్రాయాలను తప్పుపట్టారు. కాని, ప్రాచీన భాషల వ్యవస్థల్నీ, భారతీయ భాషల సంస్థనూ కలిపివేసి ఒక విశ్వవిద్యాలయాన్ని పెట్టాలనే కేంద్ర ఆలోచన వెనుక ఉన్న పక్షపాత వైఖరినీ, దురుద్దేశాన్నీ బయటపెట్టిన తరువాత, వారు తిరిగి ఆలోచిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ భాషోద్యమకారులూ, బోధన, పాలనా రంగాల్లో ఉన్న తెలుగువారూ తమ బాధ్యతలను గుర్తెరిగి ఉద్యమించాలి. తెలుగుజాతి ప్రయోజనాలనూ, ప్రజాస్వామ్యాన్నీ కాపాడుకోవాలని భావించేవారంతా ఉద్యమించాలి.

తెలుగులో ఏలుబడికి కట్టుబడి ఉంటామని తమ పార్టీ ప్రణాళికలో ప్రకటించని రాజకీయ పార్టీలకు ఓటు వెయ్యవద్దని ప్రకటించాలి. ఫిబ్రవరి 21న జరిగే కార్యక్రమాల్లో ఈ అంశాన్ని ప్రచారంలో పెట్టాలి.

తేదీ : 28-01-2021

సామల రమేష్‌బాబు

# పద్మశ్రీ గౌరవాన్ని పొందిన
# ఆదివాసీ కళాకారుడు కనకరాజుకు జేజేలు



**భా**రత గణతంత్ర దినోత్సవంనాడు ఒక గురువు, నిరుపేద ఆదివాసీ కళాకారుడు కనకరాజుకు 'పద్మశ్రీ' గౌరవాన్ని అందించి కేంద్ర ప్రభుత్వం ఆలస్యంగానైనా మంచిపని చేసింది. మూలవాసుల భాషాసంస్కృతులను గౌరవించినట్లయింది.

గోండి ఆదివాసీ ఆట దండారి కళాకారుడు కనకరాజు గణతంత్ర దినోత్సవంలో, ఇందిరాగాంధీ, జ్ఞానీ జైల్ సింగ్, అబ్దుల్ కలాం వంటి మహామహుల ముందు ప్రదర్శనలిచ్చాడు. దశాబ్దాలుగా ఆ ఆటను యువతరానికి నేర్పుతున్నాడు. ఆయనకు ఇప్పుడు పద్మశ్రీ పురస్కారం రావటం, గోండ్వానాతో, దండకారణ్యంతో ముడిపడిన ఆ సంస్కృతికి, వారి కళకు గుర్తింపునిస్తుంది. ఆశ్రమపాఠశాలలో కూలీగా పనిచేస్తున్న తనను ఈ పురస్కారంతో పాటు ఇచ్చే నగదు కొంతైనా ఆదుకొంటుందని ఆశపడుతున్నాడు. ఇటువంటి కటికదరిద్రం లోకూడా తమ తమ సమష్టి సంప్రదాయాలను నిలబెట్టుకోవాలనే ఈ మూలజాతులకు జేజేలు పలకాలి.

మొక్కజొన్న పంట చేతికందే దీపావళికి ఊరూరా తిరుగుతూ జరుపుకునే గోండులు పండుగలో, తప్పిదాల వల్ల శాపగ్రస్తులైన, తమ పూర్వులు ఒక గుహలో బందీ కావటం, మహాదేవుని మనసు కరిగేలా వారి కష్టాలను గానం చేసి వినిపించిన నృత్య గాన దేవతలను ఆహ్వానిస్తూ 16 వాయిద్యాలు, 18 నృత్తరీతులతో ఆడేదే ఈ దండారి. వారిని ప్రసన్నం చేసుకుని, వారి పరమగురువు పహండికూపర్ లింగాల్ నాలుగు గోత్రాల వారికి, నాలుగు జెండాలు, నలుగురు దేవతలను ఏర్పరచి, వారిని వ్యవసాయంలో స్థిరపరచటంలో ఒడిదుడుకులు ఈ పాటలు, తంతులో కథావస్తువు. ఈ దండారిలో నెమలీకలు ధరించి తలపాగాలో అద్దాలు, పూసలు, గవ్వలతోపాటు జింక, మేకకొమ్ములు; చేతికర్ర, భుజాన జింక, పులిచర్మాలతో అలంకరించుకునే గుసాడీ ఈ బృందంలో ప్రత్యేక ఆకర్షణ. గుసాడీలు ఒళ్ళంతా ఊపుతూ ఆడుతుంటే, వాయిద్యాలు మోగుతుంటే, వారు వేసుకున్న గుల్లలు, గంటలు, బెండ్లు లయాన్వితంగా చప్పుడు చేస్తుంటాయి. డెంసా పాటలు పాడుతూ గుమ్మెల దరువులకు అనువుగా పార, తుర్బులి, డప్పు, పిప్రి, కాలికోం వంటి వాద్యాలు వాయిస్తూ పర్ధాన్, కొలాం, తోటి తెగవారు కూడా పాల్గొంటారు. మధ్యలో ఖేల్ అంటే రాజకీయ సామాజిక పరిస్థితుల మీద చిన్న నాటికలు వేస్తారు. గోండుదేవతలను ఆరాధిస్తూ భజనలు చేస్తారు. పక్కన మహారాష్ట్రలో పండరి భజనలో లాగా ఒకరు స్త్రీ వేషం వేసుకుని భజనలకు అనుగుణంగా నర్తిస్తారు..ఇలా భక్తిని రక్తిని ముక్తిని మేళవించుకున్న విశిష్టమైన పరంపర ఈ దండారి.

కొమరం తిరుగుబాటును అణిచివేశాక ఈ జాతుల సంస్కృతి, అభివృద్ధి సమస్యలను అర్థం చేసుకోడానికి మానవ శాస్త్రవేత్త హైమెండార్ఫ్‌ను నాటి ప్రభుత్వం పిలిపించింది. ఆయన చెంచు, కొండరెడ్డి, గోండు జాతులను అధ్యయనంచేసి, నిజాం ప్రభుత్వానికి సలహాదారుగా పనిచేశారు. ఆయన శిష్యుడు మైకేల్ యార్క్ వారి ఆటపాటలను ఫిల్మ్‌గా తీశారు. 1977లో పి.యస్.సుబ్రహ్మణ్యం, తరువాత గారపాటి ఉమామహేశ్వరరావు గోండు భాషను అధ్యయనం చేశారు. జయధీర్ తిరుమలరావు మరుగుపడిపోతున్న లిపిని ప్రచారంలోకి తెచ్చారు. ఆదిలాబాదు ఆకాశవాణి ద్వారా ఈ తెగల పాటలను రికార్డ్ చేయటమే కాక, గిరిజన సంక్షేమశాఖ ద్వారా మైకేల్ యార్క్ పర్యటనను ఏర్పాటుచేయటం, నాటి ఫోటోలు, ఫిల్ములు భద్రపరుస్తున్నారు. శక్తి శివరామకృష్ణ అటవీ హక్కుల గుర్తింపులో, పంచాయత్ రాజ్ చట్టం అమలుకు కరదీపిక తయారు చేసి శిక్షణనిచ్చారు. గిరిజనోద్యమ నాయకులు రాసిన 'అడవిలో వెన్నెల' కథా సంకలనం నాటికీ నేటికీ గిరిజనుల సమస్యలకు అద్దం పడుతుంది. అల్లం రాజయ్య రచనలు ఉద్యమస్ఫూర్తిని రగిలిస్తాయి. ఇందరి కృషిని రంగరించుకుని ముందుకుపోతూ దండారి వంటి గిరిజనుల ఆటపాటలు వృద్ధిలోకి రావాలని ఆశిద్దాం.

మూలవాసుల కళలతోపాటు వారి భాషలు కూడా ఎదిగేందుకు కనీసం ప్రాథమిక విద్యనైనా వారి సొంతనుడిలో చదువుకోనిచ్చేందుకు తగిన వసతులను, అవకాశాలను కలిగించాలి. వారు ఆరోగ్యంగా జీవించేందుకు, అభివృద్ధిచెందేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలి. 'పద్మశ్రీ'ని అందించి 'కనకరాజు'ను గౌరవించడంతో సరిపెట్టుకోకుండా, డెబ్బదేళ్ల వయసులో ఉన్న ఆయన కుటుంబ సభ్యులతో కలసి సుఖంగా జీవించేందుకు తగిన ఆర్థిక సహాయాన్నీ ప్రభుత్వం అందించాలి.

**-అమ్మనుడి**

డా. గట్ల ప్రవీణ్
పి. ప్రకాష్

# తెలంగాణాతెలుగు భాషాభివృద్ధి: భాషానిధి ఆవశ్యకత

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆర్థిక, భౌగోళిక, రాజకీయ, సామాజిక అంశాలతోపాటు, తెలంగాణ భాష కూడా ప్రముఖ పాత్రను పోషించిందన్న విషయం అందరికీ తెలిసినదే. దానికి ముఖ్య కారణం మనం మాట్లాడే తెలుగు ప్రామాణిక తెలుగు కంటే భిన్నంగా ఉండడమే. అంతే కాకుండా తెలంగాణ తెలుగు అవహేళనకు గురవుతుందనే భావన తెలంగాణలో చాలా బలంగా నాటుక పోయింది. అందువలన ఎక్కడ చూసినా ప్రామాణిక తెలుగు (వాడుకలో) తప్ప, మనం మాట్లాడే భాష ప్రభుత్వ, విద్య, సినిమా, దినవారమాస ప్రత్రికలలో వివిధ రంగాల్లో ఉండక పోవడం లేక ఆడక పోవుట్ల తెలంగాణా తెలుగుకు ఒక ప్రత్యేక గుర్తింపు రాకపాయే. తెలంగాణ ఉద్యమ పోరాటంలో ప్రజలంతా గొంతెత్తి మా నీళ్లు మాకేనని, మా ఉద్యోగాలు మాకేనని, మా భూములు మాకేనని అన్న గద్దరన్న మాటలూ పాటలూ, కళాకారుల పాటలూ, కార్మికుల ఆకలికేకల రాగాలూ మొదలైనవి ప్రజలలోకి చొచ్చుకొని పోయి ఉద్యమ స్ఫూర్తిని నింపాయి. ఇలాంటి నినాదాలు ప్రజల్లో ఎంత ప్రభావాన్ని చూపాయో, అదే విధంగా మన తెలంగాణ భాష కూడ అంతే బలంగా ఉద్యమంలో పని చేసింది అని చెప్పవచ్చు. అదే విధంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాట సమయంలో ముందెన్నడూ రానంత విధంగా తెలంగాణలో జ్ఞాన సృష్టి, సాహిత్య సృష్టి జరిగింది. అందులో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి మాటలూ, ఆటపాటలూ, ఉద్యమ గేయాలూ, కవితలూ, తెలంగాణ బతుకు తెరువును చిత్రీకరించే కథలూ మొదలైనవి. సామాన్య ప్రజల నుంచి రాజకీయ నాయకుల వరకూ రకరకాల రచనలు చేశారు. ఈ సాహిత్యమంతా కేవలం తెలంగాణ గురించి కాకుండా వారి బతుకు చిత్రాన్ని కళ్లకు కట్టినట్టుగా చిత్రీకరించారు. ఇవన్నీ ప్రజల భాషలో అంటే తెలంగాణ మాండలికంలో రావడం వలన, అవి ప్రజల మనస్సుల్లోకి చాలా లోతుగా చొచ్చుకొని, పాతుకు పోయాయి. ఇక్కడ మనం మరో విషయాన్ని గమనించాలి, ఏదైనా ఒక విషయం మన సొంత భాషలో అంటే మన మాతృభాషలో అమ్మభాషలో వ్యక్తపరిస్తే అది మన హృదయానికి ఎంత బలంగా హత్తుకుంటుందో మనం అనుభవించే ఉంటాము. దీనిని బట్టి మనం మాతృభాష ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చు.

**తెలంగాణ తెలుగు**

తెలంగాణ తెలుగుకూ, ప్రామాణిక తెలుగుకూ మధ్య వ్యత్యాసం ఉందన్న విషయం మనందరికీ తెలిసినదే. అవి ధ్వని, వర్ణ, పద, వాక్య, అర్థ స్థాయిలలో ప్రస్ఫుటమవుతాయి. మన మాండలికం ప్రామాణిక తెలుగు కంటే భిన్నంగా ఉంటుంది. ఉదాహరణకు వచ్చాడు :: వచ్చిండు, పోయాడు :: పోయిండు, తింటాడు :: తింట్టుండ్రు, అబ్బాయి :: పిల్లగాడు, వంకాయ :: అంకాయ మొదలైనవి. తెలంగాణ తెలుగును అన్ని రంగాల్లో ఆడకుండా నిర్లక్ష్యం చేయడానికి రాజకీయ, సామాజిక, ఆర్థిక కారణాలు ఉండివుండవచ్చు. ఈ విషయం తెలంగాణ సామాన్య ప్రజలు గ్రహించడం వలన, అన్ని సమస్యలతో సమానంగా తెలంగాణ భాష కూడా ఉద్యమంలో అంతే బలంగా తెలంగాణ పోరాటంలో పనిచేసిందని చెప్పవచ్చు. కానీ తెలంగాణ ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరువాత, తెలంగాణ భాష గురించి ప్రభుత్వం చేసింది తక్కువ అని చెప్పవచ్చు. కానీ తెలంగాణ భాషను చూసే దృష్టి కోణంలో ఎంతో మార్పు వచ్చింది. ప్రభుత్వ, ప్రభుత్వేతర, సినిమా, దృశ్యశ్రవణ మాధ్యమం మొదలైన రంగాలలో తెలంగాణ భాష అవహేళనకు గురైంది. అందులో ముఖ్యంగా సినిమా రంగంలో చాలా విరివిగా కనిపించేది. ఎందుకంటే సినిమాలో ఎక్కువగా ప్రతినాయకుడి పాత్రలకు లేదా విలన్ పాత్రలకు మాత్రమే తెలంగాణా యాస ఎక్కువగా ఉపయోగించేవారు. ఉదాహరణకు తెలంగాణ శకుంతల అనే నటీమణికి డైలాగ్స్ తెలంగాణ మాండలికంలోనే రాసేవారు, చెప్పించేవారు కూడా. అందువలన జనాల్లో తెలంగాణా భాష పట్ల సినిమా రంగంలో, పరిపాలనా రంగంలో చిన్న చూపు ఏర్పడింది. కానీ తెలంగాణ వచ్చిన తరువాత తెలంగాణా భాష కేవలం సినిమా రంగంలోనే కాకుండా అనేక రంగాల్లో ఎంతో మార్పును తీసుకువచ్చిందని చెప్పవచ్చు. ఉదాహరణకు కరీంనగర్, వరంగల్లు జిల్లాల్లో, సికింద్రాబాదు, హైదరాబాదు జంట నగరాలలో హోటళ్ల పేర్లూ, భోజన శాలల పేర్లూ, కర్రీ పాయింట్ల పేర్లూ తెలంగాణ పల్లెటూరి వాతావరణం ఉట్టిపడేలా పెడుతున్నారు. కానీ అంతటితో సరిపోదు. మనం తెలంగాణా భాషనూ మరింత అభివృద్ధి పరుచుకోవాలి. అప్పుడే మనం తెలంగాణా ఉద్యమంలో నినదించిన నినాదాలు సార్థకమవుతాయి. అప్పుడే మన భాష, మన యాస అనే నినాదానికి సరైన అర్థం లభిస్తుంది. అందుకోసం తెలంగాణా భాషను అన్ని రంగాల్లోకి విస్తరించాలి. ఇప్పటికే తెలంగాణ తెలుగుపై అనేక భాషల (మరాఠీ, కన్నడం, ఉర్దూ, పర్షియన్) ప్రభావం ఉండడం వలన, అందులో ఎంతో వైవిధ్యం కలిగి ఉండడం చేత, తెలంగాణ తెలుగు ఒక భాష కాదని అదొక మాండలికమే అనే భావన ప్రజల్లో ఇంకా ఉంది. కావున మనం దీనిని శాస్త్రీయంగా నిరూపించాల్సిన అవసరం ఉంది.

**తెలంగాణ తెలుగు పై పూర్వ పరిశోధనలు**

ఇప్పటి వరకు చాలా మంది తెలంగాణా తెలుగుపై కొన్ని చెప్పుకోదగ్గ పరిశోధనలు చేశారు, అందులో ముఖ్యమైనది తెలుగు అకాడమీ, హైదరాబాదు. **తెలుగు అకాడమీ ప్రచురించిన జిల్లాలవారీ మాండలికాల బులెటెన్లూ, తెలుగు విశ్వవిద్యాలయం వారు తెలంగాణా రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుండి తెలంగాణా తెలుగు భాషానిధిని సమకూర్చి నిఘంటువులను అందుబాటులోకి తెస్తున్నారు అని ప్రచారంలో ఉంది. కానీ ఇంతవరకూ కార్యరూపం దాల్చినట్టుగా అయితే కానరాలేదు.** దానికి పరిశోధకుల కొరత, నిధుల కొరత, ఇంచార్జీ ఉపకులపతులతో విశ్వవిద్యాలయం నడపడం ఇలాంటి అనేక కారణాలు కావచ్చు. ఇంకా చాలా మంది పరిశోధకులు వివిధ

స్థాయిలలో వ్యక్తిగత అసక్తితో తెలంగాణా భాష పైన పరిశోధనలు చేశారు చేస్తున్నారు కూడా.

**తెలంగాణ తెలుగు భాషానిధి ఎందుకు ?**

అవిభక్త ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ (1985 నుంచి తెలుగువిశ్వవిద్యాలయం) భద్రిరాజు కృష్ణమూర్తి గారి అధ్వర్యంలో మాండలిక వృత్తిపదకోశాలు అనే పేరుతో ఒక సమగ్రమైన సర్వేను 1974 లో చేపట్టింది. అందులో ముఖ్యంగా వారు వ్యవసాయం, చేనేత, వడ్రంగం, మేదర, కళలు, కమ్మరం, కుమ్మరం, మొదలైన అనేక సాంప్రదాయిక వృత్తుల నుంచి పద సేకరణ చేసి, వివిధ సంపుటాలుగా తెలుగు అకాడమీ 25 వృత్తిపదకోశాలను ప్రచురించారు. వీటిని ఆధారంగా చేసుకొని భద్రిరాజు కృష్ణమూర్తి గారు తెలుగును నాలుగు మండలాలుగా విభజించారు (చూ. తెలుగు భాషాచరిత్ర). ఇలాంటి గొప్ప సర్వే భారతదేశంలోని ఏ భాషలోనూ దీనికి ముందుగాని లేదా తరువాత గానీ జరగలేదు. **తెలంగాణా తెలుగులో నిక్షిప్తమై ఉన్న జ్ఞాన భాండాగారాన్ని బయటికి తీయాలన్నా, తెలుసుకోవాలన్నా, పరిశోధనలు చేయాలన్నా, తెలంగాణ భాషపై అధ్యయనాలు జరగాలన్నా తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ తెలుగుపై పరిశోధనలు చేయడానికి తెలంగాణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.** దానితో పాటుగా ఇప్పటివరకు వివిధ రంగాల్లో తెలంగాణా తెలుగులో ప్రచురితమైన సాహిత్యాన్ని ప్రచురణ కర్తల నుంచి, రచయితల నుంచి సేకరించి మన తెలంగాణా తెలుగుకు కావలిసిన సాంఖ్యిక భాషానిధిని సమకూర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రపంచీకరణ నెపథ్యంలో సాంకేతికంగా అభివృద్ధి చెందని భాషలు ఆపన్న లేదా అత్యాపన్న భాషల జాబితాలో చేరడానికి ఇదొక కారణమని యునెస్కో హెచ్చరికలు జారీ చేసింది. ఈ జాబితాలో చేరకుండా ఉండాలంటే మన భాషని ఆధునీకరించుకొని ఆధునిక అవసరాలకు వాడుకునే విధంగా అభివృద్ధి చేసుకోవాలి. అప్పుడే మన తెలుగు నాలుగు కాలాల పాటు నిలబడుతుంది.

**ఆంగ్ల భాషానిధులు:**

1960 నుండి ఆంగ్లంపై భాషానిధి ఆధారిత పరిశోధనలు మొదలయ్యాయి. సాంఖ్యిక రూపులో ఉన్న పాఠనిధులు లేక భాషానిధులు భాషాశాస్త్ర విశ్లేషణ చేయడానికి ఉపకరిస్తాయి. ఆంగ్ల భాషాశాస్త్ర పరిశోధకులు సాంఖ్యిక రూపంలో సమాచారాన్ని నిక్షిప్త పరిచి వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, భాషానిధి నిర్మాణం, భాషావిశ్లేషణ, భాషోపకరణాలను తయారు చేశారు. ఉదాహరణకు బ్రిటిష్, అమెరికన్ ఇంగ్లీషు మధ్య ఉన్న భేదాలను వైవిధ్యాన్నీ వెలికి తీయడానికి బ్రౌన్, బ్రిటిష్ నేషనల్ భాషానిధులను రూపొందించారు. సాంఖ్యిక నిధులను మొదటి తరం, రెండో తరం అంటూ రెండు భాగాలుగా విభజించారు.. మొదటి తరం నిధులలో భాగంగా బ్రౌన్ కార్పస్ (ఫ్రాన్సిస్, కుసెరా 1964), లాన్ కాస్టర్ ఒస్లో బర్గెన్ (ఎల్. ఓ. బి.) (మూడు విద్యా సంస్థలు సంయుక్తంగా బ్రిటిష్ ఇంగ్లీషు భాషానిధి నిర్మాణం చేపట్టారు), లండన్ లుండ్ కార్పస్ (ఎల్.ఎల్.సి.) (జన్ స్వార్తిక్, 1975) మొదలైనవి అభివృద్ధి చేశారు. రెండో తరం నిధులలో భాగంగా కోబిల్డ్ ప్రాజెక్ట్ (జాన్ సిన్ క్లేర్, 1980), లాంగమెన్ కార్పస్ నెటవర్క్ (జోహన్సన్, 1970-78), బ్రిటీష్ నేషనల్ కార్పస్ (లాంగ్మెన్ అండ్ డబ్లు. ఆర్. చాంబర్స్, 1991-94), ఇంటర్నేషనల్ కార్పస్ ఆఫ్ ఇంగ్లీషు (గ్రీన్ బామ్, 1988) మొదలైనవి. వీటిని లిఖిత, మౌఖిక భాషలను ఆధారంగా రూపొందించారు. అంతే కాకుండా బ్రౌన్ కార్పస్, బ్రిటీష్ నేషనల్ కార్పస్లను నిర్మించిన పద్ధతిలోనే కెనెడియన్, న్యూజిలాండ్, స్విట్జర్ లాండ్ ఇంగ్లీషు భాషానిధుల (కార్పొరా), బ్యాంక్ ఆఫ్ ఇంగ్లీషు భాషానిధుల నిర్మాణం వివిధ విశ్వవిద్యాలయాలలో చేపట్టారు. బ్రౌన్ కార్పస్, బ్రిటీష్ నేషనల్ కార్పస్లను (బి.ఎన్.సి) ఆధారంగా చేసుకొని ఇండియన్ ఇంగ్లీషు భాషానిధిని ఆచార్య ఎస్.వి. శాస్త్రి (1988) గారు శివాజీ విశ్వవిద్యాలయం, మహారాష్ట్రలో నిర్మించారు.

**భారతీయ భాషలలో భాషానిధులు:**

భారతీయ భాషల (ఎమిల్లీ) భాషానిధిని యు.కె.లోని లాంకాస్టర్ విశ్వవిద్యాలయం (ఎనెబిలింగ్ మైనారిటీ లాంగ్వేజ్ ఇంజనీరింగ్) (ఆన్థోని, వారి టీమ్ మెంబర్లు), భారతీయ భాషా కేంద్రం(జయరాం, ఉదయ్ నారాయణ్ సింగ్), భారత ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ఎమిల్లీ ప్రాజెక్ట్ లో భాగంగా నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ లో అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, హిందీ, కన్నడ, కశ్మీరీ, మలయాళం, మరాఠీ, ఒరియా, పంజాబీ, సింహళ, తమిళం, తెలుగు మరియు ఉర్దూ మొదలైన భారతీయ భాషలకు పాఠనిధులను అభివృద్ధి చేశారు. భారతీయ భాషలకు భాషాశాస్త్ర సమాచార సమితి (లింగ్విస్టిక్ డేటా కన్సార్టియం ఫర్ ఇండియన్ లాంగ్వేజస్) అనే పేరుతో భారతీయ భాషా సంస్థ, మైసూరు డిపార్టమెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, భారత ప్రభుత్వం సహకారంతో భారతీయ భాషల భాషానిధిని నిర్మించారు. ఇందులో దాదాపు ముప్పై లక్షల పదాల నిడివిగల భాషానిధిని ప్రధాన భారతీయ భాషలకు (ద్రావిడ, ఆర్య) నిర్మించారు. వివిధ భారతీయ విశ్వవిద్యాలయాలు (హైదరాబాదు విశ్వవిద్యాలయం, ఐ.ఐ.ఐ.టి., హైదరాబాదు, ఐ.ఐ.టి కాన్పూర్, జవహరలాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ, వివిధ పరిశోధన సంస్థలు) ఈ భారతీయ భాషానిధిని ఉపయోగించి, ప్రధాన భారతీయ భాషలకు భాషోపకరణాలను అభివృద్ధి చేశారు.

ఆ తరువాత లింగ్విస్టిక్ డేటా కన్సార్షియం ఫర్ ఇండియన్ లాంగ్వేజస్ ప్రాజెక్టులో భాగంగా భారతీయ భాషలకు (తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ) భాషాభాగాలను గుర్తించారు, టీకాసహిత పాఠనిధులను తయారు చేశారు. ఆ తరువాత జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో హిందీ నుండి ఇతర భారతీయ భాషలకు (తెలుగు, ఒడియా, పంజాబీ, బెంగాలీ మొదలైనవి) సమాంతర పాఠనిధులను తయారు చేశారు. ఇలాంటి సమాంతర పాఠనిధులు యంత్రానువాద ఉపకరణాలను అభివృద్ధి చేయడానికి ఉపయోగపడతాయి. అదే విధంగా ఆచార్య జి.ఉమామహేశ్వరరావు గారు కోటి పదాల తెలుగు భాషానిధిని లాంగ్వేజ్ టెక్నాలజీ లాబరేటరి, అనువర్తిత భాషాశాస్త్రజ్ఞుల మరియు అనువాద అధ్యయనాల కేంద్రం, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అభివృద్ధి చేశారు. ఈ భాషానిధి ఆధారంగా తెలుగు పద విశ్లేషిణీ పద జనకం, భాషాభాగాల గుర్తింపు, వాక్య విశ్లేషిణి, యంత్రానువాదం, తెలుగు దిద్దరి మొదలైనవి ఎన్నింటినో

అభివృద్ధి చేశారు. ఈ ఉపకరణాలన్నీ కాల్స్ జాలతావు (వెబ్ సైటు) లో ప్రజలకు వాడుకోడానికి అందుబాటులో ఉంచారు.

**ప్రజల కర్తవ్యం**

తెలంగాణ ప్రజలు ఎక్కడున్నా ఏ దేశంలో ఉన్నా, ఏ ఖండంలో ఉన్నా, ఏ రాష్ట్రంలో ఉన్నా తూచ తప్పకుండా తెలంగాణా తెలుగులో జ్ఞానసృష్టి చేయాలి. అందుకు విరివిగా ఈ మాండలికంలో కథలూ, కవితలూ, నవలలూ, సృజనాత్మక సాహిత్యాన్నీ ఎప్పటికప్పుడు అంతర్జాలంలో ప్రకటించాలి. అవి యూనికోడులోనే ఉండాలి. వాటిని అంతర్జాలంలో ఉచితంగా అందుబాటులో పెట్టాలి. ఫేస్‌బుక్, వాట్సాప్, కోరా, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్ మొదలైన సామాజిక మాధ్యమాలలో మన భాషలోనే రాయాలి. ప్రపంచమంతా వ్యాపించి ఉన్న తెలంగాణ వాళ్ళందరూ స్వచ్ఛందంగా జ్ఞానసృష్టి చేయాలి. రచయితలూ, కవులూ, గాయకులూ, కళాకారులూ, విమర్శకులూ, నవలాకారులూ వారి వారి రచనలను, రాతప్రతులను యూనికోడ్ లోనే రాయాలి. అవన్నింటిని కూడా చదువుకోవడానికి ప్రజలు దిగుమతి చేసుకోడానికి అంతర్జాలంలో ఉచితంగా అందుబాటులో ఉంచాలి. అప్పుడే తెలంగాణ తెలుగు అంతర్జాలంలో విశ్వవ్యాప్తంగా కనవడుతుంది, వినవడుతుంది. అలా ఉంచిన వాటిని సమయానుసారంగా అంతర్జాలం నుండి భాషాశాస్త్రజ్ఞులు, భాషానిపుణులు సాలెగూళ్లలో ఉన్న సమాచారాన్ని దిగుమతి చేసుకొని భాషానిధిని అభివృద్ధి చేస్తుండాలి. ఇదొక నిరంతర ప్రక్రియ. ఒక యంత్రాంగం ఈ ప్రక్రియ పై ఎల్లప్పుడూ పనిచేస్తుండాలి. అప్పుడే తెలంగాణ భాషానిధిని నిర్మించగలము.

**చేయాల్సిన పరిశోధనలు**

తెలంగాణ భాషా స్వరూపం, వర్ణనాత్మక వ్యాకరణాలనూ, నిఘంటువులనూ కూర్చాల్సిన ఆవశ్యకత ఉంది. ఇతర భాషల ప్రభావం మొదలైన వాటిపై మరింత విస్తృతస్థాయిలో పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే వాటితో పాటు తెలంగాణ తెలుగును అన్ని రంగాలకు విస్తరించి అమలు చేయడానికి ఒక శాస్త్రీయ అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత కూడా ఉంది. మన భాషపై మనకు అమితమైన ప్రేమాభిమానాలు, గౌరవం, అనుబంధం, ఇష్టం ఉండడం వేరు శాస్త్రీయ దృక్పథంతో భాషని అధ్యయనం చేయడం వేరు. ఎందుకంటే ఇంకా నేడు ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్ల ప్రభావం చేత అనేక భారతీయ భాషలు (గిరిజన, లిపిలేని భాషలు, అల్పసంఖ్యాక భాషలు కోకొల్లలు) అంతరిస్తున్న సమయంలో మన భాషనూ కాపాడుకోవాలంటే, అన్ని రంగాలలో భాషను తప్పకుండా అమలు చేయాలి. అందుకు తెలంగాణా భాషపై ఒక సమగ్ర అధ్యయనం జరగాలి. దాని కోసం ముందుగా కావాల్సింది భాషానిధి. దీన్ని నిర్మించుకోవడానికి ఒక పక్కా కార్య ప్రణాళికను తయారుచేసుకొని దానికి అనుగుణంగా నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. **కానీ ఒక భాషకు భాషానిధి సమకూర్చడం వ్యక్తిగతంగా చేసేపని కాదు, అందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సమాచార సాంకేతిక విభాగం వారు ఆర్థిక సహాయం అందించే ఏర్పాటు చేయాలి. వాటితోపాటు తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ, ఐటి శాఖ, తెలుగు అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయం లాంటివారి ఆర్థిక సహాయం, ప్రోత్సాహం కూడా ఉండాలి. కారణం భాషానిధి సమకూర్చడం అనేది ఒక పెద్ద ప్రక్రియ.** మనం పైన చెప్పుకున్నట్టుగా తెలంగాణా భాషపై కొన్ని అధ్యయనాలు జరిగినాయి కానీ ఇప్పటి వరకు తెలంగాణా భాషానిధి సేకరణ మాత్రం జరగలేదు. తెలంగాణ తెలుగుతో పోల్చుకుంటే ప్రామాణిక తెలుగులో భాషానిధి సేకరణ విస్తృత స్థాయిలో జరిగిందని చెప్పాలి.

**భాషానిధి నిర్మాణం: ఉపయోగాలు**

తెలంగాణా తెలుగుపై ఒక సమగ్రమైన అధ్యయనం చేసి తెలంగాణ తెలుగుకు వర్ణనాత్మక, సంగణాత్మక వ్యాకరణాలు, నిఘంటువులూ, భాషానిధులూ, పదనిధులూ, పదజాలికలూ (వర్డ్‌నెట్), సాంకేతిక భాషోపకరణాలు లేక వనరులు లేదా సంగణాత్మక వనరులు అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుత భాషాస్థితిగతులని తెలుసుకోవడానికి భాషానిధి ఎంతగానో ఉపకరిస్తుంది. భాషలలో ఉన్న భిన్నత్వంలోని ఏకత్వాన్ని నిరూపించడానికి ఉపయోగపడతాయి. నిఘంటు నిర్మాణం, పాఠ్యపుస్తకాల తయారీ, నూతన పదాల సేకరణ, పదస్థాయిలో ఉన్న పదవిశ్లేషిణి, పదజనకం, భాషాభాగాల గుర్తింపు, వాక్య విశ్లేషణి, యంత్రానువాదం, భాషాసాంకేతికత, సమాంతర భాషానిధులు, వ్యాకరణ రచన, థేసరస్, రిఫరెన్స్ గ్రామర్, ప్రథమ లేక ద్వితీయ భాషాబోధన, పదప్రయోగ కోశాలు, పదజాలికలు, సమాచార వెలిపరపు (ఇన్ఫర్మేషన్ రిట్రీవల్) మొదలైనవి. దీనితో పాటు వివిధ రంగాలలో తెలంగాణ తెలుగును విస్తరించేలా చేయాలి. దానితోపాటు తెలంగాణ తెలుగును సాంకేతిక రంగాల్లో కూడా అభివృద్ధి చేయడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. **ఈ ఆధునిక యుగంలో సాంకేతికంగా అభివృద్ధి చెందని భాషలను వెనుకబడిన భాషలుగా పరిగణిస్తారని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందని భాషలు కొన్ని సంవత్సరాలలో ఆపన్న భాషల జాబితాలో చేరడానికి ఎక్కువ సమయం ఏమీ పట్టదు.** అందుకే తస్మాత్ జాగ్రత్త! అందరం నడుం కట్టి తెలంగాణ తెలుగులో విజ్ఞానాన్ని సృష్టిద్దాం, అంతర్జాలంలో, సామాజిక మాధ్యమాల్లో విరివిగా తెలంగాణ తెలుగులో రాద్దాం. అప్పడే మన తెలంగాణ తెలుగులో మనం వెలుగులను చూడగలం. ఆ వెలుగులే మనందరికీ సోపానాలు అవుతాయి. దానితో మన తెలుగు అభివృద్ధి చెందుతుంది.

జి. ప్రవీణ్, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం,
వారణాసి, 8179407778.
పి. ప్రకాష్ హైదరాబాదు విశ్వవిద్యాలయం,
హైదరాబాదు, 000000

మాతృభాషలో చదివిన పిల్లలు, ఇతర భాషలో చదివిన పిల్లలకంటే మెరుగుగానూ, త్వరగానూ నేర్చుకొంటారు. ఇంటి భాషలో చదివిన పిల్లలు, తర్వాత పాఠశాలలో పరీక్షలలో పనితీరు బాగుంటుంది. ప్రతిభా నైపుణ్యాలకు మించి ప్రయోజనాలతోబాటు మెరుగైన ఆత్మనిర్భరత, ఆత్మగౌరవం, ఆత్మధైర్యం అలవడతాయి–'యునెస్కో'

డా. పి. వారిజారాణి
డా. వి. ఎం. సుబ్రహ్మణ్య శర్మ

# ఎరుకల భాష-మాతృభాషలో బోధన



ప్రపంచంలో ఎన్ని భాషలున్నా దేని ప్రాముఖ్యత దానిదే. భాష మనిషి మనసులోని భావాన్ని వ్యక్తీకరిస్తుంది. ఇతర జీవులకు మానవులకు మధ్య వ్యత్యాసాన్ని చూపించేది భాషనే. ఎదుటి వ్యక్తి మాట్లాడే భాష, శ్రోతకు అర్థమైతే చాలు. సంభాషణ కొనసాగి, భావాల ఆవిష్కారం జరుగుతుంది.

ఏ భాష ఐనా ఎక్కువ కాలం నిలిచి ఉండాలి అంటే, ఆ భాష తప్పకుండా వ్యవహారంలో ఉండాలి. భాషకు లిపి లేకపోయినా కనీసం మౌఖిక సాహిత్యమున్నా ఆ భాష కొంత కాలం నిలిచి ఉండే అవకాశం ఉంటుంది. అది ఎప్పుడంటే, ఆభాషను పరిరక్షించే చర్యలను చేపట్టినప్పుడు మాత్రమే.

ప్రపంచీకరణ నేపథ్యంలో పురజన భాషలే వాటి అస్తిత్వాన్ని క్రమేపీ కోల్పోతున్న తరుణంలో కొన్ని గిరిజన భాషలు వాటితో మమేకమైపోయి పురజన భాషా సంస్కృతినీ, సంప్రదాయాన్ని, భాషను అవసరానికో లేదా ప్రతిష్ఠ కొరకు ఆశ్రయిస్తున్నాయి. అటువంటి భాషల్లో ఎరుకల భాష కూడా ఒకటి.

గిరిజన తెగలకు సంబంధించిన భాషలను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఆయా భాషల గేయాలు, కథలు, సామెతలు, ఆచార వ్యవహారాలను, సంస్కృతీ సంప్రదాయాలను తెలిపే అన్ని అంశాలనూ దృశ్య-శ్రవణ యంత్రాల ద్వారా సేకరించి, వాటిని నిక్షిప్తం చేయాల్సిన అవసరం ఉంది.

**ఎరుకల భాష:**

తెలుగు, తమిళ, కన్నడ భాషా పదాల మిశ్రమాన్ని కలిగి ఉన్నట్టుగా కనిపించినా ఎరుకల ఒక ప్రత్యేకమైన భాష. ఇది ద్రావిడ భాషా కుటుంబానికి చెందింది. తెలుగు ప్రాంతాల్లో దాదాపు అన్ని గ్రామాల్లో వీరు నివసిస్తూ ఉంటారు. పూర్వం కేవలం అడవి ప్రాంతాలకే పరిమితమై, ఇటీవలి కాలంలో జన సామాన్యంలో భాగంగా మారిన ఈ గిరిజన తెగను తెలుగు వారు ఎరుక, ఎరుకలు అని పిలుస్తారు. తెలుగు ప్రాంతాల్లో ఎరుకల వారుగా వ్యవహరింపబడుతున్న ఈ గిరిజన తెగవారు తమను తాము "కుర్రు" గా పిలుచుకుంటారు.

ఎరుకలకు కొర, కుఱ్ఱు, కొరవ, కొరచ అనే పర్యాయ పదాలు కూడా ఉన్నాయి. వేరు వేరు ప్రాంతాల్లో ఎరుకలను వేరు వేరు పేర్లతో పిలుస్తారు. మహారాష్ట్రలో కైకడీలు అని, పాండిచ్చేరిలో నిద్దనార్ అని , కర్ణాటకలో కోరమరాలు అనీ తమిళనాడులో కొరద, కొరచ అని శ్రీలంకలో వెల్లలు అనీ పిలుస్తారు. ఎరుకల పర్యాయ పదాల అర్థాలను పరిశీలిస్తే జ్ఞానం కలవారని, భవిష్యత్తు చెప్పేవారని, సోదె చెప్పేవారని, త్రిప్పుట జీవన విధానం కలవారని, పర్వత ప్రాంతంలో నివసించే వారని, పాములను, పక్షులను పట్టేవారనీ, చాపను బుట్టలను అల్లేవారనే అర్థాలు కనిపిస్తున్నాయి. ఎరుకల స్త్రీలు మాత్రమే కలిగిఉన్న వృత్తి సోదెచెప్పటం. ఇది ఈ తెగలో ప్రత్యేకంగా కనబడుతుంది.

ఇటీవలి కాలంలో మేము చేసిన ఎరుకల భాషా పరిశోధనలో అతి ముఖ్యమైన అంశం- దాదాపు 800 ఎరుకల పదాలను సేకరించడం. **ఆ పదాల్లో 55% పదాలు మాత్రమే ఎరుకలవి, మిగిలినవి తెలుగు పదాలు. అంటే క్రమేపీ ఈ భాష తన పద సంపదను కోల్పోయి, వాటి స్థానంలో తెలుగు భాషా పదాలను వాడుతుంది.** అంటే ఎరుకల భాషను మాట్లాడే పరిసరాలు, సందర్భాలు కుంచించుకుపోయాయి. ప్రస్తుతానికి ఇంట్లో తాత-తండ్రి - మనుమడు ఉంటే తాత-తండ్రి మాత్రమే ఈ భాషను ఉపయోగిస్తున్నారు. దీనికి కొన్ని కారణాలు 1. ఉమ్మడి కుటుంబాలు తగ్గి పోవడం 2. ఎరుకల భాషను ఉపయోగించ గల సందర్భాలు లేకపోవడం 3. ప్రతి ఊరిలో వీరు ఉన్నప్పటికి ఒకటో, రెండో కుటుంబాలు మాత్రమే ఉండటం 4. మాతృభాషలో విద్యాభ్యాసం లేకపోవటం 5. ముఖ్యంగా వారి భాష, సంస్కృతి, చరిత్ర, వారికి మాత్రమే తెలిసిన వృత్తి నైపుణ్యాలు ఒక తరం నుండి ఇంకో తరం వారికి సరైన పద్ధతిలో అందక పోవడం 6. తమ భాష ఉద్యోగ అవకాశాలు ఇవ్వలేదనే భ్రాంతి 7. వారి భాష తక్కువది అనే అభద్రతా భావంతో ఉండటం.

**మాతృభాషలో బోధన: ఆవశ్యకత**

భాష అనేది భావ వ్యక్తీకరణకు, జ్ఞాన సముపార్జనకు ఉపయోగపడుతుంది. ఏ వ్యక్తి అయినా ప్రతి అంశాన్ని కూడా మొదట మాతృభాషలోనే అలోచిస్తారు. అలా ఆలోచించాలి అంటే ప్రతీ వ్యక్తికీ మాతృభాష ఉండాలి. ఆ భాష ఇంటా బయటా వాడబడాలి. జనవ్యవహారంలో ఉండాలి. కనీసం తన కుటుంబం, బంధువులు, స్నేహితుల్లో ఐనా వ్యవహారంలో ఉండాలి. అలా ఉన్నప్పుడే ఆ భాష ఆవ్యక్తికి మాతృభాషగా స్థిరపడుతుంది. ఏ విషయానికి సంబంధించిన ఆలోచనాధార అయినా మాతృభాషలోనే సాగుతుంది.

**తరువాయి 25 వ పుటలో.......**

మూలం : రవీంద్రనాథ్ ఠాగూర్

# ఆంగ్ల విద్య

**అ**త్యవసరం, అనివార్యం అయినదానికే పరిమితమవ్వడం మనిషి కర్తవ్యం కాదు. మనం ఒక హద్దువరకు అవసరాల సంకెళ్ళలో బందీలమై వుంటాం. కొంతవరకు స్వతంత్రంగానూ వుంటాం. మన శరీరం మూడు మూరల పొడవుగదా అని మూడున్నర మూరల యింటిని నిర్మిస్తే మనకి గడవదు. స్వేచ్ఛగా అటూ యిటూ తిరగడానికి పొడవు వెడల్పుగల విశాలమైన స్థలం కావాలి. అలా కాకపోతే మన ఆనందం, ఆరోగ్యాలకు అంతరాయం కలగవచ్చు. మనం స్వస్థతతో, ప్రసన్నంగా వుండలేం. విద్య విషయంలో కూడా అదే చెప్పవచ్చు. కేవలం అవసరాల మేరకు బాలబాలికలను బందీలుగా చేస్తే వారి మానసిక సాధన జరగదు. అవశ్యకమైన విద్యతోపాటు అంతగా ప్రయోజనంలేని అధ్యయన కార్యక్రమానికి మించి పాఠాలు భిన్న విషయాలు నేర్పకపోతే వారు పూర్తి మనుషులు కాలేరు. వయస్సులో పెద్దవారయినా వారు పిల్లలుగానే వుండిపోతారు.

కానీ దురదృష్టవశాత్తు మనవద్ద సమయం లేదు. సాధ్యమైనంత తొందరగా విదేశీ భాషలు నేర్చుకొని వాటితో యోగ్యతపరీక్షలో ఉత్తీర్ణత పొంది పనిముగించుకోవలసి వస్తోంది. పాఠాలు కంఠస్థం చేయడంలో యితరులకన్నా వెనక బడకుండా వుండాలని, చిన్నతనం నుండి గుర్రపుపందాలలో గుర్రాల మాదిరి పరిగెడుతుంటారు. మరింకే విషయానికి మనకు సమయం దొరకటం లేదు. అందువల్ల పిల్లల చేతుల్లో పాఠ్యపుస్తకాలు తప్ప మరే యితర మనోల్లాసకరమైన, ఉపయోగకరమైన పుస్తకాలు కనిపిస్తే వెంటనే వాటిని లాక్కొంటారు.

అసలు ఉపయోగకరమైన పుస్తకాలు ఎక్కడ లభిస్తున్నాయి? మొదటగా మన భాషల్లో అటువంటి పుస్తకాలు లేవు. ఒకవేళ కొద్దోగొప్పోవున్నా అవి వున్నా లేకపోయినా ఒకటే. ఎందువల్లనంటే మన పిల్లలకు మాతృభాష నేర్పే విధానం వల్ల వాళ్ళు యింటి దగ్గర స్వతంత్రంగా ఏ పుస్తకమైనా చదివి ఆనందించగల స్థితిలో లేరు. ఆంగ్లంలో పిల్లల పుస్తకాలు చదివి అర్థం చేసుకునేటంత ఆంగ్లభాషా జ్ఞానం కూడా వీరికి లేదు. పిల్లల కోసం రాసే పుస్తకాలలో ఉపయోగించే ఆంగ్లభాషలో ఆ భాషకు సహజమైన సామెతలు, పదబంధాలు, మాట్లాడే ఆంగ్లం బి. ఎ., యమ్. ఏ. లకు కూడా అర్థం కానట్టు వుంటుంది.

వాస్తవానికి పరమాత్మ మన బిడ్డల నుదుట ఆంగ్లవర్ణమాల, పదకోశం, భూగోళం తప్ప మరేదీ లిఖించలేదు. వీరివంటి అభాగ్యులు ప్రపంచంలో మరెక్కడా వుండరు. యితర దేశాల పిల్లలు తమ వచ్చీరానీ దంతాలతో చెరకు ముక్కల్ని కొరికి రసాస్వాదన చేస్తూ ఉండే వయస్సులో మన పిల్లలు పాఠశాలల్లో బెంచీలమీద కూర్చొని తమ బలహీనమైన కాళ్ళను ఊపుతూ గురువుగారి కటువైన తిట్లు తప్ప మరేవిధమైన మనోరంజక మసాలా లేని బెత్తపు దెబ్బలు



తింటూ వుంటారు.

తత్ఫలితంగా శారీరక, మానసిక ఆహారాన్ని జీర్ణం చేసుకునే శక్తి తగ్గిపోతుంది. సరియైన భోజనం, మనస్సుకు నచ్చిన ఆట పాటలు లేక పిల్లల శరీరాలు దుర్బలంగా, పీలగా తయారవడమే కాక మనస్సులు కూడా బలహీనమై పోతున్నాయి. వారిలో ఆలోచనలు పుట్టి పెరిగేందుకు తగిన శక్తి పెంపొందటం లేదు. యీ రకమైన బలహీనత వల్ల బి.ఏ., యమ్.ఏ. లాంటి డిగ్రీలు పొందినా, పుస్తకాల గుట్టలు నమిలి మింగినా మన బుద్ధిమాత్రం వికసించటం లేదు. బుద్ధి పరిపక్వం చెందటం లేదు! ఏ విషయాన్నయినా సమగ్రంగా అర్థం చేసుకుని, స్వతంత్రంగా దాని గురించి చెప్పగలిగే యోగ్యత లేకుండా పోతోంది. మన నమ్మకాలు, మన అభిప్రాయాలు, మన మాట – నడత, కట్టు – బొట్టు, ఆలోచనలు మొదలైనవేవీ స్వతంత్రమైనవిగా, పద్ధతి ప్రకారంగా వుండడం లేదు. అందుకనే మన మానసిక దౌర్బల్యాన్ని బాహ్యాడంబరంతో, ప్రదర్శనలతో, కుప్పిగంతులతో కప్పిపెట్టటానికి, దాచుకోవడానికి ప్రయత్నిస్తున్నాం.

చిన్నప్పటినుండీ విద్యాభ్యాసానికీ, ప్రసన్నతకూ, ఆనందానికి సంబంధం లేకపోవటమే దీనికి ముఖ్యకారణం. ఎంత అవసరమో అంతే కంఠస్థం చేస్తున్నాం. యీ అభ్యాసం వల్ల మన పని జరుగుతోంది. కాని బుద్ధి వికసించటం లేదు. గాలి తింటే కడుపు నిండదు. అన్నం తింటే కడుపు నిండుతుంది, కానీ భోజనం చక్కగా అరగాలంటే, శరీరంలోకి గ్రహించుకోవాలంటే గాలికూడా తీసుకోవాల్సి ఉంటుంది. ఇదే విధంగా పాఠ్య పుస్తకాలను, వాటి అర్థాన్ని గ్రహించాలంటే యితర మనోరంజక సామాగ్రి కూడా ఎంతైనా అవసరం. మానసిక ఉల్లాసంతో చదివిన చదువువల్ల చదివేశక్తి వికసిస్తూ పోతుంది. మన ఆలోచనా, అవగాహనా కూడా చక్కగా పెంపొందుతాయి. మానసిక శక్తులను నాశనం చేసే ఆనంద రహితమైన విద్య అనే పంజరం నుండి మన పిల్లలను ఎలా విముక్తులను చేయాలో ఎంత ఆలోచించినా మనకి తెలియటం లేదు. **ఆంగ్లభాష మన భాష కాదు. విదేశీయులది. మన భాషాపదాలు**

**ఆంగ్ల భాషాపదాలతో కలవవు. వారి భావాలు, ఆలోచనలు, విషయాలు విదేశీయమే.** వారి విషయాలలో మనం అనభిజ్ఞులం. మన ఆలోచనాశక్తి పుట్టకముందే వారి విషయాలన్నీ కంఠస్థం చేసే అగత్యం ఏర్పడుతోంది. అందుకనే అన్నం నమలకుండానే మింగేసేవాడి లాగా మన స్థితి ఉంది. ఉదాహరణకు ఒక ఆంగ్ల బాలుడు తన పాఠ్య పుస్తకంలో– పచ్చిగడ్డిని ఎండబెట్టి పశువుల చొప్ప తయారు చేయటం అనే అంశంపై ఒక కథ చదివితే చాలా ఆనందం పొందుతాడు. దాన్ని గురించి వాడికి బాగా తెలుసు. అదే విధంగా ఆంగ్ల బాలబాలికలు మంచు ముద్దలు అనే పాఠంలో ఛార్లీ, కేటీల మధ్య సంభాషణని చాలా యిష్టంగా చదివి ఆనందిస్తారు. కానీ మన పిల్లలు ఒక విదేశీ భాషలో చదివితే వారికెటువంటి ఆనందమూ కలగదు. పైన ఉదహరించిన అంశాల గురించి వారి మనస్సులో ఎటువంటి భావాలూ కలగవు. వారి మనస్సులపై ఎటు వంటి చిత్రమూ ఏర్పడదు. కళ్ళులేని వారి మాదిరి తడుముకుంటూ నడువవలసి వస్తుంది.

ప్రాథమిక తరగతులలో చదువు నేర్పే ఉపాధ్యాయులు కొందరు ఎంట్రన్స్ పాసయి వుంటారు. తక్కినవారు ఎంట్రన్స్ ఫెయిలయి వుంటారు. ఆంగ్లభాష, సభ్యత, ఆలోచన, ఆచార విచారాలతో వారికి చక్కని పరిచయం వుండదు. పిల్లలకు మొట్టమొదటగా యిటువంటి వారే ఆంగ్లభాషను పరిచయం చేస్తారు. వీరికి మాతృభాష పూర్తిగా రాదు, అటు ఆంగ్ల భాషా రాదు. **వీరు పిల్లలకి నేర్పటానికి బదులు ఉన్నది పోగొట్టడంలో సఫలీకృతమవుతారు!**

కానీ పాపం యిందులో వీరి దోషమేముంది? 'Horse is a noble animal'. యీ వాక్యం ఆంగ్లంలో అతి సాధారణ వాక్యం. దీనిని మన భాషలోకి అనువదిస్తే బాగా రాదు సరికదా ఆంగ్లంలోని అర్థం కూడా వికృతమైపోతుంది. గుర్రం ఒక గొప్ప జంతువు – గుర్రం ఒక ఉత్తమశ్రేణి జంతువు – గుర్రం మంచి జంతువు: ఏ విధంగా అనువదించినా రావలసినంతగా సరియైన అర్థం రాదు. అధ్యాపకుడు అటువంటి సమయంలో ఏదో మసిపూసి మారేడుకాయ చేయక తప్పదు. ప్రాథమిక స్థాయి ఆంగ్లబోధనలో ఎన్నోసార్లు యీ విధమైన గందరగోళం ఏర్పడుతూనే వుంటుంది. **యీ స్థాయిలో నేర్పే ఆంగ్లం అతి సాధారణమైనదిగానూ, అస్పష్టంగానూ వుంటుంది. దీనిని అభ్యసించడంలో పిల్లలు రసాస్వాదన చేయలేరు. కానీ పిల్లలు ఆనందాన్ని పొందాలని ఎవ్వరూ ఆశించటం లేదు.** ఉపాధ్యాయులు, విద్యార్థులూ చెప్పేదేమంటే మాకు రసంతో సంబంధం లేదు. ఏదో విధంగా అర్థం లాగితే పని జరిగిపోతుంది, పీడ వదులుతుంది. పరీక్షలో ఉత్తీర్ణులవటంతోనే నౌకరీ సిద్ధంగా వుంటుంది.

యిక పిల్లల అదృష్టంలో మిగిలినదేముంది? వారు మాతృభాష నేర్చుకుంటే కనీసం రామాయణాది మహా కావ్యాలన్నా చదువుకొని వుండేవారు. ఏమీ నేర్చుకోకపోతే కనీసం ఆటపాటలకయినా సమయం దొరికేది. చెట్లెక్కి, యీతకొట్టి, పువ్వులేరుకొని, ప్రకృతిలో వేల ఆటలు ఆడి మానసిక ఉల్లాసాన్ని, శాంతిని పొందగలిగేవారు. యీ ఆంగ్లభాషాభ్యాసంలో తలమునకలవ్వడం వల్ల అటు చదువు లేదు, యిటు ఆటలేదు. ప్రకృతి వాస్తవిక సామ్రాజ్యంలోకి ప్రవేశించే అవకాశాన్ని కోల్పోతున్నారు, కావ్యానందానికి దూరమవుతున్నారు. మన తోవలో (మనసులో), బయట కూడా తిరగటానికి విశాలమైన మైదానాలున్నాయి. ఆ మైదానాల్లో మనం ప్రాణశక్తిని, స్వస్థత అనే అమూల్య సంపదను పొందగలుగుతాం. అక్కడనుండే రకరకాల రంగులు, రకరకాల చిత్రాలు, ఆకృతులు, భావాలు, సుఖసంతోషాలు పైకెగసి మన శారీరక, బౌద్ధిక వికాసానికి దోహదం చేస్తాయి. అయ్యో! అభాగ్యులైన యీ పిల్లలు బాహ్య, అంతఃకరణాలనే తల్లిదండ్రుల ప్రేమకు నోచక విదేశీ బందీ గృహాలలో, సంకెళ్ళతో ఖైదీలవుతున్నారు. **భగవంతుడు తల్లిదండ్రుల మనసులో ప్రేమ తరంగాలను సృష్టించి తల్లి ఒడిని రసవంతం చేశాడు. కానీ వారి పిల్లలు పసితనంలోనే తమ అమూల్య సమయాన్ని ఒక విదేశీ భాష వర్ణమాలను, పదకోశాన్ని గుర్తు పెట్టుకోవటంలో నష్టం చేసుకోవలసి వస్తోంది. దీనిలో జీవం లేదు. ఆనందానుభూతి లేదు. కొత్త విషయమూ లేదు. యిటూ అటూ కదలడానికి అవగింజంత చోటూ లేదు. వర్ణమాల, పదకోశం లోని నీరసమైన, కుళ్ళిన, రుచి రహితమైన ఎముకలు నమలటం వల్ల పిల్లల మనసు, మస్తిష్కం వికాసాన్ని పొందగలవా? వారిలో విశిష్టమైన యోగ్యత పెంపొంద గలదా? వారి శీలం నిర్మలంగా, దృఢంగా కాగలదా? పెద్దవారైనా కూడా తమ స్వబుద్ధితో ఏదైనా పని చేయగలరా? తమ స్వశక్తితో ప్రగతి నిరోధక ఆటంకాలను దూరం చేసుకోగలరా? తమ సహజ తేజంతో ప్రతి స్థితిలోనూ తల ఎత్తుకుని ఉండగలరా?** యీ బక్కచిక్కి పాలిపోయిన ముఖాలుగల వీరు, సాహసహీనులైన బాలలు బతికుండగా మృత్యువును తప్పించుకోగలరా? లేదు. కేవలం అనుకరించడం, కంఠస్థం చేయడం, లేదా బానిసత్వం మాత్రమే వారు నేర్చుకోగలరు.

ఒక్కసారిగా ఏ పిల్లవాడు యువకునిగా మారలేదు. బాల్యా వస్థనుండి మార్పు చెందుతూ కొద్దికాలం తరువాత యౌవ్వనంలోకి అడుగుపెడతాడు. **ఆలోచనాశక్తి, అధ్యయనశక్తి యీ రెండు అమూల్య మైన వస్తువులు – జీవితానికి ఆశ్రయమిచ్చి రక్షించేవి యివే.** యవ్వ నంలో ఒక్కసారిగా యీ శక్తుల పనిపడ్డప్పుడు, కోరుకోగానే మన ఎదురుగా వచ్చి నిల్చోవు – మన కాళ్ళు, చేతుల మాదిరి మన జీవి తంతోపాటు క్రమంగా పెరుగుతూ వుంటాయి. అవేమీ ముందుగా తయారుచేసి పెట్టిన వస్తువులు కావు – కావలసినప్పుడు, మనస్సు పుట్టినప్పుడు బజారులో కొనుక్కోడానికి. **ఆలోచనాశక్తి, అధ్యయనశక్తి రెండూ జీవనయాత్రకు లాభదాయకమైనవి, అత్యావశ్యకమైనవి అని చెప్పటంలో సందేహం లేదు. యీ రెండు శక్తులు లేకుండా మానవులుగా తయారవ్వడం, మనుషత్వాన్ని పొందటం ఎంతమాత్రం సాధ్యంకాదు. బాల్యం నుండి యీ శక్తులను పెంపొందించకపోతే ఆ అవసరం కలిగినప్పుడు మనకు లభ్యం కావు,**

కానీ మన వర్తమాన బోధన ప్రణాళికలో యీ శక్తులు పెరగ టానికి మార్గం బహుశా పూర్తిగా మూసివేసి ఉంది. **ఆంగ్లభాష అతి కఠినమైన విదేశీ భాష** అని ముందే చెప్పాను. మన ఉపాధ్యాయులలో యోగ్యత ఎంత తక్కువ అంటే వారి మనస్సులో ఆంగ్ల పదజాలంతో పాటు దానికి సంబంధించిన భావాలు కలగవు. అందువల్లనే ఆంగ్ల భావాన్ని అర్థం చేసుకోటానికి మన అమూల్యమైన సమయాన్ని నష్ట పరచవలసి వస్తోంది. అంతవరకు మన ఆలోచనశక్తికి పనిలేక

పోవడం వల్ల, ఖాళీగా పడివుండడంవల్ల అది అన్ని విధాలా నష్టమయి పోతోంది, నిరర్ధకమైపోతోంది. ఎఫ్.ఏ లేదా ఎంట్రన్స్‌ల వరకు మన సమయం కేవలం కనీస వ్యవహారానికి సరిపడే ఆంగ్లాన్ని నేర్చుకోవడంలో గడచిపోతోంది. దీని తరువాత బి.ఏలో ఒక్కసారిగా మన ముందు పెద్ద పెద్ద పుస్తకాలు, అవసరమైన, ఆలోచించదగ్గ విషయాలు ఉంచుతారు. అప్పుడు వాటిని అవగాహన చేసుకునేందుకు సమయం కాని, యోగ్యతకాని వుండవు. మరేమీ చేయలేక, అసహాయత వల్ల అవ్వన్నీ పెద్ద ఉండచేసుకుని ఒకే ముద్దలో మింగవలసి వస్తోంది.

మనం చదువుకుంటూపోతామే కాని దానితో పాటు ఆలోచించం, అర్థం చేసుకోం. యిటుకలు, సున్నం గుట్ట పెంచుకుంటూ పోవడమే కాని వాటిని ఉపయోగించడం మనకు తెలియదు. ఎండలో, వర్షంలో ఆశ్రయాన్ని, విశ్రాంతినిచ్చే నివాస గృహాలుగా వాటిని మన స్వబుద్ధితో తయారు చేసుకోవటం లేదు. యీ విధంగా యిటుకలు, సున్నం, సిమెంట్, స్తంభాలు, ఇనుము మొదలైన వాటి గుట్టలు పర్వతాలుగా పెరుగుతూ పోతాయి. అప్పుడు ఒక మహా విద్యాలయం నుంచో, విశ్వవిద్యాలయం నుంచో ఒక మూడు అంతస్తుల యింటికి కప్పు కట్టమని ఆదేశం వస్తుంది. యింకేముంది, ఆ ఆదేశాన్ని పాటించేందుకు ప్రయత్నాలు జరుగుతాయి. ఎలాగో ఆ గుట్టనెక్కి రెండు సంవత్సరాలలో దాన్ని కొట్టి, కొట్టి పై భాగాన్ని సమతలంగా చేస్తారు. ఆ గుట్ట కప్పులాగా తయారవగానే అదుగో మూడు అంతస్తుల ఇల్లు తయారయ్యిందనీ చెబుతారు. కానీ అది భవ్యమైన భవనం అవుతుందా? గాలి, వెలుతురు తగినంతగా రావడానికి ఏమైనా మార్గం వుందా? ఏ వ్యక్తి అయినా ఆ భవనంలో కొద్దిసేపు వుండగలుగుతాడా? తీక్షణమైన ఎండ నుండి, ప్రచండ వాయువుల నుండి, వర్షం నుండి ఆ భవనం మనని రక్షించగలుగుతుందా? ఈ నిర్మాణంలో నైపుణ్యం కానీ, సౌందర్యం కానీ ఉన్నాయా?

గుట్టల్లాగా ఇప్పటిదాకా పోగుచేసిన సామగ్రి చాలు. మనస్సనే భవనాన్ని నిర్మించటానికి యీ ఇటుకలు, సున్నం, యిసుక, సిమెంట్ మొదలయినవి మనకు యింతకు ముందు లభ్యమయ్యేవి కావు. కానీ యివి పోగుచేసినంత మాత్రాన నిర్మించవచ్చుననుకోవటం పొరపాటు. వాస్తవానికి సామగ్రితో పాటు భవన నిర్మాణం కూడా జరిగితే సామగ్రి ఉపయోగపడడమే కాక పనికూడా దృఢంగా, పక్కాగా జరుగుతుంది. కానీ మన దేశంలో దీనికి విరుద్ధంగా జరుగుతోంది. **మనిషి ఒక వైపునకు సాగితే అతని విద్య మరొక వైపునకు సాగుతోంది. ఒకవైపు పెట్టుకోవడానికి చోటు లేనంతగా తిండి పదార్థాలు పెరుగుతున్నాయి, ఆకలీ పెరుగుతోంది, కడుపు తన తాపంతో మండుతూనే వుంది.** యీ రకంగా మన దేశంలో చిత్రమైన తమాషా జరుగుతోంది.

అందువల్లనే మీరు **మీ పిల్లలను మనుషులుగా తీర్చిదిద్దాలనుకుంటే బాల్యం నుండీ ఆ రకమైన ప్రయత్నమే చేయండి. లేదా వారు ఎప్పటికీ పిల్లలుగానే వుండిపోతారు, మనుషులు కాలేరు. బాల్యం నుండి వారి స్మరణ శక్తి మీదే భారం మోపకుండా వారి ఆలోచనా శక్తి, అధ్యయన శక్తి కూడా పెరగటానికి అవకాశమివ్వండి.**

విత్తు నాటడానికి భూమిని అనుకూలంగా చేయాలంటే కేవలం దున్ని, రాళ్ళు రప్పలు ఏరి చదునుచేస్తే చాలదు. అదే విధంగా యీ విలువైన భూమిని సారవంతంగా చేయాలంటే కేవలం బట్టీ పట్టడం, పరీక్షల్లో ఉత్తీర్ణులవ్వడమే చాలదు. యీ ఎండుమట్టితోపాటు, యీ నిరంతరం దున్నటంతో పాటు కొంతసారం కూడా వుండాలి. మట్టిలో సారం ఎంతుంటే ఆహార పదార్థాలు అంత బాగుంటాయి. యిదేకాక కొన్ని సమయాల్లో భూమికి వర్షం కూడా అవసరం. సమయం దాటిన తరువాత ఎంత వర్షించినా లాభం వుండదు. యవ్వనంలో జీవితాన్ని రసమయం చేసుకోవటానికి, సంస్కరించుకోవడానికి ఆలోచనాశక్తి ఎంతో అవసరం. సాహసోపేతమైన ఆలోచనలు, నిర్ణయాల ప్రభావం ఎంతో వుంటుంది. ఆ సమయంలో సాహిత్యాకాశం నుండి వర్షం కురిస్తే పని సిద్ధిస్తుంది.

మనస్సు అప్పుడప్పుడే మేల్కొని మాతృభూమిని దాటి యీ విశాల ధరిత్రిని, అనంత ఆకాశాన్ని దర్శించినప్పుడు, బాహ్య ప్రపంచంతో అప్పుడే కొత్త కలయిక జరుగుతున్నప్పుడు, కొత్త కొత్త లక్షణాలు ఉబికే ప్రేమ, ఎగిసే కోరికలు నాలుగు వైపులనుండీ చుట్టు ముట్టినపుడు, ఆలోచనలనే సుఖకరమైన వాయువులు ప్రసరిస్తున్నపుడు, శాశ్వతమైన ప్రసన్నత ఒడిలో వెలుగు, శాశ్వత ఆశీర్వచనాల కెరటాలు ప్రవహిస్తున్నపుడు ఆ విత్తనాల రెక్కలు జీవితమంతా సఫలమై ఆనందాన్ని, సంపూర్ణతను సంతరించుకొంటాయి. కానీ అదే సమయంలో ఎండిన మట్టితో, వేడి వేడి యిసుకతో కప్పివేస్తే, ఆనంద రహితమైన పదావళిని, వర్ణమాలను వల్లించటం కంటే మరో పని లేనప్పుడు దాని తరువాత ఎంత వర్షించినా - సమస్త ఐరోపా ఆధునిక, సాహసోపేతమైన ఉదాత్త భావాలు ఎంత వర్షించినా- తగినంత సఫలత ఎంతమాత్రం కలగదు. సాహిత్యంలోని జీవశక్తి వారి జీవితాలపై కొద్దిగానైనా వెలుగును ప్రసరించలేదు.

**కానీ మన ఆనందరహిత, నీరసమైన, నిర్జీవమైన విద్యవల్ల ఆ జీవదాయక శక్తి వ్యర్థమయిపోతుంది. కొద్దిపాటి వల్లె వేసిన విషయాల బరువును మోసుకుంటూ మనం బాల్యం నుండి యవ్వనంలోకి ప్రవేశిస్తాం. బట్టీ పట్టడంలోనే మన మనసులు విరిగిపోతాయి. యింత చేసినా మన మానవత బాగా పుష్పించి ఫలించదు. మనం ఆంగ్లభావభూమిలో ప్రవేశించినప్పుడు అక్కడ కూడా చక్కగా ఆటపాటలలో విహరించలేం. భావాలని మనం అర్థం చేసుకున్నా మనసులో వాటిని ముద్రించుకోలేం. వాటిని మాటి మాటికి వల్లెవేస్తూ వుంటాం కానీ మన వాస్తవ జీవితంలో వాటిని ప్రయోగించలేం. అవి మన వెలుపలనే వుండిపోతాయి, లోపలికి చొచ్చుకోవు. మన మనస్సుతో వాటికి ఎటువంటి సంబంధమూ, సంపర్కమూ వుండదు.**

యీ విధంగా 20, 22 సంవత్సరాల వరకు ఏ భావాలు నేర్చుకుంటామో వాటికి మన జీవితంతో ఏ విధమైన రసాయనిక సంయోగమూ సిద్ధించదు. దానివల్ల మన మనసు ఒక విచిత్రమైన రూపాన్ని దిద్దుకుంటుంది. ఆ విధంగా నేర్చుకున్న భావాలు బయట అంటించుకున్నట్లు వుంటాయి. కొన్ని అనతి కాలంలోనే ఎగిరిపోతాయి.

ఆటవికులు తమ శరీరాలకు రంగు రంగుల బొమ్మలు గీసుకుని తమ సహజ సౌందర్యాన్ని మెరుగు పరచి, యీ కృత్రిమ సౌందర్యానికి గర్వపడుతూ వుంటారు. అదే విధంగా మనం యీ విదేశీ

విద్య పైపూతలు పూసుకొని గర్వంతో తల ఎగరవేసుకుంటూ తిరుగుతుంటాం. మన వాస్తవ జీవితంతో వాటికెటువంటి సంబంధమూ వుండదు. అనాగరిక, అటవిక ప్రదేశాల రాజులు లేదా నాయకులు గాజు ముక్కలు మొదలైన చవకబారు విదేశీ వస్తువులను శరీరంలో అక్కడక్కడా తగిలించుకొని సభ్య సమాజం అపహాస్యం చేస్తుందని గమనించని విధంగా మనం కూడా తళుకు బెళుకుల విదేశీ విషయాలు నేర్చుకొని విర్రవీగుతూ వుంటాం.

విదేశీయుల గొప్ప గొప్ప భావాల్ని అనవసరంగా, సందర్భ రహితంగా ప్రయోగిస్తూ వుంటాం. మన అజ్ఞానం వల్ల ప్రపంచాన్ని నవ్వించే ఒక విచిత్ర నాటకం ఆడుతున్నామని గ్రహించలేం. మన యీ చేష్టలకి ఎవరయినా నవ్వుతూ వుంటే యూరపు చరిత్రనించి గొప్ప గొప్ప ఉదాహరణలు తీసి వారి ముందుంచటానికి తొందర పడుతూ వుంటాం. బాల్యం నుండి మన బాలలకు భాషాజ్ఞానంతో పాటు, భావబోధన కూడా కలిగిస్తూ వుంటే అవి జీవితంతో మేళవించి, దైనిక జీవితంలో ఒక భాగంగా మారి మన శీలంపై సరైన ప్రభావాన్ని కలిగిస్తే మన జీవితమంతా నిజమైన అనుకూలత ఏర్పడుతుంది. భాష, భావం, తగు పాళ్లల్లో మేళవిస్తాయి.

ఏ భావాలతో ప్రభావితమై లేదా ఏ రీతిగా, ఏ పద్ధతిలో జీవితం గడపాలో దానికి అనుకూలంగా మన విద్య లేదని మనం బాగా ఆలోచించి చూస్తే తెలుస్తుంది. మనకు కావాల్సిన గృహ సుందర చిత్రమేదీ మన పాఠ్యపుస్తకాలలో లేదు. మనం జీవితం గడపాల్సిన సమాజం కోసం ఉన్నత ఆదర్శమేదీ మన పాఠ్యాంశాలలో దొరకటం లేదు. మన తల్లిదండ్రులను, సోదరీ సోదరులను, బంధువులను వాటిలో స్పష్టంగా చూడలేక పోతున్నాం. మన దినచర్యకు దానిలో స్థానం లేదు. మన అందమైన ప్రభాతాలు, సుందర సంధ్యా సమయాలు, పచ్చగడ్డి మైదానాలు వీటిలో కనిపించవు. దీన్నిబట్టి మన చదువుకీ జీవితానికి ఎటువంటి సంబంధం లేదని తెలుస్తోంది. రెండిటి మధ్య ఒక పర్వతం అడ్డంగా వుంది. యీ చదువు మన జీవిత అవసరాలను ఎప్పటికీ పూర్తి చేయలేదు. మన జీవితానికి ఎన్నో గజాల దూరంలో చదువు వర్షిస్తోంది. ఈ స్థితిలో అన్ని ఆటంకాలను తప్పించుకుంటూ కొంత ధార మనదాకా చేరుకున్నా అది మన జీవితంలోని నీరసతను తొలగించటానికి, జ్ఞానతృష్ణను తీర్చటానికి చాలినంతగా వుండదు. జీవితమంతా వెచ్చించి నేర్చుకుంటున్న చదువు గుమాస్తాగా లేదా మరొక నౌకరీ చేసుకోవడానికి మాత్రం యోగ్యులుగా తయారుచేస్తోంది.

యింతకంటే ఎక్కువ మేలు దీనివల్ల కలగటం లేదు. మనం ఆఫీసుకు పోవడానికి గుడ్డలు మడత పెట్టి పెట్టుకునే అలమరాలోనే మన చదువును కూడా మూత పెడుతున్నాం. దానిని నిత్య జీవితంలో ఏమాత్రం ఉపయోగించటం లేదు. యిదంతా నేటి విద్యా ప్రణాళిక పెట్టిన భిక్ష. **దీనికి విద్యార్థులను దోషులు అనటం అన్యాయం. యిందులో వారి పాత్ర ఈసంతైనా లేదు.** కారణం వారి చదువు ఒక వైపు, జీవితం మరొక వైపు వున్నాయి. రెండింటి మధ్య వర్ణమాల, పదకోశం, వ్యాకరణం అనే వంతెన వుంది. అందువల్లనే పాశ్చాత్య విజ్ఞానంతో ప్రవీణుడైన వ్యక్తి నీచమైన, అవమానకరమైన సంస్కారాలను, విధానాలను, మిథ్యాధోరణులను నిలబెట్టుకోవాలని ప్రయత్నించడంలో ఆశ్చర్యమేమీ లేదు. ఏ వ్యక్తి ఉపన్యాసాలతో స్వాతంత్ర్యపు ఉన్నత భావాలను, ఆదర్శాన్ని ప్రచారం చేస్తాడో అతడే పరాధీనత లేదా దాస్యత శృంఖలాలనే సాలెగూళ్ళలో తాను, తనతోపాటు యితరులు చిక్కుకునేలా చేసి బలహీనుడై పోతున్నాడు.

ఉత్తమ భావాలుగల సాహిత్యాన్ని పరిపూర్ణ స్వేచ్ఛతో అధ్యయనం చేసి కూడా తన భావాలను ఉన్నత శిఖరాలకు చేర్చలేక పోతున్నాడు. వారి జీవితం మరింత అధోగతిలో వుంది. కేవలం డబ్బు సంపాదనలో, లౌకిక ఔన్నత్యాన్ని పొందడంలో లీనమై వున్నాడు. అటువంటి వ్యక్తుల జ్ఞానానికి లౌకిక వ్యవహారానికి మధ్య ఎంతో వ్యత్యాసం కనబడుతోంది. తత్ఫలితంగా రెండూ సంయోగం చెందలేవు, పరస్పర వైరుధ్యం వుంటూ వుంటుంది. దీని పరిణామంగా రెండు వైపులా విరోధం పెరిగిపోతూ ఉంటుంది. మనకు లభించిన జ్ఞానానికీ, మన లౌకిక వ్యవహారాలకూ మధ్య యుద్ధం జరుగుతూనే వుంటుంది. అందువల్ల అటువంటి చదువుమీద ప్రారంభం నుండీ నమ్మకం, విశ్వాసం వుండవు. ఆ చదువు భ్రమాస్పదంగా ఉంటుంది. అదే పాశ్చాత్య సభ్యతకంతకూ ఆశ్రయమని అనుకుంటాం. చదువు మనకు మార్గం చూపుతున్న ఆ వైపు సభ్యత అనే విశ్వాసఘాతకురాలైన భయంకర దెయ్యం రాజ్యం చేస్తోంది. ఆ వైపు పోవటం మనకు హానికరం కానీ దురదృష్టవశాత్తు మన దౌర్భాగ్యంవల్ల, ఇతర కారణాలవల్ల ఈ చదువు మనకు హానిచేస్తోందని తెలుసుకోవటం లేదు. పైగా విద్యలోనే సహజ దోషముందని పొరబడుతున్నాం.

మనం విద్యను ఎంతగా నిర్లక్ష్యం చేస్తే మన అవిశ్వాసం కూడా అంతగా పెరిగిపోతుంది. మన విద్య కూడా మన జీవితం నుండి, అవసరాల నుండి వెనక్కి మళ్ళి నిర్లక్ష్యధోరణి కూడుకున్నదవుతోంది. మన శీలంమీద, మన వ్యావహారిక జీవితం మీద ఎటువంటి ప్రభావమూ యీ చదువు కలగచేయటం లేదు. అంటే **మన చదువుకూ జీవితానికీ మధ్య అంతరాలు, అగాధాలు పెరిగిపోతున్నాయి. యీ రకమైన అపూర్ణ జ్ఞానం, అపూర్ణ జీవితం దయవల్ల భారతీయుల జీవితం ఒక నాటకంలా, అనుకరణమాత్రంగా తయారవుతోంది.**

మనం జీవితంలో మూడింట ఒకవంతు భాగం కేటాయిస్తున్న చదువుకూ మన జీవితానికీ మధ్య పొంతన లేనప్పుడు, మరో విద్యను ఆర్జించటానికి కూడా అవకాశం కల్పించనప్పుడు మనం ఏవిధంగా పైకి రాగలమో చెప్పండి. మన చదువుకూ జీవితానికి మధ్య సమానత్వం ఏ విధంగా కలగచేయగలం అని ఆలోచించవలసిన, అత్యవసరమైన ప్రశ్న మన ఎదుట ఉంది. మన మాతృభాష, మాతృభాషా సాహిత్యమే అటువంటి సమానత్వాన్ని నెలకొల్పగలవు. స్వర్గీయ బాబూ బంకిమ్ చంద్ర ఛటర్జీ 'వంగ దర్శనం' నవ ప్రభాతంలా ఉదయించినప్పుడు వంగదేశంలో యీ చివరి నుండీ ఆ చివరిదాకా ఆనందం వెల్లివిరిసింది. యూరోపు విజ్ఞానంలో, ఆలోచనా ప్రవాహంలో, చరిత్రలో దొరకని నూతనాంశమేదైనా 'వంగ దర్శనం'లో వుందా? 'వంగ దర్శనం'లో అదేమీ లేదు. కాని ఒక **ఉన్నత శ్రేణి రచయిత 'వంగ దర్శనం' ద్వారా ఆంగ్లభాష బోధనవల్ల ఏర్పడిన ఆగాధాన్ని నింపివేయగలిగాడు.** దూరదేశాలకు వెళ్ళిన మన యింటి మనిషిని మళ్ళీ యింటికి తెచ్చి ప్రసన్నతను, ఆనందాన్ని కలగచేసాడు.

శ్రీకృష్ణుడు ద్వారకకు వెళ్ళినందున 20, 25 సంవత్సరాల నుండి ఆయన దర్శనం కాలేదు. 'వంగ దర్శనం' దూతగా మారి కృష్ణుడిని మళ్ళీ బృందావన ధామానికి తీసుకొచ్చింది. ఆ సమయంలో మన యిళ్ళలో, సమాజంలో, మన మనస్సులో ఒక కొత్త వెలుగు ప్రసరించింది. యీ వెలుగులో మన మనస్సులు ప్రకాశించాయి. మనం స్త్రీలను 'సూర్యముఖి'గా, 'కమలకమణి'గా చూడగలిగాం. మనదేశ వాసులైన 'చంద్రశేఖర్'ను, 'ప్రతాప్'ను మన భావ సింహాసనంపై కూర్చోపెట్టాం. మన దైనందిన జీవనం వెలుగుతో నిండి అద్భుతమైన దృశ్యాలు కనబడసాగాయి.

వంగ దర్శనం సాటిలేని నవ్య రసాస్వాదన చేసి బెంగాల్ లో విద్యావంతులైన వారు బెంగాలీ భాషలో తమ భావాలు వ్యక్తం చేయడం మొదలు పెట్టారు. **ఆంగ్ల భాష వ్యావహారికంగా ఉపయోగపడుతుంది గాని వ్యక్తిగత భావాలను వ్యక్తం చేయటానికి యీ భాష తగదు అని వారు తెలుసుకున్నారు. ఎంతో పరిశ్రమతో చిన్నప్పటి నుంచి ఆంగ్ల భాష నేర్చుకుంటున్నప్పటికీ వర్తమాన సాహిత్యం (చిర కాలం ఉంటుందని ఆశించేది) బెంగాలీ భాషలోనే వెలువడింది.** భారతీయులు ఆంగ్లభాషలో తమ భావాలను వ్యక్తం చేయగలందుకు తగినట్లు మనసును ఆ భాషతో మేళవించలేకపోవటమే దీనికి ముఖ్య కారణం. ఒకవేళ **ఆంగ్ల భాషతో చక్కని సంబంధం ఏర్పరచుకున్నప్పటికీ భారతీయ భావాలను స్వదేశీ భాషలో వ్యక్తం చేయగలిగినంత అందంగా ఆంగ్ల భాషలో చేయలేరు.** మన మనసులకు ప్రేరణ కలిగించే విషయాలను, భావాలను విదేశీ భాషలలో బాగా స్వతంత్రంగా ప్రకటించలేం.

**మన విద్యావంతులైన యువకులు తమని తాము వ్యక్తం చేయడానికి ప్రయత్నం చేసేటప్పుడు, దానికి మాతృభాషను ఆశ్రయించేటప్పుడు ఒక అలజడికి గురి అవుతున్నారు. యింత కాలం నించీ పొందిన నిరాదరణను, మానహానిని మరచి, పిలిచిన వెంటనే విద్యాగర్వంతో మిడిసిపడేవారి ఎదుట తన సమస్త సౌందర్యంతో, గరిమతో చేతులు కట్టుకుని నిల్చేదు మన స్వభాష.**

మీ స్వభాష వైభవాన్ని అర్థం చేసుకోగలరా? దీని రహస్యాన్ని తెలుసుకోవాలనే ప్రయత్నం చేశారా?

మీరు మిల్, స్పెన్సర్ (18వ శతాబ్దపు ఆంగ్ల తత్వవేత్తలు) రచనలు అధ్యయనం చేశామని, పెద్ద పెద్ద డిగ్రీలు, సర్టిఫికెట్లు పొందామని అనుకుంటూ వుండవచ్చు. అందువల్ల స్వతంత్రంగా ఆలోచించి అర్థం చేసుకునే యోగ్యత కలవారమని, పరిపూర్ణ విద్వాంసులమని భావించవచ్చు. దురదృష్టవశాన బహు పుత్రికలకు జన్మనిచ్చి ఆ భారంతో అణిగిపోయిన తల్లిదండ్రులు తమ కూతుళ్ళను, కోరినంత ధనాన్ని తెచ్చి మన యింటి ద్వారాల వద్ద మోకరిల్లినట్లే నిరక్షరాస్యులైన గ్రామీణుల అతి తక్కువదయిన దేశభాష, మీ సంకేతమాత్రం చేత మీ శరణుజొచ్చి తన జీవితాన్ని సఫలం చేసుకుంటుందని మీరు భావిస్తున్నారు. జీవితమంతా ఆంగ్లభాషను నేర్చుకొని కూడా మాతృభాషలో రాయటానికి పూనుకున్నామంటే, ఆంగ్లభాషలో తేలికగా లభ్యమయ్యే ప్రతిష్ఠను తిరస్కరించి, ఉన్నత అమూల్యమైన తమ భావ ముత్యాలను యీ స్వదేశీ భాషపై ఎంతో విశాల హృదయంతో ఎంతో సాహసంతో వెదజల్లటానికి తత్పరత చూపిస్తున్నామంటే యీ భాష భాగ్యమేనని అనుకుంటారు. మహారాజు విచ్చేయడం చూసి అత్యంత గౌరవంతో దారి తొలగి నిల్చొన్న నిర్ధనుడిలా తమ మార్గంలో వచ్చే అడ్డంకులు, కష్టాలు కూడా భయపడి తమ ముందు నుంచి తొలగి ఒక పక్క నిలబడతాయనుకొంటారు. "దేశవాసులారా! ఒక్క క్షణం ఆలోచించి చూడండి, మేం మీ మీద ఎంత దయచూపుతున్నామో! మేం మీకు రాజకీయ ఆర్థిక సమస్యల గురించి ఎన్ని విషయాలైనా చెపుతాం. భూగోళం గురించి మేం నేర్చుకొన్న దాన్ని ఆది నుండి అంతం దాకా వినిపిస్తాం. ఏదీ దాచటానికి ప్రయత్నం చేయం, యితర దేశ భాషలలోని ప్రసిద్ధమైన, అవగాహనకు కఠినమైన పుస్తకాల నుండి ఆలోచించదగిన విషయాలు సంక్షిప్తంగా చెపుతాం. అనేక చారిత్రకమైన విదేశీ సాహిత్యంపై విద్వాంసులు, విమర్శకులు ఎటువంటి అభిప్రాయాలు వ్యక్తం చేశారో అదీ చెపుతాం. కానీ యీ నీ గ్రామభాష, నీ స్వభాష ఆజ్ఞాపించగానే మా ఎదురుగా నిలబడక పోతే ఆ భాషలో ఒక్క శబ్దం కూడా రాయం. మేం ప్లీడరీ చేస్తాం, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు అవ్వగలం, పోలీసు సూపరెంటెంట్, న్యాయాధీశులు, డిప్టీ కలెక్టర్ ఏదైనా కాగలం. నచ్చితే ఆంగ్లపత్రికల్లో వ్యాసాలు రాస్తాం. కానీ స్వభాష పేరైనా ఎత్తం. ఆలోచించండి. దీని వల్ల ఎంత హాని జరుగుతుందో!" అని అంటారు.

ఇదంతా మన దేశదౌర్భాగ్యం కాకపోతే మరేమిటి? మన మాతృభాష ఆంగ్లభాషామోహితులైన యీ నవయువకులను గౌరవించదు. యీ యువకులు తమ మిథ్యా గర్వాన్ని వదలి మాతృభాషతో మమేకం కావటానికి ప్రయత్నం చేయరు. వీరు కనీసం మాతృభాషలో ఒక ఉత్తరమైనా రాయరు. తమ మిత్రులను, ఆత్మీయులను కలుసుకున్నప్పుడు సాధ్యమైనంతవరకు ఆంగ్లంలోనే మాట్లాడతారు. స్వదేశీ భాషా గ్రంథాలను తమ యింటిలోకి కూడా రానివ్వరు. దీన్నే చిన్నతప్పుకు పెద్దదండన అంటారు.

బాల్యంలో మనకు నేర్పే విద్యలో భాషాజ్ఞానంతో పాటు భావాలలో శిక్షణను ఇవ్వరు. సమయం మించిపోయిన తరువాత దానికి విరుద్ధంగా జరుగుతోంది. భావాలు ఉత్పన్నమయ్యే సమయానికి మన వద్ద భాష వుండదు.

భాషాజ్ఞానంతో పాటు భావస్ఫూర్తిని కలగచేసే విద్య నేర్పడం లేదని ముందుగానే చెప్పాను. అందువల్లనే మన భావాలు, పాశ్చాత్య భావాల మధ్య సమానత వుండడం లేదు. యీ రోజు చాలామంది విద్యావంతులు పాశ్చాత్య విషయాలపట్ల విముఖత చూపుతున్నారు. అలా అని వారు తమ మాతృభాషలో సన్నిహిత పరిచయం ఏర్పరచుకోలేక పోతున్నారు. తమ స్వభాషకు కూడా వారు చాలా దూరమై పోయారు. తమ భాషపట్ల వారి మనస్సుల్లో అవహేళనాభావం చోటుచేసుకుంది. కానీ వారు తమకు మాతృభాషాజ్ఞానం లేదని కూడా ఒప్పుకోవటం లేదు. ప్రతి భావాన్ని వ్యక్తం చేసే శక్తి మన మాతృభాషకు ఉందా? అని ప్రశ్నిస్తూ యీ స్వభాష విద్యావంతులకు పనికిరాదు అని చెప్పి తమ బలహీనతను కప్పి పుచ్చుకుంటారు. అందని ద్రాక్షపండ్లు పుల్లన అన్నట్లు ఉంది ఇది. మనశక్తికి అలవికాని పనిని ప్రశంసించటానికి బదులు నిందించటం మొదలుపెడతాం.

**తరువాయి 28 వ పుటలో.......**

కొత్తమాట

స.వెం.రమేశ్

# కొత్తమాటల పుట్టింపు

3

"అన్నయ్యా, నిన్ను ఒకమాట అడగాలనుకొంటున్నాను. అయితే నా అడక(ప్రశ్న)కు నీ తిరువు(జవాబు) దురుసుగా ఉంటుందేమో అని జంకుతున్నాను" అన్నాడు నారాయణ. "అదే నారాయణా వద్దనేది. పెరనుడుల మీది తగులం(వ్యామోహం)తో తెలుగును ఈసడించుకొనేది నువ్వు. 'తెలుగు అనే పులుగుకు, సంసుక్రుతం ఇంగ్లీసు అనేవి రెండు రెక్కలు, ఏ రెక్క తక్కువయినా తెలుగు ఎగరలేదు' అనింది నువ్వు. 'ఆనిమిమాటల పుట్టింపుకు తెలుగు చేవలేనిదీ చేతకానిదీ' అని వెక్కసమాడింది నువ్వు. నీ కరకుమాటలకు మారుపలుకుతున్నాడు అన్నయ్య. అవి నీకు దురుసుగా అనిపిస్తున్నాయా?" అంటూ గయ్యిమని లేచినాడు చిన్నయ్య..

"చిన్నయ్యా, జరిగిపోయిన పెళ్లికి మేళమెందుకు ఊరకుండు. నారాయణా, చిన్నయ్య మాటల్ని పట్టించుకోకు. తెలుగుమీద మాకెంత అక్కరా అనుగూ ఉందో నీకూ అంతే ఉందని నేనెరుగుదును. నువ్వు నడచివచ్చిన దారి వేరు, నేను నడవమంటున్న దారి వేరు. ఈ గజిబిజి నుండి బయటపడుతావులే. ఇంతకీ నువ్వు అడగాలనుకొన్నది ఏమిటో అడుగు' అన్నాను నేను కలిపించుకొంటూ.

"ఏమీ లేదు అన్నయ్యా. తామరపువ్వుకు తెలుగులో, తామర, తమ్మి వంటివి రెండో మూడో పేర్లున్నాయి అంతేకదా! అదే సంసుక్రుతంలో అయితే బోలెడుమాటలు కనబడుతాయి. అంబుజ, అబ్జ, ఉదజ, కంజ, జలజ, తోయజ, నీరజ, పంకజ, పయోజ, వనజ, వారిజ, సరసిజ, సరోజ వంటివి ఇంకా ఎన్నో ఉన్నాయి. అట్లాంటప్పుడు సంసుక్రుతం కన్నా తెలుగు గొప్పనుడి ఎట్లా అవుతుంది?" అని అడిగినాడు నారాయణ.

"నారాయణా, నువ్వు బాగా బాగా గుర్తుంచుకోవలసినది ఏమిటంటే, నేను ఎన్నడూ కూడా సంసుక్రుతం కంటే తెలుగు గొప్పది అనలేదు. అట్లాగే తెలుగుకంటే సంసుక్రుతమూ గొప్పది కాదు. దేని గొప్పతనం దానిది. సంసుక్రుతం దాదాపు వెయ్యేళ్లు బారతనాడులో పెనునుడిగా ఉండేది. పలునుడులు ఉండే నాడుల్లో ఎసిదానిమి (శాస్త్రసాంకేతిక) అక్కరలకు ఒక పెనునుడి కానే కావాలి. మన బారతనాడులో పాళీ, సంసుక్రుతం నుడులు ఎక్కువతావుల్లో ఎక్కువతరిలోనూ, పారసీకం తక్కువ తావుల్లో తక్కువ తరిలోనూ పెనునుడులుగా ఉన్నాయి. ఇటీవల రెండు మూడు వందలేళ్ల నుండి ఇంగిలీసు మన నాడుకంతా పెనునుడిగా ఉంది. ఇంగిలీసు, పారసీక నుడులలో వెలువడిన ఎసుదు(శాస్త్రా)లన్నీ బయట నుండి వచ్చినవే. పాళీ సంసుక్రుతాల్లో వచ్చిన ఎసుదులు అప్పటంగా ఈనేలవి. బారతనాడులో పలునుడులకు చెందిన ఎసిదరులు కనిపెట్టినవన్నీ పెనునుడి అయిన సంసుక్రుతంలో వెలువడినాయి. మచ్చుకు మనికిమినుకు(ఆయుర్వేదం)నే తీసుకొందాం. పలునుడుల ఎసిదరులు ఒకచోట కూర్చుని ఒక మొక్క గురించి మాట్లాడుకోవాలి. తమిళంలో దాని పేరు 'తొట్టాచినంగి', తెలుగులో 'అత్తిపత్తి'. తెలుగులో కూడా అత్తిపత్తి, సిగ్గుగొడ్డ, లజ్జటాలు, ముదుగుతామర అని తావుతావుకూ దాని పేరు మారుతుంది. ఏ పేరుతో ఆ మొక్కను పొదక(రికార్డ్) చేయాలి? అందుకోసమే పెనునుడి కావాలి. ఆ పెనునుడిని తెలివరులు అందరూ నేర్చుకొంటారు. మననాడులోనే పుట్టిన మనికిమినుకు వంటి ఎసుదులన్నీ సంసుక్రుతంలో ఉండడానికి కతము ఇదే."

"అన్నయ్యా, నారాయణ అడిగినదానికీ నువ్వు చెబుతున్నదానికి పొంతన కుదరడం లేదు. నారాయణ తామరకు చెప్పిన సంసుక్రుతం మాటలన్నీ ఎసిదానిమి మాటలే అంటావా?" నడుమన దూరినాడు చిన్నయ్య.

"అక్కడికే వస్తున్నాను కాస్త ఆగు చిన్నయ్యా, పెనునుడిగా మారిన నుడి ఎసిదినుడిగా మట్టుకే కాదు, ఎన్నువ(కళ)నుడిగా కూడా ఎదుగుతుంది. ఎన్నువకు చెందిన నెన్నొడికూడా అందులో ఏర్పడుతుంది. అల్లిక(రచన) అనేది ఒక ఎన్నువ కదా. పాతతరిలో అల్లికలంతా పడిక(పద్యం)లుగా ఉండేవి. ఆ పాడికలు అల్లడానికి కొలువడి(చందస్సు)ఉండేది. ఆ కొలువడికి తగినట్లుగా మాటలు కావలసి వచ్చేవి. అల్లికరు(రచయిత)లు కొంగొత్త మాటలను ఎన్నో కొలువడికి తగినట్లు పుట్టించేవారు. ఇదంతా సంసుక్రుతంలో పెద్దయెత్తున జరిగింది. అట్లా పుట్టిన మాటలే పైన నారాయణ చెప్పినవి. దానినే పలుకొడమి(పదసంపద) అంటాం. తెలుగులో అల్లిక మొదలయ్యే నాటికి, సంసుక్రుతంలో పలుకొడమి ఎంతో ఎదిగి ఉండేది. తెలుగు అల్లికరులు ఆ మాటలనే తీసుకొని వాడేసినారు. కొత్త మాటల పుట్టుకకు పూనుకొన్నవారు కొద్దిమందే. వాళ్లు కూడా చాలా పొడవయిన మాటలనే ఎక్కువగా పుట్టించినారు. ఎన్నువ నెన్నొడిని కూడా తెలుగులో పుట్టించి పెంపొందించవచ్చు. ఆ పని కూడా జరుగవలసిందే. ముందు ఎసిది నెన్నొడిని పుట్టించి, వాటిని బడిలో నేర్పుతూ ఉంటే, ఎన్నువమాటలను పుట్టించేవారు వారంతట వస్తారు. సంసుక్రుతంలో 'జన్మ' అనే మాటలోని 'జ' సడికి 'పుట్టుక' అనే తెల్లంను కల్పించి; అంబు, ఉద, జల, కం, తోయ, నీర, పంక, వన, పయ, వారి, సరసి, సరో వంటి కుదురులకు, 'జ'ను చేర్పుగా చేర్చి బోలెడు ఎన్నువమాటలను పుట్టించినారు కదా. అట్లాగే 'కను, కనుబడి, కలిమి' వంటి పుట్టుకకు చెందిన తెలుగుమాటలలోని తొలిసడి అయిన 'క'ను చేర్పుగా చేర్చి తెలుగులో తామరకు కొంగొత్త ఎన్నువమాటలను పుట్టించవచ్చు. అడుసుక, అవుసుక, ఈరుక, ఊటుక, ఏటిక, కుళంక, కొలకుక, కొలనుక, కొళముక, కొళ్నుక, కోడుక, చదుకుక, చింకక, చిత్తడిక, చెర్వుక, చెల్మక, జౌకుక, జేడక, టెంకిక, దొనక, దొర్వుక, నీరుక, నీర్క నీళుక, పడియక, పద్యక, బురదక, మడుగుక, మడువుక, లట్టుక, లొందుక, వెంచక, వెళ్లక, వెల్లక, రొంపిక, సెలక.... ఇట్ల పుట్టించుకొంటూ వెళ్లవచ్చు. అట్లాగే 'పడయు, పడతి, పడుపు వంటి మాటలలో పుట్టుకకు చెందిన తెల్లం కనబడుతున్నది కదా, వాటిలోని 'ప' సడిని కూడా చేర్చుకొని తామరకు మరిన్ని మాటలను పుట్టించవచ్చు. 'పుట్టు, పుట్టుక, పుట్టుగు, పుట్టుబడి, పుట్టువ'లలోని 'పు'ను తీసుకొని ఇంకొన్ని మాటలను

పుట్టించవచ్చు" అని విడమరచినాను.

"ఎందుకనో ఈ మాటలను నేను ఒప్పుకోలేకపోతున్నాను. మాట మొదటి వ్రాత(అక్షరం)ను తీసుకొని దానిని చేర్పు అనడం ఒప్పుదల కాదేమో" అన్నాడు నారాయణ.

"అవునవును, ఎందుకు ఒప్పుదల అవుతుంది? అన్నయ్య చెప్పింది తెలుగుమాటల గురించి కదా! అదే సంస్క్రుతం గురించి అయితే అన్నయ్యేమిటి, నేను చెప్పినా ఒప్పుదల అవుతుంది. 'నీవు నేర్పిన చద్వుయే నీర్పుగంటి' అన్నట్లు, 'జన్మ'లోని తొలిసడి అయిన 'జ'ను తీసుకొని సంస్క్రుతంలో మాటలను పుట్టించినట్లే తెలుగులోనూ చేసినాడు అన్నయ్య. ఇందులో తప్పిదం ఏముంది, ఒప్పుదల కానిది ఏముంది? తాను చేస్తే కాపురం, ఇంకొకర్తి చేస్తే రంకు అన్నదట వెనకటికి ఒకావిడ. అట్లాగుంది నువ్వు చెప్పేది" అని నారాయణను వెక్కసమాడినాడు చిన్నయ్య.

"చిన్నయ్యా, ఎంత చక్కచేసినా కుక్కతోక వంకరే అన్నట్లు ఎంత చెప్పినా నీ తెలివి తేటగిల్లడం లేదు. నారాయణ మీద ఎందుకలా విరుచుకుపడుతావు" అని చిన్నయ్యను కసరినాను.

"కుట్టినమ్మ కుదురుగా ఉంది, అరిచినమ్మ తెరువుకెక్కింది అన్నట్లు, తెలుగునీ నిన్నూ అగడుగా మాట్లాడే నారాయణేమో మంచివాడు, నేనే చెడ్డవాడినయ్యాను" నొచ్చుకొంటూ అన్నాడు చిన్నయ్య.

"చిన్నయ్యా, నువ్వు కూడా నొచ్చుకొంటే ఎట్లా? కాత ఉండే మానుకే రాతిదెబ్బలు. నలుగురు మనల్ని తెగడుతున్నారంటే మనదగ్గర ఏదో సరుకు ఉండబట్టే కదా! మనం ఈ పూటకి ఇక ఎన్నువ మాటల్ని పక్కన పెట్టి ఎసిదిమాటలను గురించి ముచ్చటించుకొందాం సరేనా" అన్నాను. -

"చిన్నయ్యా, నన్ను మన్నించు. ఇదివరకటిలాగా కాదు, నేనూ కొంత మారినాను. ఇంకా మారుతాను. నాకు కూడా తెలుగంటే మక్కువే" వేడుకొంటున్నట్లుగా అన్నాడు నారాయణ. ఆ మాటతో చిన్నయ్య హాయిగా నవ్వేసినాడు.

"ఏదయినా ఒకమంచి చేర్పును గురించి చెప్పు అన్నయ్యా" అన్నాడు నారాయణ.

''చెపుతాను వినండి. 'అరము' అనే చేర్పు గురించి మాట్లాడుకొందాం. దీనిని 'అరం' అని కూడా రాసుకోవచ్చు. ఈ చేర్పు వెనుక చాలా మెలన(చరిత్ర) ఉంది. ఇది తెల్లం లేని వట్టి చేర్పు మట్టుకే కాదు. ఇది తెల్లమున్న మాట. తెలుగు నుడిగంటలకు ఇంకా ఎక్కనిమాట. ఎక్కించుకొని తీరవలసినమాట. అరం అంటే, డ్యూటీ లేదా దర్మం. తమిళ నుడిగంటులలో ఈ మాట కనపడుతుంది. దర్మం అనే సంస్క్రుతపు మాటకు తమిళమాటగా ఉంటుంది. దీనిని చూసిన వెంటనే మన పెద్దలు, ఇది తమిళమాట అని చాటేస్తారు. నిక్కానికి ఇది తెలుగుమాట. తెలుగునుండే తమిళానికి వెళ్లి ఉండాలి. ఎందుకంటే తెలుగువాళ్లం వాడినంత ఎక్కువగా తమిళులు ఈ మాటను వాడడం లేదు. వాడుక తమిళంలో ఈ మాట లేనేలేదు. కానీ వాళ్ల నుడిగంటులకు ఎక్కింది, మనం పట్టించుకోలేదు, అంతే.

బారతనాడులోని అన్ని నుడిగుంపులలో తెలుగువాళ్లే మునుముందుగా కనుబడి(ఉత్పత్తి) మట్టుకు ఎదిగిన వారు అని చెప్పే ఆనవాళ్లలో ఒకటి ఈ అరం. తిండిని వెతుక్కొంటూ ఎడువుకొంటూ(సేకరించుకొంటూ) అచ్చోటా ఇచ్చోటా తిరిగే మట్టునుండి, తిండిని పండించుకొంటూ ఒకచోటున కుదురుకొనడాన్నే కనుబడిమట్టు అంటారు. ఈ మట్టులో పనిపంపకం జరుగుతుంది. నేర్పరితనంతో కూడిన పనినే అరం అంటాం. ఎవరైనా ఎప్పుడైనా చేయగలిగేది 'పని'. బాగా నేర్చుకొని నెరతనం పొందినాక చేసేది అరం. ఇంగ్లీసులో వర్క్ డ్యూటీ అనే మాటలకు ఉన్న వేరిమే ఈ రెండు తెలుగుమాటల నడుమనా ఉంది.

అరంతో కూడిన మాటలు తెలుగులో చాలా ఉన్నాయి. కుమ్మరం, కమ్మరం, మేదరం, నేతరం, కంచరం, వడ్డరం, కాలరం వంటివి వాటిలో కొన్ని. ఇట్ల పలుపనులకు ఒకటే చేర్పుతో మాటలు ఉండడం ఒక్క తెలుగులోనే చూడగలం. అంటే తెలుగువాళ్లు అంత నేటుగా పనులను పంచుకొన్నారు. కనుబడిమట్టుకు తొట్టతొలిగా రావడం వల్లనే ఇటువంటి మాటలు పుడుతాయి. ఇంకొకరిని చూసి నేర్చుకొని కనుబడిలోకి వచ్చినవారిలో ఉమ్మడిచేర్పులతో మాటలు ఉండవు. వేలయేళ్ల కిందటనే తెలుగువాళ్లు కనుబడిమట్టుకు చేరుకొన్నారు అని 'అరం' నొక్కి చెపుతూ ఉంది. మనం కూడా అరంతో ఎన్నో కొంగొత్త ఎసిదానిమి మాటలను పుట్టించవచ్చు" అంటూ మాటల పుట్టింపును మొదలిడినాను.

1. తోలు + అరం = తోలరం డ్రైవింగ్
2. నడుపు + అరం = నడుపరం కండక్టింగ్
నిర్వహణ అంటున్నారు.
3. తోము + అరం = తోమరం క్లీనింగ్
4. మర + అరం = మరవరం ఇంజనీరింగ్
5. నీటి + అరం = నీటరం ప్లంబింగ్
6. మిను + అరం = మిన్నరం ఎలక్ట్రికల్ వర్క్
మిను అంటే ఎలక్ట్రానిక్. మించు అంటే ఎలక్టిసిటీ.
7. పసను + అరం = పసనరం పెయింటింగ్
పసను అంటే రంగు. రంగులు వేయడం.
8. పొల్లు + అరం = పొల్లరం టైలరింగ్
పొల్లు అంటే కుట్టడం. కుట్టరం అని కూడా అనవచ్చు.
9. ఉడిగ + అరం = ఉడిగరం సర్వింగ్
ఉడిగం అంటే సేవ.
10. కరపు + అరం = కరపరం టీచింగ్
కరపు అంటే నేర్పడం.
11. జరుపు + అరం = జరుపరం మేనేజింగ్
దీనిని కూడా నిర్వహణ అంటున్నారు.
12. కూర్చు + అరం = కూర్పరం. ఎడిటింగ్...
సంపాదకత్వం అంటున్నారు.
13. మార్చు + అరం = మార్పరం. ట్రాన్స్‌లేషన్..
అనువాదం అంటున్నారు.
14. వళుకు + అరం = వళుకరం. అడ్వొకసీ
వళుకు అంటే వాగ్వాదం.
15. కనుగాపు + అరం = కనుగాపరం సూపర్వైజింగ్
కనుగాపు అంటే బాగా చూసుకోవడం. పర్యవేక్షణ అంటున్నారు.

“మచ్చుకు ఈ కొద్దిమాటలను చెప్పినాను. మన అక్కరలకు కావలసినన్ని ఆనిమి మాటలను ఈ ‘అరం’తో పుట్టించుకోవచ్చు” అని ముగించినాను.

## 4

“**నా**కొక అరగలి(సందేహం) అన్నయ్యా, కొంగొత్త పనులకు ‘అరం’ చేర్పుతో తెలుగుమాటలను పుట్టించినాం కదా, ఆ పనులతో పాటు పనులను చేసేవారికి కూడా తెలుగుమాటలు ఉండాలి కదా, ఎందుకంటే, నువ్వు డ్రైవింగ్ కు తోలరం అన్నావు. ఆమాటకు తెలివరులు పేరు పెట్టలేదు కానీ, డ్రైవర్కు ‘చోదకుడు’ అని పేరును పెట్టున్నారు మన నుడివరులు” నారాయణను ఓరకంట చూస్తూ అన్నాడు చిన్నయ్య.

చిన్నయ్య మాటలకు నారాయణ నవ్వుతూ, “చిన్నయ్యా, ఇప్పుడిక నీ మాటలకు నేనేమీ ఉడుక్కోనులే” అని చిన్నయ్యతో అని, నావైపు చూసి, “అన్నయ్యా, కుమ్మరం చేసేవాడు కుమ్మరి, మేదరం చేసేవాడు మేదరి, కమ్మరం చేసేవాడు కమ్మరి కదా. ఈ మాటల్లోని ‘అరి’ ఇక్కడ చేర్పు అవుతుంది కదా” అన్నాడు.

నాకు ఎంతో ఎలమి (సంతోషం) కలిగింది. “నువ్వు సరిగ్గా తలపోస్తున్నావు నారాయణా. ‘అరి’తో కొత్త మాటలను పుట్టిద్దాం పట్టు” అన్నాను. ముగ్గురమూ కలిసి ఓ పట్టు పట్టినాం.

1. తోలు + అరి = తోలరి డ్రైవర్
2. నడుపు + అరి = నడుపరి కండక్టర్
3. తోము + అరి = తోమరి క్లీనర్
4. విరుగు + అరి = విరుగరి డాక్టర్
   విరుగు అంటే చికిత్స.
5. మర + అరి = మరవరి ఇంజనీర్
   మర అంటే ఇంజిన్.
6. వళుకు + అరి = వళుకరి అడ్వొకేట్
7. తీర్పు + అరి = తీర్పరి జడ్జ్
8. తోడు + అరి = తోడరి హెల్పర్
9. నీటి + అరి = నీటరి ప్లంబర్
10. పొందు + అరి = పొందరి కన్జ్యూమర్
    పొందేవాడు. గ్రాహకుడు అని వాడుతున్నారు.
11. ఈవి + అరి = ఈవరి సబ్స్క్రైబర్
    ఇచ్చేవాడు చందాదారుడు అని వాడుతున్నారు.
12. మిను + అరి = మిన్నరి ఎలక్ట్రీషియన్
13. పసను + అరి = పసనరి పెయింటర్
14. పాట + అరి = పాటరి సింగర్
    గాయకుడు అంటున్నారు.
15. ఆట + అరి = ఆటరి స్పోర్ట్స్‌మేన్
    క్రీడాకారుడు అంటున్నారు.
16. ఈదు + అరి = ఈదరి స్విమ్మర్
17. పరుగు + అరి = పరుగరి రన్నర్
18. ఉరుకు + అరి = ఉరుకరి రేసర్
19. పొల్లు + అరి = పొల్లరి టైలర్
20. ఉడిగం + అరి = ఉడిగరి సర్వర్
21. జరుపు + అరి = జరుపరి మేనేజర్
22. చేత + అరి = చేతరి సెక్రెటరీ
23. ఉబుసు + అరి = ఉబుసరి మెసెంజర్
    ఉబుసు అంటే మెసేజ్.
24. కరపు + అరి = కరపరి టీచర్
    ఉపాధ్యాయుడు అంటున్నారు.
25. చదువు + అరి = చదువరి రీడర్
    పాటకుడు అంటున్నారు.
26. కూర్చు + అరి = కూర్పరి ఎడిటర్
    సంపాదకుడు అంటున్నారు.
27. చనవు + అరి = చనవరి ఆఫీసర్
    చనవు అంటే అదికారం. అదికారి అంటున్నారు.
28. మార్చు + అరి = మార్పరి ట్రాన్స్‌లేటర్
29. కనుగాపు+అరి = కనుగాపరి సూపర్‌వైజర్
    పర్యవేక్షకుడు అంటున్నారు.
30. తిరుగు + అరి = తిరుగరి టూరిస్ట్
    పర్యాటకుడు అంటున్నారు.
31. అనుపు + అరి = అనుపరి కలెక్టర్ అనుపు అంటే పన్ను (టాక్స్). పన్నులను కలెక్ట్ చేసేవాడు. కరగ్రాహి అనే పేరును పెట్టినారు.
32. అలము + అరి = అలమరి సంచారి అలము అంటే తిరగడం. ఈ మాట చిన్నమార్పుతో అలబరిగా నెల్లూరు తావున వాడుతున్నారు.
33. దొమ్ము + అరి = దొమ్మరి యోదుడు
    దొమ్ము అంటే కొట్లాట లేదా పోరాటం.
34. మాటాట+ అరి = మాటాటరి లెక్చరర్
    మాటాట అంటే ప్రసంగం లేదా లెక్చర్. ఉపన్యాసకుడు అంటున్నారు.
35. పలుకు + అరి = పలుకరి స్టూడెంట్
    పలుకు అంటే విద్య. విద్యార్థి అంటున్నారు.

“చాలు చాలన్నయ్యా, అబ్బ ఎన్నిమాటలో” అరుదు(ఆశ్చర్యం)పడుతూ అన్నాడు చిన్నయ్య. “మన తెలుగునుడి చేవ అటువంటిది చిన్నయ్యా” అంటూ ముగించినాను నేను.

(తరువాయి వచ్చే సంచికలో...)

భాషలు మసకబారినప్పుడు ప్రపంచ సాంస్కృతిక వైవిధ్యం కూడా మసకబారుతుంది. మనవైన అవకాశాలూ సంప్రదాయాలూ చారిత్రిక నైపథ్యం, మనకే సొంతమైన ప్రత్యేక ఆలోచనా సరళీ విలువైన మానవ వనరులూ కనుమరుగైపోతాయి. –యునెస్కో

సి.వి.క్రిష్ణయ్య
93965 14554

# అక్షరాలతో ఆటలు - 1

**అ**క్షరాలతో ఆటల్లోకి వెళ్లేముందు భాష మనిషి ఆలోచలను ఎలా ప్రభావితం చేసిందో, జ్ఞానసంపాదనకు ఎలా దోహదపడిందో, బాల్యంలో ఆటలకున్న ప్రాధాన్యతఎలాంటిదో తెలుసుకోవడం అవసరం. ఇక్కడ సంక్షిప్తంగా కొన్ని విషయాలు ప్రస్తావిస్తాను.

**మెదడు - భాష - జ్ఞానం**

తొలిదశలో మనిషి మెదడు ఆలోచించే ఆలోచనలకు పరిమితి ఉండేది. భాష అనే పరికరాన్ని కనుగొన్న తర్వాత మెదడు చేసే ఆలోచనలకు పరిమితి లేకుండా పోయింది. అంతులేని జ్ఞాపకాలను, అపరిమితమైన జ్ఞానాన్ని నిల్వచేసుకోడానికి వీలైంది. ఆ తర్వాత లిపి కనుగొని (తన మాటలకు భౌతిక రూపాన్నిఇచ్చి) తన ఆలోచనలను జ్ఞానాన్ని బయట దాచుకోవడం మొదలుపెట్టింది. అంతటితో ఆగకుండా కంప్యూటర్‌ను, అంతర్జాలాన్ని సృష్టించుకొని ప్రపంచంలోని అన్ని మెదళ్లను ఏకం చేసింది. ఈ సృష్టిలో మనిషి మెదడుకన్నా అద్భుతమైనది ఏముంది?

భాష పుట్టిన తర్వాతనే మెదడు తర్కబద్ధంగా ఆలోచించడానికి వీలైంది. సందేహం వచ్చినా, ప్రశ్నఎదురైనా, సమస్య వచ్చినా, పరిష్కారందొరికే వరకు మెదడు ఆలోచిస్తూనే ఉంటుంది. అన్వేషిస్తూనే ఉంటుంది. దాని తలా తోకా పట్టుకొని ఆనందిస్తుంది.

**మెదడు నేర్చుకొనే పద్ధతి**

ఆలోచించడం, అర్థంచేసుకోవడం నేర్చుకోవడం మెదడుకు శ్రమకాదు. ఆనందం. మరి బడిలో పిల్లలు ఆనందంగా ఎందుకు నేర్చుకోలేకపోతున్నారు? ఎందుకు విసిగిపోతున్నారు? బడికి శలవులంటే ఎందుకు ఎగిరి గంతులేస్తున్నారు? ఎందుకు ఫెయిల్ అవుతున్నారు? ఎందుకు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు?

నేర్చుకోడానికి మెదడుకు ఒక సహజమైన పద్ధతి ఉంది. మెదడు స్వేచ్ఛాపూరిత వాతావరణంలో భయం లేకుండా ఎలాంటి వత్తిడి లేకుండా, ఇష్టమైన విషయం ఇష్టమొచ్చినపుడు నేర్చుకోవడమే జీవితం.

బడిలో పరిస్థితి ఇలా ఉండదు. ఈ క్షణంలో ఇది నేర్చుకోవాలనే నియమం ఉంటుంది. ఆజ్ఞ ఉంటుంది. నిర్బంధం ఉంటుంది. మెదడు దీన్ని అంగీకరించదు. ప్రతిఘటిస్తుంది. నేర్చుకోవాడాన్ని పక్కనబెట్టి నేర్చుకోకుండా ఉండడానికి ప్రయత్నిస్తుంది. స్వేచ్ఛకోసం పోరాటం మొదలుపెడుతుంది. ఇదంతా మనస్సులో జరిగే సంఘర్షణ. తమలోపల జరుగుతున్న సంఘర్షణ పిల్లలకు అర్థంగాదు. పాపం పిల్లలు నేర్చుకోలేకపోతున్నామని బాధపడ్తారు. బలవంతంగా శరీరంతో పనిచేయించగలంగాని, మెదడుతో పని చేయించలేం. గుర్రాన్ని నీళ్ల దగ్గరకు తీసుకొని వెళ్లగలంకాని, నీళ్లు తాగించలేం.

బడిలో ఈ అశాస్త్రీయ పద్ధతులు ఎప్పుడు ప్రారంభమయ్యాయో అప్పటి నుండి నేర్చుకోలేకపోవడం, ఫెయిల్‌గావడం, నిరాసక్తంగా తయారుగావడం అనే మానసిక జబ్బులు మనిషి మెదడులో ప్రవేశించాయి.

**బాల్యం - ఆటలు**

బాల్యంలో ప్రతీ పని ఆటలాగే ఉంటుంది. లేచినిలబడి నడవడం పరుగులుదీయడం కూడా ఆటలే. చివరకు దొంగిలించడం, దాచిపెట్టుకోవడం, అబద్ధాలు ఆడడం, తిట్టుకోవడం, కొట్టుకోవడం, స్నేహం, శత్రుత్వం సర్వం వారికి ఆటల్లా తమాషాలుగా ఉంటాయి. అందుకే పిల్లల తగువులను, కొట్టుకోవడాన్ని తగువులాటలు, కోట్లాటలు అన్నారు.

ఆటల్లో మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ఎంతో మెలకువతో ఉండాలి. అంటే వేగంగా శరీర అవయవాలు స్పందించి పనిచేయాలి. మెదడుకు శరీరావయవాలను అనుసంధానం చేసే నాడీవ్యవస్థ మరింత చురుగ్గా ఉండాలి. ఇదంతా బాల్యంలో ఆటలవల్లే సాధ్యమవుతుంది. ఆటల్లో అనేక నియమాలు ఉంటాయి. జయాపజయాలుంటాయి. ఇవన్నీ భావిజీవితానికి శిక్షణలాంటివి.

ఆటలు జీవనోపాధికో, ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడానికో, పోటీ పందేలలో పాల్గొనడానికో కాదు. మనిషి ఆరోగ్యంగా ఆనందంగా చురుగ్గా ఉండడానికి. జీవిత పోరాటానికి కావలసిన శక్తిసామర్థ్యాలు సమకూర్చుకోడానికి. తల్లిదండ్రులూ టీచర్లూ ఈ విషయం గ్రహించాలి.

ఈ ఆటలు రెండు రకాలుగా ఉంటాయి. 1.శారీరక క్రీడలు. 2.మేధో క్రీడలు. మేధో క్రీడలు రెండురకాలు. 1.విజ్ఞాన సంబంధ విషయాలకు సంబంధించినవి. 2.భాషాక్రీడలు. ప్రస్తుతం మనం భాషాక్రీడలకు పరిమితం అవుదాం.

**భాషాక్రీడలు**

భాషాక్రీడలు అంటే ఏమిటి?

ఒక్కమాటలో చెప్పాలంటే భాషతో ఆనందించడం. అక్షరాలతో, పదాలతో, వాక్యాలతో, భావాలతో, భావోద్రేకాలతో ఆనందించడం. దీన్నే భాషా సాహిత్యాలు అంటున్నాం. పాట, పద్యం, సంగీతం, కవిత్వం, కథ, నాటిక, నవల, సినిమా, టీవీ, జోక్స్ - ఇలా నిరంతరం ఆనందిస్తూ ఉంటాం. చివరకు ఒక విషాదకావ్యం చదివి, సినిమా చూసి ఏడ్చి ఆనందిస్తాం.

భాష అంటే పొడి అక్షరాల సమాహారం కాదు. భాష అంటే గుణింతాలు చూచిరాత డిక్టేషన్ కానేకాదు. భాష నేర్పడం అంటే సంధులు సమాసాలు నేర్పడంకాదు. మనం భాషలో ఉన్న ప్రాణాన్ని తీసేసి కదలికలేని శరీరాన్నిచూపి పిల్లల్ని భయకంపితుల్ని చేస్తున్నాం.

మనం పిల్లల్ని ఏ స్పందనలులేని రోబోట్లుగా తయారు చేస్తున్నామా? స్పందించే మానవులుగా తయారుచేస్తున్నామా?

ఏడాదికి ఒక్క కథలపుస్తకం కూడా చదవని, చదవలేని పిల్లలు చదువుకొన్నవాళ్లు ఎలా అవుతారు? భాషాసాహిత్యాలకు మన చదువుల్లో ఎప్పుడు ప్రాధాన్యత తగ్గిందో అప్పటినుండి తయారైన మనుషుల ప్రవర్తన ముఖ్యంగా చదువుకొని బయటకొచ్చిన వారి నడవడికల్లో తేడాలు కనిపించడం లేదా?

నియంతలుగా, క్రూరులుగా, అజ్ఞానులుగా తయారవుతున్నారు. ఎదుటి వారి ఏడ్పునుచూసి నవ్వుకొనే మనుషులుగా ఎందుకు తయారయ్యారు?

నాగరికత పెరిగేకొద్దీ, కాలంగడిచేకొద్దీ మనుషులు మరింత విజ్ఞానులుగా, మరింత ప్రజాసామ్యవాదులుగా, మరింత ప్రేమాస్పదులుగా, తయారు కావాలిగదా! ఎందుకు కాలం వెనక్కి నడుస్తూ ఉంది. కథలు, కావ్యాలు, పుస్తకాలు చదివేవాళ్లు ఇలా – వెనక్కి నడవరు. వాళ్లు ఎదుటివారి కష్టసుఖాలను చూసి స్పందిస్తారు. సున్నితమనస్కులుగా హృదయమున్న మనుషులుగా తయారవుతారు. ఈలోకం మంచి మనుషులతో నిండాలంటే భాషాసాహిత్యాలకు మన చదువుల్లో ప్రాధాన్యత పెరగాలి. బాల్యం నుండి భాషను నేర్పించేటప్పుడు అక్షరాలు నేర్పించేటప్పుడు వాటిని క్రీడాభ్యాసాలుగా మార్చాలి.

కవులు అక్షరాలతో గణయతి ప్రాసలతో అలంకారాలతో కవిత్వమల్లి ఎలా ఆనందిస్తారో పిల్లలుకూడా అక్షరాలతో పదాలతో వాక్యాలతో ఆడుకోవాలి. ఆనందించాలి.

ఈ ఆటలు ఎలా ఉంటాయో వాటితో ఎలా ఆనందించాలో వివరంగా ఇక్కడ చెప్పడం సాధ్యంగాదు. కాని పత్రికల్లో పిల్లలకోసం నిర్వహించే పేజిల్లో ఇలాంటి అంశాలుచూసి కొంత అర్థంచేసుకోవడానికి అవకాశం ఉంది. సాహిత్యం మీద మక్కువ ఉన్నవారికి ఇలాంటి వాటితో పరిచయం ఉండవచ్చు. ఐతే అవన్నీ అక్షరాలు వచ్చిన పిల్లలకు కొంతరాయడం చదవడం తెలిసిన పిల్లలకు. అసలు ఏమీరాని పిల్లలకు ఎలా చెప్పాలి? ఎలా నేర్పించాలి.

బడికి రాగానే మనం పిల్లలకు రాతతో లిపి నేర్పడానికి ప్రయత్నిస్తాం. మొదట పిల్లలకు రాతజోలికిపోకుండా వివిధ రకాల పదాలను ప్రశ్నలద్వారా పరిచయం చేయాలి. ఆ పదాల్లో అక్షరాలను పరిచయంచేయాలి. పదాల వర్గీకరణ పిల్లలు అర్థంచేసుకోవాలి.

1. తియ్యటిపండు. తొక్కతీసి దిగమింగేస్తాం. ఏమిటది?

అరటి –

2. అరటి – ఈపదంలో ఏఏ అక్షరాలు ఉన్నాయి.

అ–ర–టి.

3. తియ్యగా ఉండేవి ఏవో మరికొన్ని పేర్లు చెప్పండి.

చాక్లెట్, ఐస్‌క్రీం, బెల్లం, చెక్కెర, మామిడిపండు.

4. ఇందులో చెట్లకు కాసినది ఏది?

మామిడి పండు.

ఇలా ప్రశ్నిస్తూ పిల్లల దగ్గరనుండి సమాధానాలు రాబట్టాలి. పిల్లలు చెప్పలేకపోతే మనమే చెప్పాలి. పిల్లలు చెప్పగలవి మాత్రం మనం చెబితే పిల్లలు నిరాశపడతారు. వారికి అవకాశమివ్వాలి. చిన్న చిన్న కథలు, జోక్స్ చెబుతూ పిల్లలు మాట్లాడుతూ ఉంటే వింటూ, చాలా ఓపిగ్గా ఉపాధ్యాయులు వ్యవహరించాలి. ఐదేండ్లలోపు పిల్లలకు పదాలలో అక్షరాలు ఉంటాయని తెలియదు. చెప్పలేకపోతే నిరాశపడకూడదు. నీకురాదు, నీకు తెలియదు, అనే మాటలు పిల్లల్తో ఎట్టి పరిస్థితుల్లోనూ అనకూడదు.

మనుషులందరికీ మాట్లాడటం చాలా ఇష్టం. పిల్లలకు మరింత ఇష్టం. ఎదుటివారు వింటున్నారా లేదా అనే దాంతో సంబంధం లేకుండా తమకు తోచిన విషయాలు గుర్తుకొచ్చినవన్నీ పొంతనలేకుండా చెబుతూనే ఉంటారు. ఎందుకని? వాళ్లు భాషను వినోద సాధనంగా ఉపయోగిస్తూ దాంతో ఆనందిస్తూ ఉంటారు. భాషతో ఆనందించడమంటే వారికి తెలిసింది మాట్లాడడమేకదా! ఇప్పుడు వారికి వినేవాళ్లు కావాలి. టీచర్ వినాలి. ఎదుటి పిల్లలు వినాలి. ఒక్కోసారి పిల్లలు కొన్ని మాటలు చెప్పి నవ్వుతూ ఉంటారు. అందులో నవ్వించే అంశం లేకపోయినా ఆమాటలే వారిలోపల ప్రత్యేక ధ్వనులుగా గిలిగింతలు పెడతాయి. గలగలా, జరజరా, తళతళా వంటి ధ్వన్యనుకరణ పదాలు పిల్లల్ని ఎంతగానో అలరిస్తాయి. తొలిరోజుల్లో భాషతో ఇంతగా ఆనందించిన పిల్లలు ఆతరువాతి రోజుల్లో మాట్లాడలేని మూగమొద్దుల్లా ప్రశ్నించడం చాతకానివారుగా, ఒక విషయాన్ని అర్థంచేసుకోలేని బట్టీరాయుళ్లుగా ఎందుకు మారుతున్నారు? చదువుల్లో భాషా సాహిత్యాలను పక్కనపెట్టిన తరువాత అర్థం చేసుకొనేశక్తి ఎక్కడనుండి వస్తుంది? అందుకే పాఠాలను అర్థంచేసుకోవడం పక్కనబెట్టి ప్రశ్నలకు జవాబులు కంఠస్థం చేసుకొని గట్టెక్కిపోతున్నారు. పుస్తకంలో పాఠం అర్థం చేసుకోలేనివాళ్లు ఎదుటివారిని ఎందుకు ఎలా అర్థం చేసుకుంటారు. ఈ ప్రపంచంలో మిగిలిన ప్రాణులను ఏమి అర్థం చేసుకుంటారు? జరుగుతున్న పరిణామాలను రాబోయే ప్రమాదాలను ఏమి అర్థం చేసుకుంటారు? మన చదువులవల్లే మనుషులు ఇలా తయారయ్యారంటే కాదనగలమా?

మన చదువుల్లో భాషాసాహిత్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, బాల్యంలో భాషను క్రీడాభ్యాసాలుగా నేర్పాలని ఈ వ్యాసంలో చెప్పడానికి ప్రయత్నించాను. తరువాతి భాగంలో క్లాసురూంలో మూడవ తరగతినుండి భాషను క్రీడాభ్యాసాలుగా మార్చి ఎలా చెప్పవచ్చో వివరిస్తాను.

(రెండో భాగం వచ్చేసంచికలో...)

మాతృభాషల వాడకం భాషా వ్యవహర్తలను ఒక్క చోటికి తీసుకురావడమేకాక, అందరి భాగస్వామ్యంలో సమాజం అభివృద్ధి చెందడానికి వీలు కలిగించి సామజంలో కలివిడినీ సృజనశీలతకూ సరికొత్త ఆలోచనలకూ ఊపిరులూదుతాయి. అవిసాంస్కృతిక వైవిధ్య భరితమైన జీవనానికి ప్రాణం పోయడమేగాక, శాంతి సాధనాలుగా ఉపయోగపడతాయి – యునెస్కో

–వాచస్పతి

(గత సంచిక తరువాయి...)

# పదనిష్పాదనకళ 6

*The joy of coining new words!*

**నూతన పదాల నిష్పాదనకి మాండలికాల వితరణ**

18. ఆంగ్లపదాలకి తెలుగు సమానార్థకాల్ని రూపొందించే క్రమంలో మనం సంస్కృతం మీద హెచ్చుగా ఆధారపడుతూ వస్తున్నాం. దీనికొక కారణం మన సాంస్కృతిక వారసత్వం కాగా, ఇంకో కారణం – మన– అంటే విద్యావంతుల బౌద్ధిక వాతావరణం దేశి (గ్రామీణ) ప్రజానీకంతో సంబంధాలు కోల్పోయి ఉండడం. మనం ఉండేది నగరాల్లో/ అథవా పట్టణాల్లో ! మనం చదివేది/ మాట్లాడేది ఇంగ్లీషు లేదా ప్రామాణిక (శిష్టవ్యావహారిక) తెలుగు మాండలికం లేకపోతే ఇటు ఆంధ్రమూ, అటు ఆంగ్లమూ కానటూవంటి ఒక సంకర తెంగ్లీషు. తద్వారా మనం చాలా కృతక (synthetic) వ్యక్తులుగా మారిపోయాం .

పల్లెపట్లలో చాలా ముచ్చటైన దేశిపదాలు వాడుకలో ఉన్నాయి. వాటిల్లో చాలావఱకు ఇంగ్లీషు పదాలకి సమాధానం చెప్పగలవే. అయితే మనకి అవి తెలియకపోవడం. గ్రామీణులకేమో– అవి మనకి, అంటే పదనిష్పాదకులకి అవసరమని తెలియకపోవడం, ఈ కారణాల వల్ల పరస్పర సమాచారలోపం (communication gap) తీవరించి మనం క్రమంగా అసలైన తెలుక్కి దూరంగా, సుదూరంగా జఱీగిపోతున్నాం. “ఇంగ్లీషు పదాలే original, తెలుగు పదాలంటే మక్కికి మక్కి అనువాదాలు (True Translation), తెలుగంటే సంస్కృతం” అనే అభిప్రాయంలో పడి ఊగిసలాడుతున్నాం.కొన్నిసార్లు కొత్త పదాల్ని నిష్పాదించినవారే వాటిని వాడని పరిస్థితి కూడా లేకపోలేదు.

మాండలికాలు లేకుండా తెలుగు పరిపూర్ణం కాదు. ఆ పదాల్ని ఆయా జిల్లాలకీ, తాలూకాలకీ పరిమితం చెయ్యకుండా శిష్టవ్యావహారికంలోకి, సాహిత్య ప్రధానస్రవంతిలోకి తీసుకురాగలిగితే, అందరికీ వాటి వాడుకని అలవాటు చెయ్యగలిగితే భాషకి మహోపకారం జరుగుతుంది. అనువాదాలు చేసేటప్పుడు గానీ, సమానార్థకాల్ని రూపొందించేటప్పుడు గానీ మన భావదారిద్ర్యమూ, పదదారిద్ర్యమూ వదిలిపోతాయి. అంతకంటే ముఖ్యంగా సమర్థకాలకి కృత్రిమత్వదోషం నివారించబడి సహజ తెలుగుతనపు పరిమళాలు గుబాళిస్తాయి. మూర్త నామవాచకాల్ని (Material Nouns) ని అమూర్త నామవాచకాలు (Abstract Nouns) గా పరివర్తించడం ద్వారా చాలా బౌద్ధిక పదజాలాన్ని (intellectual vocabulary) నిష్పాదించవచ్చు. ఇందునిమిత్తం మనకి వ్యవసాయంతో సహా వివిధ గ్రామీణ వృత్తుల పదజాలాలు సహకరిస్తాయి. వాటిల్లో కొన్ని ఇప్పటికే సాహిత్యభాషలోకి ప్రవేశించాయి. అవి అలా ఇంకా ఇంకా ప్రవేశించాలనీ సాహిత్యానికీ, ప్రజలకీ మధ్య ఏర్పడిన తెంపు (disconnect) రద్దు కావాలని ఆశిస్తున్నాను. ఉదా:

మఱో ఉదాహరణ – తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వాడే “కిట్టింపు” అనే పదాన్ని తీసుకుందాం. లెక్కలో వచ్చే హెచ్చుతగ్గుల్ని సరిపెట్టడానికి ఈ పదాన్ని వాడతారు. ఇది ప్రధానంగా బళ్ళలోను ట్యూషన్లలోను వినపడే పదం. ఎలాగైనా సరే answer వచ్చేలా చెయ్యడమన్నమాట. ఇది సానుకూలార్థం (positive meaning) లో వాడే పదం మాత్రం కాదు. ఇది కిట్టింపు ఎందుకయిందంటే

కిట్టు = సరిపోవు

కిట్టుబాటు = గిట్టుబాటు

కిట్టించు = సరిపోయేలా చేయు

ఈ రకమైన కిట్టింపు (manipulation of accounts) ని మనం సత్యం కంపెనీ కుంభకోణంలో గమనించాం. మన పాత్రికేయులెవ్వరైనా ఈ పదం వాడతారేమోనని చూశాను. ఎక్కడా కనిపించలేదు.దాన్ని బట్టి చూస్తే మనం (ఆలో చనాపరులం) ప్రజలకి నేర్పాల్సినదాని కన్నా వారినుంచి నేర్చుకోవాల్సిందే ఎక్కువ ఉందనిపిస్తోంది.

**సంస్కృతం మీద అతి–ఆధారపాటు** (over-dependence)

19. మన పదాల చరిత్ర ఇప్పటిదాకా ఎలా ఉందో టూకీగా సమీక్షించుకుందాం. ఇంగ్లీషు పదాలకి ప్రతిగా మనం ఇలా అనేక సంస్కృత శబ్దాలతో, సమాసాలతో తెలుగుని నింపేయడం, అవి జనానికి నోరు తిరక్కపోవడం, పైగా అవి ఆదాన అనువాదాలు (loan translations) అనే దృష్టితో వాటిని ప్రజలు చిన్నచూపు చూడ్డం, చులకనగా మాట్లాడ్డం, వాళ్ళు ఆదరించడం లేదని మనం బాధపడడం తఱచయింది. దాని బదులు ముచ్చటైన, పలకడానికి సులభమైన, తక్కువ అక్షరాలు గలిగిన తెలుగు ప్రత్యామ్నాయాలు దొరికినప్పుడు వాటినే వాడడం మంచిది. సంస్కృతపదాల కంటే అవి త్వరగా ప్రచారంలోకి వస్తాయి. సంస్కృతపదాల్ని విచ్చలవిడిగా తెలుగులోకి దిగవేయడం (dumping) లో ఉన్న ఇబ్బందుల గుఱించి కాస్త తెలుసుకుందాం.

1. చాలా సందర్భాల్లో ఇలా దిగవేయబడే పదాలు అర్థరీత్యా తెలుగుపదాల కంటే గొప్పవి కావు.

2. కానీ వాటికివ్వబడే అనవసరమైన గౌరవం వల్ల అవి తెలుగు పదాల్నీ నీచపఱుస్తాయి (demeaning). అంటే అవి తెలుగులోకి వచ్చినాక వాటి తెలుగు సమార్థకాల్ని నీచార్థంలో వాడడం మొదలుపెడతారు పండితులు. వాళ్ళని చూసి పామరులు కూడా తెలుగుపదాల్ని నీచార్థానికే పరిమితం చేస్తారు. ఉదాహరణకి క్రిందిపదాల్ని గమనించండి.

మట్టి = మృత్తిక

చచ్చిపోయారు = మరణించారు

కంసాలి = విశ్వకర్మ

కంపు = వాసన

బడి = పాఠశాల

ఊరు = పట్టణం

చెట్టు = వృక్షం

ఇలా ఎన్నైనా చెప్పొచ్చు. కనుక ఇలా దిగవేయడం తెలుగు ప్రాధాన్యాన్ని తగ్గించడమే ఔతుంది తప్ప అభివృద్ధి చెయ్యడం అవ్వదు.

3. దిగవేసిన ప్రతి సంస్కృత పదంతోపాటు అనేక సంస్కృత ప్రత్యయాల్ని, ఉపసర్గల్ని కూడా దిగవేయాల్సి వస్తుంది. ప్రత్యయాలూ, ఉపసర్గలూ మన తెలుగువాళ్ళకి తెలిసినవి కావు. వాటి అర్థమూ తెలియదు, వాటిని ఎక్కడ ఎలా అతకాలో కూడా వాళ్ళకి తెలియదు.

సంస్కృత వ్యాకరణంలో శాస్త్రీయమైన శిక్షణ లేకపోడం చేత ఒక పదంలో కనిపించే ప్రత్యయాన్ని లేదా ఉపసర్గని ధైర్యంగా ఇంకో పదానికి అన్వయించుకోలేరు. అన్వయించబోతే అన్నీ తప్పులే వస్తాయి. అందుచేత అలా ఎన్నింటిని దిగవేసినా ఇంకా ఇంకా భారీగా దిగవేయాల్సి వస్తూనే ఉంటుంది. ఆ దరిద్రానికి అంతులేదు. దీని క్కారణం – అవి తెలుగు కాకపోవడం, అవి తెలుగు వ్యాకరణంలో ఇమడకపోవడం. తెలుగు వ్యావహారిక శైలిలో అసలే ఇమడకపోవడం. దీనికి పరిష్కారం – సంస్కృతపదాల బదులు కొన్ని సంస్కృత ప్రత్యయాల్నీ, ఉపసర్గల్ని తెలుగులోకి తెచ్చి వాటిని నేరుగా తెలుగు పదాలకే కలపడం.

ఉదాహరణకి :- ఉప-అద్దె (sub-rent), తెలివిమంతుడు, నిష్పూచీ మొ॥

4. సమాసఘటన చేసేటప్పుడు సంస్కృతపదాల్ని సంస్కృత పదాలతోనే కలపాలనే చాదస్తం మనవాళ్ళలో చాలా చాలా ఎక్కువ. అలా అవసరం లేకపోయినా ఇబ్బడిముబ్బడిగా సంస్కృతపదాలు సమాసాల ద్వారా తెలుగులోకి వచ్చి తిష్ఠవేశాయి. తిష్ఠవెయ్యడమే కాదు, సమాసాల ద్వారా అలవాటైన సంస్కృతపదాలు కొన్ని సందర్భాలలో అసలైన తెలుగు పదాల్నే భాషలోంచి ఏకమొత్తంగా తుడిచిపెట్టాయి. ఉదా :- ఉత్తరం, దక్షిణం.

**మన ముందున్న కార్యావళి** (agenda)

20. తెలుగులో కొత్త పదాల్ని కల్పించడమనే కార్యకలాపం నాలుగు దిశల్లో జఱగాల్సి ఉంది.

(అ) ఇంగ్లీషు పదాలకి సమాధకాల (equivalents) కల్పన / అన్వేషణ

(ఇ) ఇంగ్లీషులో లేనటువంటివి/మన స్థానిక తెలుగుభాషుల (Native Telugu speakers) భావాల వెల్లడింపుకి ఉపయోగపడేవీ అయిన కొత్త పదాల నిష్పాదన (Coinage)

(ఉ) అన్యదేశ్యాల స్థానికీకరణ (Nativization)

(ఋ) కొత్త పరిభావనల (Concepts) గుర్తింపు మఱియు నామకరణం.

ఔత్సాహిక పదనిష్పాదకులు ఈ పై నాలుగో కార్యకలాపం గుఱించి కొంచెం ప్రత్యేకంగా తెలుసుకోవాలి. మనమిప్పటి దాకా చేస్తూ వస్తున్నది ప్రధానంగా, ఆంగ్ల ఆరోపాలకి తెలుగు సమార్థకాల్ని నిష్పాదించడం. ఈ మార్గంలో మన భాష ఇంగ్లీషువారి పరిభావనలకి ప్రతిబింబప్రాయం మాత్రమే కాగలదు. పదాలనేవి పరిభావనల వ్యక్తీకరణలు మాత్రమే. అసలు పరిభావనలంటూ ఉంటే పదాలు పుట్టడం కష్టం కాదు. కనుక ముందు సరికొత్త పరిభావనల్ని ఆవిష్కరించే ప్రయత్నం కూడా జఱగాలి. చూడగల కళ్ళుంటే మనచుట్టూ ఉపయుక్తమైన సరికొత్త పరిభావనలు ఉన్నాయి. వాటిని గుర్తుపట్టాలి. అది భాషాస్వకీయత (originality) కీ, సుసంపన్నతకీ దారితీయగలదు. ఉదాహరణకు –

1. చదువు చెప్పేవాడు = ఉపాధ్యాయుడు
చదువుకునేవాడు = విద్యార్థి
చదువు చెప్పించేవాడు (తండ్రి/ బడి యజమాని) =
2. భవనం కట్టించేవాడు = కాంట్రాక్టరు, బిల్డర్
భవనం కట్టేవాడు = మేస్త్రి
కట్టించుకునేవాడు =
3. వెలుగు × నీడ
ప్రతిఫలితమైన వెలుగు (reflected light) ని ఏమనాలి ?

అలాగే ప్రతిఫలితమైన వెలుగు వల్ల ఏర్పడే నీడని ఏమనాలి ?

4. ఎంజిన్ పనిచేస్తున్నది = బండి/ యంత్రం కదులుతున్నది ఇది యాంత్రిక చలనం.

ఇంకో దృగ్విషయం : ఎంజిన్ పనిచేస్తున్నది కానీ బండి/ యంత్రం కదలడం లేదు. దీన్నేమనాలి ?

5. సోదరి కొడుకు మగవారికి మేనల్లుడు.

మఱి తమ సోదరుని కొడుకు వారికి ఏమవుతాడు ? (మేనకొడుకు అందామా ?)

అలాగే సోదరుని కొడుకు ఆడవారికి మేనల్లుడు. మఱి తమ సోదరి కొడుకు వారికి ఏమవుతాడు ?

6. మన పూర్వీకులు మానవ శరీరంలోని అన్ని భాగాలకీ పేర్లు పెట్టలేదు. కొన్నిటిని వదిలేశారు. వాటికి ఏమని పేర్లు పెడదాం ?

ఏది చెయ్యాలన్నా ముందు మన భాషాస్వరూపం గుఱించి మనకి కొంత అవగాహన ఉండాలి. అది ఏర్పడాలంటే శబ్దార్థ చంద్రిక వంటి కోశాలను అనునిత్యం పరిశీలిస్తూ ఏ పదమైనా మనకి పనికొచ్చే లక్షణాలు కలిగి ఉందా ? అని కాస్త మథనపడాలి. రెండోది– బాలవ్యాకరణాన్నీ, సిద్ధాంతకౌముదినీ కూడా శోధించాలి. ఎందుకంటే ఒక మహాకవి చెప్పినట్లు "గతం నాస్తి కాదు నేస్తం, అది అనుభవాల ఆస్తి." పాతపుస్తకాల బూజుదులిపి దుర్భిణితో గాలిస్తున్నంత మాత్రాన ప్రతి చాదస్తాన్నీ నెత్తిన వేసుకుంటామనుకోరాదు. 'కొత్త పదాలు' అంటే – ఏ విధమైన కొత్త పదాలు ? పదాల్లో రకాలున్నాయి. ఇంగ్లీషువారు వాటికి Parts of speech అని పేరుపెట్టారు. మన భాషకి సంబంధించినంత వఱకు మనం సిద్ధం చెయ్యాల్సినవి :

1. క్రియాధాతువులు (verb-roots)
2. నామవాచకాలు (nouns)
3. విశేషణాలు (Adjectives)

మళ్ళా వీటిల్లో చాలా రకాలున్నాయి. తెలుగుభాష నామవాచకాల్ని క్రియలుగా ఎలా మారుస్తుంది ? క్రియల్ని నామవాచకాలుగా ఎలా మారుస్తుంది ? ఒక నామవాచకంలోంచి ఇంకో నామవాచకాన్ని ఎలా నిష్పాదిస్తుంది ? వీటన్నింటి నుంచి విశేషణాల్ని ఎలా పుట్టిస్తుంది ? మళ్ళీ విశేషణాల్లోంచి నామవాచకాల్నీ, క్రియల్నీ ఎలా రప్పిస్తుంది ?

ఇవన్నీ కూలంకషంగా తెలుసుకుంటే నగం అయోమయంలోంచి బైటపడతాం.

21. తెలుగులో పదనిష్పాదన మఱింత ప్రజాస్వామికం కావాల్సిన ఆవశ్యకత ఉంది. అంటే ఎప్పుడూ ఎవఱో ఒకటిద్దఱు లేదా ముగ్గుఱు, నలుగుఱు సమార్థకాల్ని సూచించడం, వారి వద్ద మాత్రమే సమాధానాలు ఉండడమూ, మిగతావారివద్ద ప్రశ్నలు మాత్రమే ఉండడమూ తరగతిగదిలాంటి ఈ పరిస్థితి శీఘ్రంగా మారడం మిక్కిలి వాంఛనీయం. ఇది నిజానికి ఒక అభ్యసనాప్రక్రియ. ఇది ఒక ఇబ్బందికరమైన ప్రక్రియ. ఎందుకంటే మనం స్వయంగా నేర్చుకునే కంటే ఇతరులకి నేర్పడానికి ఎక్కువ ప్రయత్నిస్తూంటాం. ఈ వైఖరి మన మనో భివృద్ధికి అడ్డుపడుతుంది. అదే సమయంలో భాషాభి వృద్ధికి కూడా !

1. మఱింతగా పాత-కొత్త తెలుగు-ఇంగ్లీషు పుస్తకాల్ని చదవడం అలవాటు చేసుకోవాలి. అంతకన్నా ముఖ్యంగా పూర్తిగా తెలుగులోనే ఆలోచించడం, మాట్లాడడం అలవాటు చేసుకోవాలి. ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో మాట్లా డడం పనికిరాదు.

2. ప్రతిపదానికి తెలుగు సమార్థకం ఏమై ఉంటుందో అని

ఊహించే ప్రయత్నం చేయాలి.

3. తెలుగు పుస్తకాల్లో దర్శనమిచ్చే పదఘటనా వైచిత్రికి క్షణికంగా మురిసిపోయి ఆ తరువాత వాటిని అక్కడికక్కడే మర్చిపోకుండా "అవి ఏ ఆధునిక పద- అవసరాల్ని తీర్చగలవో?" అని ఉత్ప్రేక్షించే ప్రయత్నం చేయాలి.

4. మాండలిక పదాల్ని ఇతోధికంగా అధ్యయనం చేయాలి. అవి కూడా మాండలిక ప్రతిపత్తిని అధిగమించి మఱికొంత ఉన్నతశ్రేణిలో ఏ ఆధునిక పద-అవసరాల్ని తీర్చగలవో అని ఉత్ప్రేక్షించే ప్రయత్నం చేయాలి. కొన్నిసార్లు ప్రామాణిక వాడుకలు చేయజాలని పనిని మాండలిక పదాలు లెస్సగా నెఱవేఱుస్తాయి.

5. పదనిర్మాణ నిమిత్తం తెలుగు-సంస్కృత వ్యాకరణ గ్రంథాల్ని తఱచుగా తిరగేయాలి. వ్యాకరణ పరిజ్ఞానం లేకుండా అర్థవంతమైన, పదునైన పదాల నిష్పాదన సాధ్యం కాదు. ఒక మేస్త్రీ ఎంత గట్టిపనివాడైనప్పటికీ, ఇసుక, ఇటుక, సిమెంటు అనే ఉపచయాలు (inputs) లేకపోతే ఎలాగైతే ఏమీ చెయ్యలేడో, అదే విధంగా పద-ధాతు-ప్రత్యయ పరిజ్ఞానం లోపిస్తే ఇతరత్రా ఎంత మేధావులైనా వారు చేయగలది కూడా శూన్యం. పదనిర్మాణాలకి ఒక తార్కికమైన, హేతుబద్ధమైన సుక్రమం (consistency) అవసరం. దాన్ని వ్యాకరణ పరిజ్ఞానమే సమకూర్చగలదు. మనం మాట్లాడే భాషలోని పదాలూ, వాక్యాలూ, వ్యాకరణమూ ఎంత తార్కికంగా ఉంటే మన జాతి యొక్క మేధాశక్తి కూడా అంత హేతుబద్ధంగానూ, నాగరికంగానూ ఉంటుంది. ప్రజలూ, ప్రజా భాష – వీటికి ఆ పరిజ్ఞానం అవసరం లేదనీ, అజ్ఞానమే సుజ్ఞానమనీ, రాచపుండు రాచబాట అని వాదించే మహామేధావులకు దూరం నుంచే ఒక నమస్కారం పెట్టవలసినది. ఎందు కంటే వైజ్ఞానికంగా అభివృద్ధి చెందిన ఆంగ్లంలో కూడా ప్రామాణిక శాస్త్ర పదజాలమంతటికీ వ్యాకరణం ఉన్నది. అందు చేత వ్యాకరణం లేకుండా ఆంగ్లం లేదు. తెలుగైనా అంతే !

6. హిందీలాంటి ఇతర భాషల్లో ఇంగ్లీషుకి ప్రతిగా వాడుతున్న సంస్కృత సమర్థకాల్ని యథాతథంగా తెలుగులోకి దింపుదల చేయడంలో ఉన్న సాంస్కృతికమైన ఇబ్బందుల్ని సమీచీనంగా గుర్తెఱగాలి. వారూ, మనమూ వాడుతున్నది గీర్వాణమే అయినప్పటికీ వారి వాడుకా, మన వాడుకా అచ్చుమచ్చుగా ఒకటి కాదు గనుక ఆ పదాలు తెలుగువారికి సద్యః స్ఫురణ కావని గుర్తించినప్పుడు వాటిని వర్జించి మనం స్వకీయంగా, సరికొత్తగా పదనిష్పాదన చేయడమే వాంఛనీయం.

(తరువాయి వచ్చే సంచికలో...)

---

**12వ పుట తరువాయి.......**

## ఎరుకల భాష-మాతృభాషలో బోధన

అలాంటప్పుడు ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన జరుగుతున్నప్పుడు అది తప్పకుండా మాతృభాషలోనే అయి ఉండాలి. అమ్మభాషలో ప్రేమ ఉంటుంది. లాలన ఉంటుంది. కఠినమైన విషయం కూడా సులభంగా అర్థమౌతుంది. ఉదా॥కు: ఒక పాప/ బాబు బడికి వెళ్ళడం ప్రారంభం చేసినపుడు అక్కడ కూచోనని, ఉండనని ఏడుస్తారు. కొద్ది రోజులు అమ్మ, నాన్న లేదా దగ్గరి వాళ్ళెవరైనా కొద్దిగా శిశువుకు బడి పరిసరాలు, వ్యక్తులు ఉపాధ్యాయులు అలవాటు పడే వరకు తోడుగా ఉంటారు. తర్వాత క్రమంగా బడి అలవాటైపోతుంది.

అలాగే ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన తెలియని కొత్త భాషలో జరిగే బదులుగా మాతృభాషను మాధ్యమంగా బోధన జరిగితే అమ్మనే శిశువుని దగ్గర కూచోబెట్టుకుని కథ చెప్పినంత ఆనందంగా పాఠం అవగాహనకు వస్తుంది. ఈ విషయాన్ని అటు తల్లిదండ్రులు, ప్రభుత్వాలు, అధికారులు అర్థం చేసుకోవాలి. మాతృభాషలో విద్యాబోధన సాగడానికి కృషి చేయాలి.

**ఎరుకల భాష వంటి గిరిజన తెగల భాషలను మాట్లాడే ప్రాంతాల్లో తప్పకుండా ఆ భాషలో బోధన జరిగేలా చూడాలి. ఆ భాషకు లిపి లేకపోయినా ఆ స్థాయిలోని పుస్తకాలను, ఆయా ప్రాంతాల్లో వాడుకలో ఉన్న ఇతర భాషలో అచ్చువేసినా కూడా, మౌఖికంగా బోధన మాత్రం ఎరుకల భాషలోనే జరగాలి.**

పరీక్షించే విధానం కూడా మౌఖికపరీక్షలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి. శిశువు పాఠ్యాంశాలను చక్కగా నేర్చుకోవడమే కాకుండా, స్పష్టంగా వ్యక్తీకరించే సామర్థ్యాన్ని నేర్చుకుంటాడు. అంతేకాదు. మాతృభాష ద్వారా ఆంగ్లం వంటి ఇతర భాషలను కూడా సులభంగా నేర్చుకుంటాడు. అటు భాషా పరిజ్ఞానం, ఇటు విషయ పరిజ్ఞానం కూడా శిశువుకు చక్కగా అలవడుతుంది అనడంలో ఏ మాత్రం సందేహం లేదు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు:**

ఈ స్థాయిలో బోధనకు నియమించే అధ్యాపకులు కచ్చితంగా ఆ భాషా వ్యవహర్తలై ఉండాలి. ఒకవేళ వారికి సరైన అర్హతలు లేకపోయినా, కనీస స్థాయి అంటే డిగ్రీ వరకు చదువుకున్నా, ఎలాంటి ఉపాధ్యాయ శిక్షణ లేకపోయినా కూడా, వారికి తాత్కాలికంగా కొంత శిక్షణ ఇవ్వడం ద్వారా వారిని అధ్యాపకులుగా నియమించుకోవాలి. ఈ స్థాయిలో బోధనకు మాతృభాషా మాధ్యమం ఎంతో ప్రధానం అనే విషయాన్ని అందరూ గుర్తించాల్సిన అవసరం ఉంది.

ఈ సందర్భంలో ఎరుకల లాంటి ఎన్నో గిరిజన భాషలను వాటి విశిష్టతను, విజ్ఞానాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిదీ. భాషాశాస్త్రవేత్తలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉంది. గిరిజన సమాజాన్ని ఉత్తేజ పరిచి, వారి ప్రాధాన్యతను భాష ప్రాచీనతను గౌరవించాల్సిన బాధ్యత మనందరిదీ.

డా. పి. వారిజారాణి
సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం
డా. వి. ఎం. సుబ్రహ్మణ్య శర్మ
సహాయ ఆచార్యులు (C), భాషా శాస్త్రశాఖ,
ఉస్మానియా విశ్వవిద్యాలయం

**వినియోగించేకొద్దీ భాష వికసిస్తుంది. వాడనిభాష వాడిపోతుంది**

ధారావాహిక

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
98481 23655

# పడమటి గాలితోనివురు తొలగిన తెలుగు భాషా సాహిత్య సంపద 9

**మన** పల్లెలు ఒకనాటి రోజులలో నీటికి, కూటికి కటకటలాడేవి. సరైన బాటలేదు. విద్యవైద్యం సున్నా. ఊరిలో ఎక్కడ బావి తవ్వినా ఉప్పునీరే. అందుకే చెరువు మీద ఆధారపడేవారు. మహా అయితే ఊరికి దూరంగా ఎక్కడో మంచినీరు పడే బావి ఉండేది. బావుల్లో దిగుడు బావి, గిలకల బావి, చేద బావులు ఉండేవి. మంచినీటి బావుల తవ్వకానికి, నిర్మాణానికి ఎవరో దాత ముందుకు వస్తే ఒక చిన్న శిలాఫలకం బావికే అమర్చేవారు. ఏగ్రామానికి సరయిన దారి డొంక లేకపోయినా దేవాలయం మాత్రం ఉండేది. అదీ చాలా ఎత్తుగా, దానికి ఆనుకునే ఒక చెరువు. ఆచెరువునీరే తాగునీటికి ఇతర అవసరాలకు ఉపయోగం. దేవాలయ నిర్మాణం. చెరువు తవ్వకం ఆవూరి జమిందారో, ఆప్రాంతపు రాజో, మోతుబరి రైతులో నిర్మిస్తే వారి పేర ఓ శిలాఫలకం ఉండేది. ఐతే ప్రతిగ్రామానికీ ఓ చరిత్ర దాని వెనుక ఓ గాథ. అన్నీ పరంపరీణంగా చెప్పుకోవడమే తప్ప ఎక్కడా గ్రంథస్థమైన దాఖలాలు లేవు. గ్రామ చరిత్ర, ప్రాంతీయ చరిత్ర లిఖించి భద్రపరచిన నాథుడే లేడు. ఆ పరిస్థితిలో ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా దక్షిణ భారతదేశచరిత్ర, ప్రజల ఆచారాలు, పండుగలు, పంటలు, అలవాట్లు, జాతరలు, తిరునాళ్ళు మొదలయినవన్నీ గ్రంథస్థం చేసి భవితకు భద్రం చేసిన ఘనత కల్నల్ కాలిన్ మెకంజీ (Colonel Colin Mackenzie 1754 - 1821)కే దక్కుతుంది.

**మెకంజీ జీవిత చారిత్రక కథనం:** స్కాట్లాండ్‌కి పడమరగా లూయి ద్వీపంలో స్టోర్నవే గ్రామంలో బార్బరా, మర్డోన్ మెకంజీల రెండో సంతానం కల్నల్ కాలిన్ మెకంజీ. మే 8వ తేదీ 1754లో జన్మించాడు. తండ్రి స్టోర్నవే గ్రామంలో తొలి పోస్ట్ మాస్టర్ గా పనిచేసేవాడు. అదే గ్రామంలో ఉన్న పాఠశాలలోనే మెకంజీ విద్యాభ్యాసం చేశాడు. అక్షరాభ్యాసం చేయించిన తొలిగురువు అలెగ్జాండర్ ఆండర్సన్ ఆవూరికే తొలి ఉపాధ్యాయుడు. బాల్యం నుంచి చదువుల్లో చురుకుగా ఉండేవాడు మెకంజీ. దానికితోడు పరిసరాల విజ్ఞానం, పరిసర ప్రాంతాల విషయ సేకరణ బాల్యంలోనే ప్రారంభించాడు. కేవలం కుతూహలం కొద్దీ తన స్వంత లూయిస్ ద్వీపం నుంచి పరిసర ద్వీపాలకు వెళ్ళి ఆయా చరిత్రలు, ప్రాంతీయ గాథలు సేకరించేవాడు. లూయిస్ ద్వీపానికి ఆరోజుల్లో లార్డ్ ఫ్రాన్సిస్ రాజు. ఆ వంశీకులను నేపియర్ ప్రభువులని పిలిచేవాళ్లు. వీళ్ళకి మూల పురుషుడు జాన్ నేపియర్ (John Napaier-1550) ఈయన భౌతిక శాస్త్రం (Physics), గణిత శాస్త్రం, ఖగోళ శాస్త్రాలలో పండితుడు. నేపియర్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన లాగర్థమ్స్ కనుగొన్న మేధావి. వీరి ఐదవ తరంలోని ఫ్రాన్సిస్ ప్రభువు తమ పూర్వీకుల చరిత్రను గ్రంథస్థం చేయాలని సంకల్పించాడు. దీనికి మెకంజీ సమర్థుడని భావించాడు. అప్పటికే మెకంజీ స్టోర్నవే ప్రాంతానికి కంట్రోలర్ గా నిమితుడయ్యాడు. తన ఉద్యోగంతోపాటు నేపియర్ చరిత్రను వెలికి తీసేపని కూడా చేపట్టాడు మెకంజీ. బాల్యంలో పడిన పునాది భవితను భద్రం చేస్తుందన్నట్లు మెకంజీ జీవిత చక్రం చారిత్రక సత్యాన్వేషణకు దారి దీసింది.


కల్నల్ కాలిన్ మెకంజీ

ఫ్రాన్సిస్ ప్రేరణతో, మెకంజీ గణిత శాస్త్రంపై మక్కువ పెంచుకున్నాడు. ఇదే సమయంలో భారతీయ గణిత శాస్త్రం, హిందువుల సంఖ్యావాచకాల సంబంధం, దశాంకం మొదలయిన గణిత శాస్త్ర విషయాలు పరిశోధించే అవకాశం ఏర్పడింది.

లార్డ్ ఫ్రాన్సిస్ ప్రోత్సాహంతో మెకంజీ భారతదేశం పర్యటించే అవకాశం కలిగింది. దానికో కారణం కూడా ఉంది. ఫ్రాన్సిస్ ప్రభువు కూతురు హెస్తర్(Hesther) భర్త శామ్యూల్ జాన్‌స్టన్ (Samuel Johnston) తమిళనాడులోని మధురలో ప్రభుత్వోద్యోగిగా పనిచేస్తున్నాడు. అందువల్ల మెకంజీ భారతదేశానికి వచ్చే అవకాశం సుగమం అయింది. దీనికి తోడు భారతదేశంలోని సైనిక శాఖలో సైనికోద్యోగి(cadet) గా ఒక ఖాళీ రావడం అది మెకంజీకి ఇవ్వడం చకచకా జరిగాయి. 1783 సెప్టెంబర్ 2న మెకంజీ భారత ఉద్యోగిగా అడుగు పెట్టాడు. అంతే మరణించేవరకూ తిరిగి తన మాతృదేశం చూడనేలేదు.

అప్పటికే ఫ్రాన్సిస్ కుమార్తె అయిన హెస్తర్ మధురలో తన ఇంటిని పండిత కేంద్రంగా రూపొందించింది. గణితశాస్త్రంలో ఉద్దండ పండితులయిన వారికి ఉద్యోగం యిచ్చి గణితశాస్త్రం పై భారతదేశ భాషల్లో ఉన్న గ్రంథాలన్నీ సేకరించింది. అందువల్ల మెకంజీ భారతదేశానికి ఉద్యోగిగా రావడం జాన్‌స్టోన్ దంపతుల ఇంట్లోనే అతిథిగా ఉండే అవకాశం ఏర్పడింది. పైగా భారతీయ పండితులలో చర్చలవల్ల దేశ చరిత్రను, ఆయా ప్రాంతాల చారిత్రక గాథలను తెలుసుకునే అవకాశం కలిగింది. మెకంజీకి పటాలంలో ఉద్యోగం. ప్రవృత్తిరీత్యా జాన్స్టన్ ఇంట్లో పండితులతో పరిచయం. ఆ పై లిఖిత ప్రతులపై చర్చ. ఈ నేపథ్యంలో లిఖిత ప్రతులు, ఆయా దేశీయ చరిత్రలపై ఒక సాధికారిక ప్రాజెక్ట్ నిర్వహించాలనే

కోరిక కలిగింది. ఇది యిలా ఉండగా ఉద్యోగ రిత్యా మెకంజీ పటాలంతో కలిసి వేర్వేరు ప్రాంతాలకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడేది. దీనికి తోడు కుంఫిణీ వారు కొత్తగా స్వాధీనం చేసుకున్న ప్రాంతాలు సర్వే చేసి దానిపై ఒక నివేదిక తయారుచేసే బాధ్యతకూడా మెకంజీ పై పడింది. ఇది మంచి అవకాశంగా భావించి తన సత్తా నిరూపించుకున్నాడు. నెల్లూరు నుంచి ఒంగోలు, పడమటి కనుమలకు మార్గాలు సర్వే చేస్తున్న సమయంలో స్థానికులను కలిసి విషయ సేకరణ ప్రారంభించాడు. అక్కడ చినబళ్ళ ఫకీరు చెప్పిన కంభం కైఫీయతు రాసుకున్నాడు. నెల్లూరు పే మాస్టర్ కచేరిలో ఉండే కాగితాలన్నీ చదివి హైదరు చరిత్రను సమకూర్చుకున్నాడు. గుంటూరు సర్కారును స్వాధీనం చేసుకున్నప్పుడు ఆ ప్రాంతాలన్నీ సర్వే చేసి సమగ్రంగా ఆ చరిత్రలను సేకరించాడు. ఇవన్నీ ఆ తన స్వంత ఖర్చులతోనే కొనసాగించాడు. 1783లో దిండిగల్లు కోయంబత్తూరులలో సైన్య విభాగంలో ఇంజీనీరుగా పనిచేశాడు. ఆ తరువాత నుంచి 1790 వరకూ కంపెనీ వారి స్థానిక సుల్తానుతో జరిగిన యుద్ధాలలోనే నెల్లూరు నుంచి తూర్పు కనుమల ద్వారా రాయలసీమ ప్రాంతాలకు, ఒంగోలుకూ రహదారి మార్గాలద్వారా నమూనాలతో దేశ పటాలాలను తయారు చేశాడు. మెకంజీ శక్తి సామర్థ్యాలను గుర్తించిన అధికారులు 1790లో గుంటూరు సీమను సర్వే చేయడానికి అనుమతి యిచ్చారు. మెకంజీకి ఈ సర్వే ఎంతో ఆనందాన్నిచ్చింది. ఐతే అది ఎంతోకాలం నిలవలేదు. 1792లో శ్రీరంగ పట్టణం కోట ముట్టడి సందర్భంలో టిప్పుసుల్తానుతో జరిగిన యుద్ధంలో ఆనాటి రాజ ప్రతినిధి కారన్ వాలిస్ నేతృత్వంలో పనిచేయవలసి వచ్చింది. ఆ తర్వాత మెకంజీ ఏలూరుకు బదిలీ అయ్యాడు. రాయలసీమ, నెల్లూరు, గుంటూరు సీమలను సర్వే చేసి పట్టణాలు రహదార్లు, నదులు చూపే నైసర్గిక పటాలను తయారు చేశాడు. దీనికి తోడు మైసూరు ప్రాంత పరిధిని నిర్దేశిస్తూ కొలతలు తీయించే పనికూడా చేపట్టాడు. ఈ కాలంలోనే త్రిభుజాలద్వారా సర్వే చేసే విధానం (Triangulation)తోపాటు topographical survey of Mysore నికూడా ప్రారంభించాడని Survey of India vol IX Title Sheetలో స్పష్టంగా ఉంది. మొదటగా దక్కన్ ప్రాంతానికి సర్వే జరగటమే కాకుండా రాయలసీమ, నెల్లూరు, గుంటూరు నైసర్గిక పటాలు కూడా తయారు చేశాడు. పై అధికారులు మెకంజీ చేస్తున్న కృషిని గుర్తించి 1788 మే 16వ తేదిన ఇంజనీరింగ్ శాఖలో ద్వితీయ సహాయ అధికారిగా (Second Lieutenant) పదోన్నతి కలిగించారు. ఆపై 1789కే సేనాని(కల్నల్)గా ఉద్యోగోన్నతి పొందాడు. ఆ తరువాత మద్రాసు, నెల్లూరు, గుంటూరులో పనిచేశాడు. ఈలోగా మైసూరు ముట్టడిలో నందిదుర్గం, సావంత దుర్గం ఆక్రమించడంలోనూ, శ్రీరంగ పట్టణం యుద్ధంలో పాల్గొని తన ప్రావీణ్యం, శక్తియుక్తులన్నీ ప్రయోగించి గెలుపు గుర్రానెక్కాడు. దీనివల్ల పై అధికారుల మెప్పు, ప్రశంశ పొంది పై స్థాయికి ఎదిగే అవకాశం కలిగింది. ఇక్కడో విషయం ప్రస్తావించాలి. ఈ పర్యటనల్లో కూడా తన సేకరణ అయిన స్థానిక చరిత్రలు, ఆయా మార్గాల సర్వేలు, స్థానిక పటాలు తయారు చేయడం మాత్రం ఆపలేదు. కల్నల్ గా నియమితుడయాక మెకంజీ కడప, కర్నూలు జిల్లాల్లో పర్యటించాడు. కృష్ణానది పరిసర ప్రాంతాలు నల్లమల శ్రేణులు సర్వే చేశాడు. ఈకాలంలోనే అమరావతి శిల్పసంపదను గూర్చిన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా ప్రస్తావించాడు. అమరావతి 17వ శతాబ్దాంతంలో మాగల్లు సీమలో రూపెత్తి జ్ఞాతుల రాజ్యాలయిన రాఘవపురం, చింతలపాడు జమీలు కలిసి విస్తరించిన వాసిరెడ్డివారి సంస్థానంలో వెయ్యిగ్రామాలుండేవి. ఆనాటి పేష్కషు (పన్ను ద్వారా వచ్చే ఆదాయం) ఏడు లక్షల పైచిలుకు. 1802లో వాసిరెడ్డి వెంకటాద్రి నాయని పేర మనోవర్తి ఉండేది. పేష్కషు బకాయికింద 1846-49లో కొనుగోలు చేయబడింది. ఆ పై వారికి భరణం కూడా యిచ్చారు.

వీరి మూలపురుషుడు సదాశివయ్య. ఈయన అసాధ్యమైన సాహస కార్యాలు చేసినందువల్ల రెడ్డి రాజుల మొప్పుపొంది వాసిగాంచి వాసిరెడ్డి అనే పౌరుష నామం ఏర్పడిందని ఆచార్య తూమాటి దొణప్ప ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణములో వివరించారు.

వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు తన భవన నిర్మాణానికి దీపాల దిన్నెఅనే దిబ్బను తవ్వించి నావరాళ్ళనూ, బండరాళ్ళను ఉపయోగించాడు. ఆనాటి చెక్కడపురాళ్ళను పరిసరాల ప్రజలు పెరట్లో మెట్టుగాను, సరిహద్దు రాళ్ళుగా, బట్టలుతికే బండలుగా ఉపయోగించారు. ఆనాటి శిల్ప సంపదను గుర్తించిన మెకంజీ 1796లో అమరావతి శిల్ప సంపదను గుర్తించి దుర్వినియోగం కాకుండా భద్రపరిచాడు. అవి ప్రపంచ దేశాలకు తరలి వెళ్లాయి. మనకు అతి కొద్దిగా ఉన్నవి మ్యూజియంలో లభిస్తున్నాయి. ఆపై 1792 నుంచి 1799 వరకూ హైదరాబాదు ఇంజనీర్ల విభాగానికి అధిపతిగా నియమితుడయ్యాడు. ఈ కాలంలోనే నిజాము రాజ్యాల భూగోళ పట రచన ప్రారంభించాడు. ఈ సమయం లోనే ఖనిజాల గురించి, వజ్రాల గురించి వివరాలు సేకరించాడు. విలువైన గనులు ఎక్కడున్నాయో వాటి వివరాలు సమగ్రంగా తెలుసుకున్నాడు. ఎక్కడ ఏ వివరాలు సేకరించినా తనతోపాటు భారతీయ పండితులను స్థానిక పండితుల సహాయం స్వీకరించాడు. భారతదేశ చరిత్రకు కావలసిన సామాగ్రిని, దక్కను పీఠభూమి ప్రాంతాల్లో సేకరించవచ్చనే నిర్ణయానికి వచ్చాడు. ఖమ్మం కర్నూలు ప్రాంతాలు పర్యటించినప్పుడు తాను తయారు చేసుక్కు దినచర్య ఆధారంగా పెన్న కృష్ణ మధ్య ప్రాంతం, సరిహద్దులు, కనుమల సర్వే అని రాసుకున్నాడు. 1799లో శ్రీరంగ పట్టణం ముట్టడి జరిగి, టిప్పుసుల్తాన్ మరణించినతర్వాత మైసూరు రాజ్యం నుంచి లభించిన ప్రాంతాల సర్వేలకు మెకంజీ అధికారికంగా నియమితుడయ్యాడు. 1809 నాటికి మద్రాసు రాజధాని సర్వేయర్ జనరల్‌గా నియమితుడయినప్పుడు దత్తమండల సర్వే నిర్వహించాడు. అనంతరం 1811లో జావా సాహస యాత్రలో చేరాడు. జావా ద్వీపం దండయాత్రలో అనుకోని సంఘటన ఒకటి జరిగింది. మెకంజీ అరవయ్యో సంవత్సరం జావాలో పెట్రోనెల్లాజోకి మీనా బారెల్స్ అనే డచ్ వనితను పెళ్ళి చేసుకున్నాడు. ఈమె సింహళ

ద్వీపంలోని ట్రింకోమలిలో పుట్టింది. జావా దండయాత్ర అనంతరం భార్యతో భారత దేశానికి వచ్చాడు. 1815 నాటికి భారత దేశానికి సర్వేయర్ జనరల్ గా పదోన్నతి పొందాడు. అనంతరం 1817నాటికి కలకత్తా చేరాడు. చివరికి 1821 మే 8న కలకత్తాలోనే 68వయేట తుది శ్వాస విడిచాడు. సౌత్ పార్క్ సిమెట్రీలో ఆయన సమాధి నేటికీ ఉంది. 1783 సెప్టెంబర్ 23న భారతదేశంలో అడుగు పెట్టిన తర్వాత తిరిగి తన మాతృదేశం వెళ్ళలేదు. జీవితమంతా భారత దేశానికే త్యాగం చేసిన మహాఘనుడు మెకంజీ. మెకంజీ సేకరించిన సంకలనాలు మెకంజీ సేకరించిన గ్రంధాలు, స్థానిక చరిత్రలు, శాసనాలు, నాణాలు, శిల్పాలు మొదలయిన అపురూప సంపదను సేకరించి భద్రపరిచాడు. ఆయన సేకరించిన వాటిల్లో 14 భాషల్లో 16 లిపులలో ఉన్న 1568 గ్రంథాలు, 264 సంపుటాల్లో ఎక్కించిన 2070 స్థానిక చరిత్రలు, 77 సంపుటాల్లో సంకలనం చేసిన 8076 శాసనాలు, 6218 ప్రాచీన నాణాలు, 2630 శిల్పాలు, కొన్ని చిత్రాలు, 106 విగ్రహాలు, 79 పురాతన భవన రూపాలు 40 పురాతన శిధిలావశేషాలు మొదలయిన వాటిని భద్రపరిచాడు. మెకంజీ రాసిన అతికొద్ది వ్యాసాలు మాత్రమే లభిస్తున్నాయి. వీటిల్లో శ్రీశైలంలోని ఆలయ విశేషాలు, అమరావతి స్తూప వివరాలు, దక్షిణ భారతదేశంలోని జైన, బౌద్ధ స్థానాలు, ఆనెగొంది రాజుల చరిత్ర చెప్పుకోదగిన వాటిల్లో ఉన్నాయి.

మెకంజీ జీవించివున్న కాలంలోనే తన స్వగ్రామమైన స్టోర్నవే గ్రామంలో తన ఇల్లు పునర్నిర్మించడం కోసం కొంత డబ్బు పంపాడు. మెకంజీ చెల్లి మేరీ అన్నయ్య మరణానంతరం ఆయన విల్లు ద్వారా వచ్చిన డబ్బుతో 'ఐ' అనే ప్రదేశం దగ్గరే ఉన్న సెయింట్ కొలంబా చర్చ్ సమీపంలో ఒకస్మారక భవనం కట్టించింది. అక్కడ కొన్ని అపురూపమైన శిల్పాలు, శాసనాలు స్థానిక చరిత్రలు భద్రం చేసింది. ఈ వివరాలన్నీ ఆరుద్ర స్వయంగా 1983లో చూసి వచ్చి ఛాయ చిత్రాలు సమగ్రాంధ్ర సాహిత్యంలో ప్రచురించాడు.

మెకంజీ సంకలనాలు, సేకరణ, గ్రామ చరిత్రల తయారీ మొదలయిన వివరాలు సేకరించిన తెలుగు పండితులు కావలి వెంకట బొర్రయ్య, కావలి లక్ష్మయ్య వివరాలు తరువాత సంచికలో.

---

**17వ పుట తరువాయి.......** ఆంగ్ల విద్య

ఏ దృష్టితో చూసినా, ఏవైపు నుంచి చూసినా మన భావాలకు, భాషకు మన జీవితానికి మధ్య పరస్పర సమానత లేదన్న విషయం వాస్తవం. యీ మూడింటిని సంఘటితం చేయటానికి మనం నోచుకో లేదు. వెనకటికి ఒక కథలో ఒక బికారి వుండేవాడు. వాడు చలి కాలంలో బిచ్చమెత్తి వస్త్రాలు కొనుక్కోగలిగే సమయానికి ఎండాకాలం వచ్చేసేదట. అలాగే ఎండాకాలంలో పలచని వస్త్రాలు కొనుక్కునే తాహతు వచ్చేసరికి చలికాలం వచ్చేసేది. ఏదో దేవత వాడి దీనావస్థకు దయతలచి వరమివ్వబోతే అతడు ఈ విధంగా అడిగాడు: "నాకు మరేమీ అక్కర్లేదు. యీ తారుమారు అంతం చెయ్యి. ఎండల్లో చలి దుస్తులు, చలికాలంలో వేసవి దుస్తులు తొడుక్కుంటున్నాను. యీ గందరగోళం నుంచి తప్పించావంటే ధన్యుడిని."

నేను కూడా భగవంతుడిని యిదే ప్రార్థిస్తున్నాను. భాషకు, భావానికి మధ్య యీ విభేదం తొలగిపోతే మనం ధన్యులమవుతాం. మనకు చలిలో వేడిని కలిగించే దుస్తులు, వేసవిలో చల్లని దుస్తులు లభించటం లేదు. యిదే మన దరిద్రానికంతటికీ మూలకారణం. అందువల్లనే మనం నిరాదరణ అనే గోతిలో పడి కొట్టుకుంటున్నాం. లేకపోతే మనకు ఏవస్తువుకు లోటుంది? **'ఆకలితోపాటు అన్నం, చలితోపాటు వస్త్రం, భాషతోపాటు భావం, విద్యతో పాటు జీవితం ఒకేచోట కలగచేయమని, ఒక దానితో ఒకటి కలపమని' భగవంతుడిని వరమడుగుతున్నాను.**

**నీటిలో వుండీ చేపకు దాహం తీరలేదు అన్నట్టు ఉంది మన పరిస్థితి. యిది విని ఎవ్వరికీ నవ్వు రాకుండా ఉండదు. మనవద్ద నీరు వుంది కానీ మనం దాహంతో కొట్టుకుంటున్నాం, యిది చూసి లోకం నవ్వుతోంది కానీ మన కళ్ళనుండి కన్నీళ్ళు కారుతున్నాయి. నీటి దగ్గర వుండీ నీటికి నోచుకోలేదు, అవి తాగి మన దాహం తీర్చుకోలేకపోతున్నాం.**

---

'మంచి పుస్తకం' సంస్థ ప్రచురించిన 'విద్య' అనే పుస్తకంలో గల నాలుగు వ్యాసాలలో ఇది ఒకటి. నాలుగూ రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలే. విద్యకు సంబంధించి రవీంద్రనాథ్ ఠాగూర్ వెల్లడించిన అభిప్రాయాలు ఎంతో పాతవైనా, అప్పటికంటె ఇప్పుడవి మనకు మార్గదర్శకాలుగానే ఉన్నాయి. 'ఇంగ్లీషులో భాషాబోధన ఉండాలా వద్దా అనే జటిలమైన ముడి' విప్పటానికి రవీంద్రనాథ్ టాగూర్ ఆలోచనలు ఒకింత తోడ్పడగలవన్న నమ్మకంతో దీన్ని ప్రచురించినట్లు ప్రచురణకర్త పేర్కొన్నారు. ఈ వ్యాసాన్ని 'అమ్మనుడి'లో ప్రచురణకు అనుమతించినందుకు వారికి ధన్యవాదాలు –సం.





## త్వరలో పుస్తకంగా వెలువడుతుంది

14 నెలల పాటు **'అమ్మనుడి'** పత్రికలో ధారావాహికగా మీరు చదివిన నవల త్వరలో పుస్తకంగా వెలువడనుంది. కావలసినవారు **'అమ్మనుడి'** పత్రికను సంప్రదించండి. ఫోన్లు : 98480 16136, 94929 80244

–డాక్టర్ షేక్ మహబూబ్ బాషా
9610579705

# మహిళాచైతన్య కెరటం దరిశిఅన్నపూర్ణమ్మ



ఇరవయ్య వశతాబ్ది ప్రథమార్థంలో సంఘసంస్కరణోద్యమం ముమ్మరంగా నడిచింది. పురుష సంఘసంస్కర్తలతో పాటు అనేకమంది మహిళాసంఘసంస్కర్తలు సంస్కర ణోద్యమంలో పాలు పంచుకొని ఉద్యమా న్నిముందుకు నడిపిం చారు. ఒకవైపు ఉద్యమంలో క్రియాశీలకంగా పాలు పంచుకుంటూనే ఇంకోవైపు సంస్కరణోద్యమ సాహిత్యాన్ని సృష్టించారు. అలాంటి మహిళా సంఘసంస్కర్తల్లో ప్రముఖురాలు దరిశి అన్నపూర్ణమ్మ (1907–1931). సంఘసంస్కర ణోద్యమంలోనూ, మహిళోద్యమంలోనూ అన్నపూర్ణమ్మ పోషించిన పాత్రను, ఆమె రచనల్నీ పాఠకులకు పరిచయం చెయ్యడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

గదర్‌పార్టీ సంస్థాపకుల్లో ప్రముఖుడైన దరిశి చెంచయ్య మొదటి భార్య అయిన అన్నపూర్ణమ్మ 1907వ సంవత్సరంలో బళ్ళారిలో జన్మించింది. ఆమెతల్లి సంస్కరణ దృక్పథం కలది. తన రెండవ కుమార్తెను రజస్వల అయ్యేంతవరకు ఆపి, మదనపల్లె కళాశాలలో చదివించింది. అన్నపూర్ణమ్మను సంస్కరణభావాలుకల చెంచయ్యకిచ్చి వివాహం చేసింది. "వైశ్యకులములో రజస్వలానంతర వివాహమును ప్రారంభించింది అన్నపూర్ణమ్మగారి తల్లియేననుట సత్యదూరమని పించుకొనజాలదు" అని 1.1.1932నాటి "గృహలక్ష్మి" (స్త్రీల పత్రిక) ప్రశంసించింది. అన్నపూర్ణమ్మ బళ్ళారి కాన్వెంటులోను, తిరువళిక్కేణి బాలికల ట్రైనింగ్ కాలేజీలోనూ, గుంటూరులోని శారదా నికేతనంలోనూ విద్యాభ్యాసం చేసింది. 15 సంవత్సరాల వయస్సులో దరిశి చెంచయ్యను వివాహమాడింది. బాల్యవివాహాలు విస్తృతంగా ప్రాచుర్యంలో ఉండిన నాటి పరిస్థితులదృష్ట్యా అన్నపూర్ణమ్మ ఆలస్యంగానే పెళ్ళి చేసుకొందని చెప్పుకోవాలి.

అన్నపూర్ణమ్మ మొదటినుండీ సంస్కరణభావాలు కలదైనప్పటికీ,పెళ్ళి తర్వాత వాటికి మరింత సానబెట్టి తనవంతు ప్రోత్సాహమందించారు చెంచయ్య. అన్నపూర్ణమ్మ 1920లో జరిగిన వితంతు పునర్వివాహోద్యమం దరిశి చెంచయ్య నడిపిందే. భర్తతో కలిసి అన్నపూర్ణమ్మ వైశ్య, బ్రాహ్మణ, కమ్మ, విశ్వబ్రాహ్మణ మొదలైన కులాల్లో మొత్తం 18 వితంతు పునర్వివాహాల్ని జరిపించింది. 19వ శతాబ్దంలో ఏ విధంగా కందుకూరి వీరేశలింగం–రాజ్యలక్ష్మమ్మలు వితంతు పునర్వివాహోద్యమానికి వెన్నెముకగా నిలిచారో అదేవిధంగా 1920ల్లో దరిశి చెంచయ్య–అన్నపూర్ణమ్మలు వెన్నెముకగా ఉండినారు. "మా ఇంట్లో (వితంతువులైన) వధువులెందరో వుంటూండేవారు. నాభార్య అన్నపూర్ణమ్మ వారినెంతో ప్రేమగా చూచుకొనేది. ఇలాంటి సంఘసేవ చేయాలనే ఆశతోనే ఆమె నన్ను వివాహం చేసుకొన్నది. సంఘసంస్కరణోద్యమాలంటే ఆమెకెంతో సంతోషం. వధువులతో ఆమె చాలా చనువుగా వుండేది. వారు వరుసలతో పిలుచుకొనేవారు.... భార్యల సహాయం లేనిదే స్త్రీల ఉద్యమాలను పురుషులమెంత శ్రమపడినా జయప్రదం చెయ్యలేము. నా ప్రథమ భార్య అన్నపూర్ణమ్మకు స్త్రీ ఉద్యమాలయందు ఎంతో ఉత్సాహముండేది. ఎందరో స్త్రీలు మా యింట్లో ఉండేవారు. వారందరిని ప్రేమతో ఆదరించేది అన్నపూర్ణ. వారు అన్నపూర్ణమ్మను ఎంతో ప్రేమించేవారు. జయాపజయాలు, ఫలితాలు మా యిద్దరివీని." ("నేనూ నాదేశం,"పు.231–233). ఒకరకంగా అన్నపూర్ణమ్మ వితంతు పునర్వివాహోద్యమానికి తన జీవితాన్ని బలిపెట్టిందని చెప్పవచ్చు. 1931 నవంబరులో బందరులో ఒక వితంతు పునర్వివాహాన్ని నిర్వహించి వచ్చిన తర్వాత తీవ్రంగా అనారోగ్యానికి గురై నవంబరు 28న పాతిక సంవత్సరాల పిన్న వయస్సులోనే అన్నపూర్ణమ్మ చనిపోయింది.

అన్నపూర్ణమ్మ అభిప్రాయంలో వితంతువులకు పునర్వివాహం మాత్రమే పరిష్కారం కాదు; విద్యకూడా చాలా అవసరం. అందుకే 12 మంది వితంతువులను విద్యార్జన దిశగా ప్రోత్సహించింది. వారికోసం ఉపకారవేతనాల్ని యేర్పాటు చేసింది. ఈ విధంగా వితంతువుల విద్యాభివృద్ధికి తోడ్పడింది. ఆమె ప్రోత్సాహాన్నందుకున్న అనేకమంది వితంతువులు విద్యావంతులై జీవితాల్లో స్థిరపడ్డారు. 1927–1928 ప్రాంతంలో ఒకరోజు తన స్నేహితురాలు తుర్లపాటి రాజేశ్వరమ్మతో కలిసి విజయవాడలో రైవస్ కాలువగట్టున షికారుకెళ్ళింది అన్నపూర్ణమ్మ. ఎవరో వితంతువు శిశువును కని గొంతునులిమి పారవేయగా కాకులు పొడుచుకు తింటూండటం చూచిన యిద్దరూ ఏడుస్తూ యింటికొచ్చారు. ఈ విషయమై ఏదైనా చేయాలని దరిశి చెంచయ్యతో కలిసి ఆలోచించి " వితంతు శరణాలయాన్ని" స్థాపించారు. ఇందులో అన్నపూర్ణమ్మ కార్యనిర్వాహక సంఘ సభ్యురాలుగా పనిచేసింది. "ఆంధ్రపత్రిక" ఈ శరణాలయం గూర్చి బాగా ప్రచారం చేయడంతో అనేకమంది గర్భిణులైన వితంతువులు అక్కడికి రావడం మొదలుపెట్టారు; బిడ్డల్ని కని అక్కడ వదిలి వెళ్ళేవారు. అలా సుమారు 60 మందికి ఆ శరణాలయం

ఉపయోగపడింది. విజయవాదలోని మహిళా డాక్టర్లు, ముఖ్యంగా గుడిపాటి వెంకటాచలం వదిన అయిన డాక్టర్ రంగనాయకమ్మ ఈ శరణాలయానికి ఎంతగానో సహాయపడింది. బిడ్డలు లేని దంపతులు యిక్కడి పిల్లల్ని తీసుకొనిపోయేవారు. ("నేనూ – నాదేశం", పు.234-235)

అన్నపూర్ణమ్మ ఆంధ్ర సార్వజనిక క్షేత్రంలో పనిచేయడం ప్రారంభించేనాటికి, వలసాంధ్రలో మహిళోద్యమం బలంగా వూళ్ళునుకొని ఉంది. ఆంధ్రలోని పలు పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ మహిళా సంఘాలు యేర్పడి మహిళాభివృద్ధికి పాటుపడనారంభించాయి. యావదాంధ్ర స్త్రీల విశాల వేదికగా ''ఆంధ్ర మహిళా మహా సభ'' 1910లో ఉనికిలోకి వచ్చి ప్రతిసంవత్సరం ఆంధ్రలోని వివిధ ప్రాంతాల్లో మహిళా సమావేశాలను యేర్పాటు చేసేది.'' 'ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్' ఆంధ్రరాష్ట్రశాఖగా "ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభ" 1927లో యేర్పాటు చేయబడి, ప్రతిసంవత్సరం క్రమం తప్పకుండా మహిళా సమావేశాలను నిర్వహించేది. ఈ నేపథ్యంలో 1928లో కొమఋాజు అచ్చమాంబ విజయవాడలో ''భారత మహిళా మండలి'' ని స్థాపించింది. దీనికి తుర్లపాటి రాజేశ్వరమ్మ అధ్యక్షురాలు కాగా దరిశి అన్నపూర్ణమ్మ కార్యదర్శిగా వ్యవహరించింది. అంతేకాకుండా 'ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్', బెజవాడ శాఖకు కూడా అనేక సంవత్సరాలు అన్నపూర్ణమ్మ కార్యదర్శిగా పనిచేసింది. 1929లో బొంబాయిలో జరిగిన నాలుగవ " అఖిల భారత మహిళా సభ'కు ప్రతినిధిగా వెళ్ళిన ముగ్గురు ఆంధ్రస్త్రీలలో అన్నపూర్ణమ్మ కూడా ఉంది. ఈ విధంగా అన్నపూర్ణమ్మ సమకాలీన మహిళోద్యమంలో చురుకుగా పాల్గొని మహిళాభివృద్ధికి ఇతోధికంగా తోడ్పడింది.

అన్నపూర్ణమ్మ క్షేత్రస్థాయిలో పనిచేసిన కార్యకర్తేకాకుండా సంస్కరణోద్యమ సాహిత్యాన్ని సృష్టించిన మేధావికూడా. ఆమె కొన్ని కథల్నీ, వ్యాసాల్నీ రచించిన సృజనశీలి. ఆమె రచనలు సంస్కరణ పక్షంవహించిన వైశ్యుల పత్రిక అయిన "వాసవి"లో ఎక్కువగా ప్రచురితమయ్యాయి. స్త్రీల పత్రిక అయిన "గృహలక్ష్మి"లో కూడా కొన్ని రచనలు ప్రచురించబడ్డాయి. "హైందవస్త్రీల హక్కులు - కర్తవ్యము " అనే వ్యాసంలో స్త్రీల హక్కులు - బాధ్యతలకు సంబంధించిన అనేక విషయాలను చర్చించింది అన్నపూర్ణమ్మ. స్త్రీ-పురుషుల మధ్య లింగబేధం తప్పిస్తే మరే విధమైన తేడాలేదని నొక్కివక్కాణించిన అన్నపూర్ణమ్మ స్త్రీలు "అబలలు" అనే పితృస్వామ్య భావజాలాన్ని బద్దలు కొట్టింది. **అవకాశాలు లేకపోవడం వల్లనే స్త్రీలు అబలలుగా మిగిలిపోతున్నారనీ, పురుషులు అవకాశాలు కల్పించినపుడు స్త్రీలు అన్ని రంగాల్లోనూ తమ శక్తిసామర్థ్యాలను కనబర్చారనీ, కనబర్చగలరనీ విశదం చేసింది.** రాచకార్యధురంధరులైన స్త్రీలనూ, బలశాలులైన స్త్రీలనూ, పండితస్త్రీలనూ, కవయిత్రులనూ ఉదాహరణలుగా చూపెట్టింది. "ఈ విధముగ అన్ని విషయములందును పురుషులతో సమానముగ స్త్రీలు కీర్తి గడించిరి" అని స్పష్టం చేసింది. పురుషులు కూడా శక్తిహీనులుగా ఉన్నారనీ అందుకే వారు విదేశీయుల పాలనలో మగ్గుతున్నారనీ తెలియజేసిన అన్నపూర్ణమ్మ "స్త్రీలు రాజ్య పాలనము చేసే యెడల ఇంతకంటె కనిష్టముగా చేయగలరా?'' అని ప్రశ్నించింది.

"ప్రస్తుత హిందూ స్త్రీల కష్టా"ల్లో బాల్యవివాహాలు, అవిద్య ప్రధానమైనవిగా చెప్పిన అన్నపూర్ణమ్మ బాల్యవివాహాలు స్త్రీవిద్యకు ఏవిధంగా ఆటంకంగా ఉంటున్నాయో చెప్పింది. అందుకే "వివాహమునకు పూర్వమే ప్రతిస్త్రీ పురుషుడు సంపూర్ణవిద్యావంతులై యుండవలెను" అనీ, విద్య అంటే "కేవలము అక్షరజ్ఞానము" కలిగి ఉండడం కాదనీ, "ప్రతి స్త్రీయును సుమారు పది పండ్రెండు సంవత్సరములైనను గురుకులవాసము చేసి విద్యనభ్యసించవలెను" అని నిజమైన విద్య అంటే ఏమిటో స్పష్టపరిచింది. వివాహం విషయంలో తల్లిదండ్రుల జోక్యం పోయి ఎంపిక విషయంలో వధూవరులకు ఎక్కువ స్వాతంత్ర్యం ఉండాలని కోరుకొంది. పాశ్చాత్య స్త్రీలవలె భారత స్త్రీలకు ఆజన్మాంతం బ్రహ్మచారిణిలుగా వుండే అవకాశం లేదనీ, వివాహం చేసుకోవడం ఇష్టంలేని స్త్రీలకు బ్రహ్మచారిణిలుగా వుండే అవకాశం ఉండాలనీ చెప్పింది. అలాంటి స్త్రీలు పాశ్చాత్య దేశాల స్త్రీల మాదిరి తమ జీవితాల్ని సంఘసేవలో గడపగలిగే పరిస్థితులుండాలని వాంఛించింది.

శారదా శాసనం (బాల్యవివాహ నిరోధక చట్టం) పట్ల సంతృప్తి వెలిబుచ్చిన అన్నపూర్ణమ్మ శాసనాన్ని జయప్రదం చేయడానికి 'శారదా సంఘా"ల్ని స్థాపించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది. హైదరాబాద్ మొదలైన స్వదేశీ సంస్థాల్లో శారదా చట్టంలాంటి చట్టాన్ని చేయాల్సిన అవసరాన్ని తెలియజేసింది. శారదా శాసనం కనీస వివాహ వయస్సు స్త్రీలకు14గాను, పురుషులకు 18గానూ యేర్పాటు చేసింది. అన్నపూర్ణమ్మ వివాహ వయస్సును పెంచాలని భావించి కనీస వివాహవయస్సు స్త్రీలకు 16గానూ పురుషులకు 21 గానూ వుండే విధంగా శారదా శాసనంలో సవరణ చేయాలని కోరుకుంది. స్త్రీలకుగానీ, పురుషులకు గానీ, ''నిర్బంధ వివాహములు'' ఉండకూడదంది. బహుభార్యత్వాన్ని నిరసించింది. చిన్న బాలికల్ని ముసలివాళ్ళకిచ్చి పెళ్ళి చేసే పద్ధతిని అసహ్యించుకొని అలాంటి ''అనమ వివాహములను జరిపించిన తలిదండ్రులు శిక్షాపాత్రులగుటకు రాజశాసనముండవలెను" అంది. వితంతు సమస్యలపై స్పందిస్తూ ''చిన్న బాలికలను సైతము భర్త చనిపోయినపుడు వితంతువులని పిలుచుట, నిర్బంధ బ్రహ్మచారిణులుగా యుంచుట ధర్మమా?" అని ప్రశ్నించింది. నిర్బంధ బ్రహ్మచర్యాన్ని "అన్యాయము" అని ఈసడించింది. "ఇటువంటి అన్యాయము ఏ జాతియందుగాని, ఏ దేశమందుగానీ, చివరకు పశుపక్ష్యాదులయందుగాని లేదు" అని తెలియజేస్తూ వితంతువులకు పునర్వివాహాలు చేయాల్సిన ఆవశ్యకతను తెలియబరిచింది.

స్త్రీలకు ఆస్తి హక్కు ఉండాలని బలంగా వాదించిన అన్నపూర్ణమ్మ తనకాలంలో స్త్రీలకు సదరు హక్కు లేకపోవడాన్ని గూర్చి వాపోతూ ఈ విధంగా అంది. **"తల్లిగారి స్వగృహమందు పుత్రులతో సమానముగా పుత్రికలకు ఆస్తి పంచి యివ్వరు.**

**అత్తవారింటియందైనను భర్తయాస్తిపై భార్యకు హక్కులేదు. 'రెంటికి చెడిన రేవడి' మాదిరి ఏవైపు జూచినను స్త్రీలు నిరాధారులైయున్నారు.** పుత్ర సంతతిలేక భర్త చనిపోయెనేని ఆస్తి వారసులకు చెల్లును. స్వయముగ కనిపెంచిన కుమార్తెలకు హక్కులేదు. వేరే మరియొక బాలుని దత్తత గైకొనిన యెడల ఆస్తి యంతయు వాని పరము చేయుటకు వీలున్నది. క్రైస్తవులలో ఐరోపీయులకు భర్త చనిపోయిన తరువాత ఆస్తి భార్యకు చెల్లును. తదనంతరము ఆస్తి కుమారులకు కూతుళ్లకు సమానముగా పంచి యివ్వబడును. బౌద్ధమతమునందుకూడా యటులే జరుగుచున్నది. హిందూ సంఘమునందు మాత్రమే స్త్రీకి ఆస్తిపై హక్కులేదు. పై హక్కులేని లోపము వలన స్త్రీ బానిసకంటె అధమము. బానిసలా పెంచబడి, బానిసను వివాహము చేసెకొని, బానిసకు బిడ్డలై జనించినపుడు, పురుషులు బానిసలు గాకుండుటకు సాధ్యమా? వర్ణ వివక్షత లేక స్త్రీ పురుషులు హక్కులలో లోపములేక యుండినటువంటి బౌద్ధమతమునుగాని, వేదమతమునుగానీ అవలంబించియున్నప్పుడు మన దేశము పరాధీనము కాలేదు." ("మరపురాని అన్నపూర్ణ", పద్మాముద్రాక్షరశాల, మద్రాసు,పు 162–63) ఆస్తిహక్కు లేకపోవడం వల్ల స్త్రీలు వివక్షకు గురౌతున్నారని చెబుతూ "తల్లిదండ్రులు కొమారులతోబాటు కొమార్తెలను గౌరవముగ చూచుటలేదు. తగినంత ద్రవ్యమును వెచ్చించి విద్య నేర్పించరు. కొమార్తెలకు పెట్టిన ఖర్చంతయూ వృధాయని భావించెదరు....ఇన్నిటికిని కారణము స్త్రీలకు ఆస్తిహక్కు లేకపోవుటయే" అని విశ్లేషించింది. **"ఆస్తి విషయమందు స్త్రీలకు హక్కు గలిగిన నాడే సర్వహక్కులు వచ్చినట్లు భావించవచ్చును"** అని ఘంటాపథంగా చెప్పింది. దత్తత విషయంలోనూ, సంరక్షకత్వం విషయంలోనూ స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులుండాలని బలంగా కోరుకుంది అన్నపూర్ణమ్మ.

1920ల చివరినుండీ ఆంధ్రస్త్రీలు విడాకుల సమస్యపై చర్చించడం మొదలుపెట్టారు. 1928లో హరిసింగ్ గౌర్ కేంద్ర శాసనసభలో HINDU MARRIAGE DISSOLUTION BILLని ప్రవేశపెట్టాడు. మొదటినుండీ విడాకుల చట్టానికున్న తీవ్ర విరోధుల కారణంగా గౌర్ తన బిల్లును వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. 1931–33 మధ్య పలుమార్లు మళ్ళీ ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ వ్యతిరేకత కారణంగా చట్టరూపం దాల్చలేకపోయింది. తర్వాత జి.వి.దేశ్‌ముఖ్ విడాకుల బిల్లును ప్రవేశపెట్టాడు. అప్పటికీ, అంటే 1932లోనే స్వదేశీ సంస్థానమైన బరోడాలో విడాకులను చట్టబద్ధం చేసి ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రస్త్రీలలో కొంతమంది విడాకుల చట్టాన్ని స్వాగతిస్తుండగా అనేకమంది తీవ్రంగా వ్యతిరేకించేవారు. కడప రామసుబ్బమ్మ లాంటి మహిళా మేధావులు విడాకుల చట్టాన్ని ''దారుణాస్త్ర'' మనీ, దాన్ని ఆహ్వానించడం ''కొరివితో తలగోకుకోవడమే'' నని వాదించేవారు. 18 నవంబరు 1934లో మదనపల్లెలో గుమ్మడిదల దుర్గాబాయమ్మ అధ్యక్షతన జరిగిన ఎనిమిదవ "ఆంధ్రరాష్ట్ర మహిళాసభ"లో విడాకుల చట్టానికి సంబంధించిన తీర్మానం చర్చకు రాగా, కడప రామసుబ్బమ్మ దాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. మెజారిటీ సభ్యులు ఆమెను బలపరచారు. దాంతో ఆ తీర్మానం వీగిపోయింది. దీంతో ఆంధ్రలో విడాకుల చట్టానికున్న వ్యతిరేకత మనకు స్పష్టమవుతుంది.

ఇలాంటి చారిత్రక సందర్భంలో దరిశి అన్నపూర్ణమ్మ విడాకుల చట్టాన్ని మనసారా స్వాగతించింది. "స్త్రీలు స్వలాభమును గోరి (విడాకుల) చట్టము కొరకు పోరాడుచున్నారనుట కేవలము సంకుచితాభిప్రాయము" అని నిశ్చయముగా తెలిపింది. "భార్యను జూడగనే మండిపడు పురుషుడును, భర్తను జూచి మూతి విరుచు భార్యయును, హృదయములు కోసినను మచ్చుకైన అనురాగము కాన్పించక, నామక: భార్యాభర్తలని వ్యవహరింపబడుచు యమలోకమనుభవించుటకంటే విడాకులిచ్చి ఎవరికి వారు స్వతంత్రులగుట ఉత్తమము కాదా? భార్య వ్యభిచరించుట తెలిసియు భార్యగా పరిగ్రహించుటయు, భర్త వ్యభిచారియైనను భర్తగ నెంచుటకంటెను విడిపోవుట సుఖముగాదా? న్యాయము గాదా?" అని సూటిగా ప్రశ్నించింది. విడాకులనేవి పాశ్చాత్యులనుండి నేర్చుకొన్న పద్ధతి కాదనీ, పూర్వం నుండీ భారతదేశంలో ఉన్న పద్ధతేననీ "ఏ కారణముల వలననో" ఈ పద్ధతి కొన్ని కులాల్లో ఉండిపోయి కొన్ని కులాల్లో లేకుండా పోయిందనీ వివరించింది. విడాకుల చట్టం వచ్చినంత మాత్రాన ప్రతీ స్త్రీ విడాకులిస్తుందని భావించడం "హాస్యాస్పద"మని తెలియజేస్తూ విడాకులకు అవకాశం వున్న క్రైస్తవ, మహమ్మదీయ, బ్రహ్మసామాజికుల్లో "వెయ్యింటికొకరు మాత్రమే విడాకులిచ్చుకొనుట సంభవించుచున్నది" అని వాస్తవ పరిస్థితిని తెలియజేసింది. నిజమైన అనురాగము గల భార్యాభర్తలు విడాకులు తీసుకోరనీ "స్త్రీలకు ఉరిత్రాడు అయినటువంటిన్ని, పురుషులకు మానహీనమైనటువంటిన్ని, అనారోగ్యకరమైనటువంటిన్ని, జారత్వము, బహుభార్యత్వమును మాన్పుట, క్రూరులగు భర్తలిడు బాధలను సహింపజాలక వందలమంది స్త్రీలు నుయ్యిల గొయ్యిల పాలగుచుండుట నడ్డుపెట్టుటకే" విడాకుల చట్టం కావలసి వచ్చిందని విశ్లేషించింది. "పురుషులకు బానిసలుగ నుండుటకు బ్రహ్మ వారిని (స్త్రీలను) విధించినట్లును, స్త్రీలను అణగదొక్కి హింసించుటయే మగవారి కర్తవ్యమైనట్టును పురుషులు భావించుచు"న్నారనీ, పురుషుల హింసనుంచి స్త్రీలను రక్షించడానికి విడాకుల చట్టం అత్యవసరమని ఘంటాపథంగా చెప్పింది.

కేవలం ఆంధ్ర, సంస్కృత భాషల్లో పాండిత్యం కలిగిన పండితులు, పీఠాధిపతులు, పురోహితులు మొదలైనవారు సంఘసంస్కరణోద్యమానికి అడ్డుతగులుతున్నారనీ, "పూర్వాచారపరాయణులు" రజస్వలానంతర వివాహాల్ని, వితంతు వివాహాల్ని,అస్పృశ్యతా నిర్మూలనా కార్యక్రమాల్నీ, విదేశీయాత్రల్నీ, అంతర్వర్ణ భోజనాల్నీ, అంతర్వర్ణ వివాహాల్నీ వ్యతిరేకిస్తూ సామాజిక మార్పును అడ్డుకొంటున్నారని విమర్శించింది అన్నపూర్ణమ్మ. స్త్రీలపట్ల పురుషుల కర్తవ్యాన్నీ గుర్తుచేస్తూ ''స్త్రీలకు హక్కులనిచ్చి గొప్పవారినిగాజేసి గౌరవించినందున పురుషులు తమ తల్లులను, అక్కచెల్లెండ్రను, కుమార్తెలను బాగుచేసిన వారగుదురు.

విద్యావంతులును, స్వతంత్రులును అయిన స్త్రీలు తమ పుత్రులను, భర్తలను ధైర్యశాలులుగను, దేశభక్తులుగను,చేయుదురని వేరే చెప్పవలసిన అవసరము లేదు" అని స్త్రీలు పురుషులకందివ్వగల తోడ్పాటును వివరించింది. "హిందూదేశము తిరిగి ప్రపంచములో గౌరవస్థానమును అలంకరించునట్లు చేయుట స్త్రీపురుషుల కర్తవ్యమై యున్నది." అని భారతదేశం పూర్వం అనుభవించింది అనుకొన్న ఔన్నత్యాన్ని తిరిగి సంపాదించడంలో స్త్రీ-పురుషుల బాధ్యతను గుర్తుచేసింది. స్త్రీలకు "పతిభక్తి మాత్రమే చాలద"ని నినదించిన అన్నపూర్ణమ్మ "ఆత్మబలము, దేహబలము, దేశభక్తి, దైవభక్తి మొదలైన అనేక శక్తులను సంపాదించుటకు" స్త్రీలకు పిలుపునిచ్చింది. అంతేకాకుండా "పతిభక్తి తప్ప మరేమియు కూడదనే పురుషులను స్త్రీలు గౌరవించు కాలము పోయినది'' అని పురుషులను హెచ్చరించింది. గాంధీ, నెహ్రూ,లజ్‌పత్‌రాయ్, సరోజినీనాయుడు, అనిబీసెంట్ మొదలైన "ఆదర్శప్రాయులై"న నాయకుల్లాంటివారు "అసంఖ్యాకంగా" దేశంలో జన్మించాలంటే, స్త్రీలకు పురుషులతోపాటు అన్ని రకాల హక్కుల్నీ యివ్వాలని డిమాండు చేసింది.

అన్నపూర్ణమ్మ ఘోషా, బురఖా పద్ధతులు నిరసించింది. ఘోషా వలన ''స్వేచ్ఛగ బాహ్య విషయములందు జోక్యము కలిగించుకొనుటకు వీలుండదు" అనీ, దాని వలన "అసమర్థత" కలుగుతుందనీ, "అసమర్థతే అజ్ఞానము" అనీ తెలిపింది. దీనివల్లనే స్త్రీలు మౌఢ్యులుగా చిత్రీకరింపబడుతున్నారని విశదపరచింది. "ప్రపంచమందుండు ఊయి-రప్ప, చెట్టు-చేమ, గొడ్డు-గోద ప్రతివస్తువును సూర్యరశ్మినుండి ప్రాణశక్తిని గ్రహించుచున్నవి. బురఖా ధరించుటవలన సూర్యరశ్మి తగులక రక్తహీనులును, బలహీనులును యగుచున్నారు" అని ఘోషా-బురఖా వల్ల కలిగే ఆరోగ్యపరమైన చెడుగుల్ని తేటతెల్లం చేసింది.

వేశ్యావృత్తి ''ప్రజాకంటకమైనది'' అని ఎలుగెత్తి చాటిన అన్నపూర్ణమ్మ దాన్ని నివారించడానికి అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చి, ఆదిశగా కృషిచేస్తున్న డాక్టర్ ముత్తులక్ష్మీరెడ్డిని బహుధా ప్రశంసించింది.

అస్పృశ్యతను నివారించడం "ముఖ్యావసరము"గా భావించిన అన్నపూర్ణమ్మ "అస్పృశ్యుల"ను హీనంగా చూసే "అగ్రవర్ణా"లను నిందించింది. ''నిమ్న జాతులయందుండు అసహ్యకరములగు అలవాట్లకు అగ్రవర్ణములవారే కారణభూతులు. వారిని చేరదీయక, గ్రామములందు నివసించుటకు అనుమతించక, దేవాలయములలో పూజలు చేసుకొనుటకు ఉత్తరువునివ్వక, అధమాధములనుగా చూచుచున్నాము" అని అగ్రవర్ణాల దుష్ట ప్రవర్తనను బట్టబయలు చేసింది. అగ్రవర్ణాలు పెట్టే "బాధలు పడజాలక" దళితులు క్రైస్తవం లేదా ఇస్లాంలలోకి మారి సౌభ్రాతృత్వాన్ని అనుభవిస్తున్నారని తెలియజేస్తూ ''క్రైస్తువంటి, మహమ్మదువంటి దయాళుడైన బుద్ధభగవానుడు మన దేశమున బుట్టలేదా?" అని నిష్ఠూరముగా ప్రశ్నించింది. అందరినీ సమానంగా చూడమని బుద్ధుడు చెప్పాడనీ, కానీ అతని ప్రవచనాలు పుస్తకాలకు మాత్రమే పరిమితమైపోయి కార్యాచరణలో ఉండడం లేదనీ వాపోయింది. ప్రస్తుత కాలంలో గాంధీ మహాత్ముడు అస్పృశ్యతా నివారణకోసం తీవ్రంగా కృషి చేస్తున్నాడని ప్రశంసించింది.

వర్ణవ్యవస్థను నిరసించిన అన్నపూర్ణమ్మ సహపంక్తి భోజనాల్లో శ్రద్ధ కనబర్చేది. బ్రాహ్మణులు మొదలు దళితుల వరకు అందర్నీ, ఒకే విధంగా ఆదరించేది. బంధువులు నివారించినా వినకపోయేది. పనిమనుషులు సహపంక్తి భోజనానికొచ్చిన వివిధ కులాల "అతిధుల విస్తళ్ళను, ఎంగిలి పాత్రలను" శుభ్రం చేయడానికి నిరాకరించినపుడు, ఆ పనులను తనే చేసేది. ''జాతిమత భేదములేక సహపంక్తి భోజనములలో పాల్గొనినగాని, హైందవ సంఘమందలి దురాచారములు అంతరించి మేలుకలగద''ని ఆమె నొక్కి చెబుతుండేది.

రెండు భాగాలుగా రాసిన ''జాతీయత'' అనే వ్యాసంలో ప్రజలకుండే వివిధ అస్తిత్వాలను గూర్చి చర్చించిన అన్నపూర్ణమ్మ వాటిలో విశిష్టమైన అస్తిత్వమేదో తెలియజేసింది. ప్రజలకు కులాభిమానము, మతాభిమానము, దేశాభిమానము ఉండవచ్చునీ, కానీ దురభిమానం మాత్రం ఉండకూడదని తెలిపింది. "ఒక కులము ఎంత ఉన్నత దశయందున్నను పరకులస్తులను నిరసించుటగాని, ద్వేషించుటకాని కూడదు.'' అని చక్కటి సూచనచేసింది. **కుల,మతాభిమానాలకంటే దేశాభిమానము మెరుగైనదని స్పష్టం చేసింది.** దానికన్నా "మానవ జాత్యాభిమానము సర్వోత్కృష్టమైనది. ఇట్టి యభిమానముగలవారు ఒక దేశస్తులనిగాని, ఒక మతస్తులనిగాని, నల్లవారనియు, తెల్లవారనియు భేదము చూపరాదు. ఒక దేశము మఱియొక దేశముపై విరోధము వహించుట, దానిపై దండెత్తుట, అపజయమునుగాంచిన దేశమును నానా బాధలుపెట్టి హింసించుట మొదలగునవి అసహ్యకరములుగను పాపభూయిష్టమైనవిగను భావించి" న అన్నపూర్ణమ్మది విశాలమైన అంతర్జాతీయ దృక్పథం.

భారతదేశానికున్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా జాతీయవాదం యొక్క అవసరాన్ని ప్రబోధించింది అన్నపూర్ణమ్మ. ప్రజలు కులమతాలకతీతంగా ఏకమై దేశ స్వాతంత్ర్యంకోసం పాటుపడాలని పిలుపునిచ్చింది. దేశంకోసం అందరూ ఒక్క తాటిపై నడవాల్సిన సమయంలో ఏ కులానికాకులం "ఎవరికి వారే యమునాతీరే" అన్నట్లు ప్రవర్తిస్తే, ''గొప్ప పొరపాటు చేసిన వారగుదుము'' అని హెచ్చరించింది. భారత జాతీయోద్యమంలో పాలుపంచుకోమని వైశ్యులకు ప్రత్యేకంగా పిలుపునిచ్చి వారు ఏవిధంగా దేశ స్వాతంత్ర్యోద్యమంలో సహాయపడవచ్చునో తెలియజేసింది. "విదేశ వస్త్ర వ్యాపారము మాని స్వదేశ వస్తువులను అమ్ముట, దానధర్మములకు ఉపయోగపెట్టదలంచిన ద్రవ్యమును స్వరాజ్యోద్యమమునకు ఖర్చుపెట్టుట, యువకులు వాలంటీరులుగా చేరుట, ప్రచారము కొందరు బయలుదేరి ప్రతి గ్రామము పర్యటనము చేయుచు గ్రామవాసులకు దేశపరిస్థితులను స్వరాజ్యోద్యమము యొక్క మూల సూత్రములను బోధించుట, సంఘసంస్కరణ విషయములను గూడ బోధించవచ్చును. త్రాగుడు

మాన్పించుటకు ప్రయత్నములు సలుపవలెను." జాతీయోద్యమం పట్ల తీవ్రంగా ఆకర్షితురాలైన అన్నపూర్ణమ్మ ఆంధ్రలో జరిగిన ఉప్పుసత్యాగ్రహం పట్ల మిక్కిలి సంతృప్తిని ప్రకటించింది. అందునా వైశ్యులు అందులో పాల్గొనడంతో ఆవె ఆనందానికి మేరలేకపోయింది. "వైశ్యులలోననేకులు ఈ యుద్యమమునకు సహాయము చేయుచున్నారని వినుటకు ఎంతయో ఆహ్లాదకరముగనున్నది. గుంటూరు పట్టణమందు వైశ్యులలో ఇరువదిమంది పురుషులును, ఒక స్త్రీ శ్రీమతి కాళంగి శేషమాంబగారును జైలుకు వెళ్ళుటకు సంసిద్ధులై వాలంటీరులుగా చేరినందుకు ఎంతయు సంతసము గలుగుచున్నది. **ఆరు లక్షలమంది వైశ్యులలో నారీమణులు స్వరాజ్యోద్యమమునందు పాల్గొనలేదను నిందను బాపిన శ్రీమతి కాళంగి శేషమాంబగారు ఎంతయు స్తోత్రార్హులు.......**ప్రస్తుత ఉద్యమ తీవ్రతనుబట్టి కొలదికాలములో వైశ్యులందరును ఈ యుద్యమమునందు పాల్గొనులాగున కనుబడుచున్నది" అని మిక్కిలి సంతోషాన్ని వెలిబుచ్చింది.

"గాంధ్యవతారము" అనే వ్యాసంలో కలియుగంలో జన్మించిన గాంధీ అవతారము రామావతారము, కృష్ణావతారముల కన్నా "గొప్పది" అని విశ్లేషించింది అన్నపూర్ణమ్మ. గాంధీ అహింసా సిద్ధాంతంలో బలంగా నమ్మిన ఆవె రావణాసురుని, వాని అనుచరులను చంపక ధర్మప్రవర్తనులుగా జేసియుండిన యెడల రామావతారమును ఇంకను గొప్ప అవతారముగ భావించియుండమా? కౌరవులను నాశనము చేయక తన శిష్యులుగా మార్చియుండిన యెడల కృష్ణావతారము యత్యుత్తమమని భావించియుండమా?'' అని ప్రశ్నించింది. త్రేత, ద్వాపర యుగాలకంటే కలియుగంలో "అధర్మము" ఎక్కువగా ఉందనీ, అయిననూ హింసను ప్రయోగించక "కలము, నాలుక" అనే రెండు ఆయుధములను వాడి ''ధర్మ సంస్థాపన'' కొరకు గాంధీ పాటుపడుతున్నాడనీ, ఆయనముందు శతృపక్షంవారి "పశుబలము, సైన్యము, ధనము" నిరుపయోగమవుతున్నాయని తెలియజేసింది. హింసకూ, అహింసకూ మధ్య జరుగుతున్న సమరంలో చివరకు "ఆధ్యాత్మిక బలమే జయము గాంచుచున్నది. శతృపక్షము క్రోధమును మాని గాంధీగారి శిష్యవర్గములో చేరవలసిన అవసరము కనబడుచున్నది. ఇట్టి ఆధ్యాత్మిక శక్తిని గనుపరచిన గాంధి అవతారము పూర్వపు అవతారములకంటే గొప్పదిగదా!" అని గాంధీ పట్ల తనకున్న ప్రగాఢమైన అభిమానాన్ని చాటుకున్నది. ●



ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడలూ ఆనవాళ్లు-6

# విప్పర్ల - చేజర్ల యాత్ర

ఎప్పట్నించో అనుకుంటున్నట్లుగా విప్పర్ల వెళ్లాలని ఒకపక్క, కాదు చేజర్ల వెళదామని మరోపక్క - ఇవేవీ కాదు, మాచర్ల వెళదామని మూడోపక్క- ఇలా నా మనసు నిలకడ తప్పింది. రేనాటి చోళవంశీయుడైన ఎరికల్‌ముతురాజు ధనుంజయుడు కలమళ్లలో క్రీ.శ. 575వ సం॥లో తొలిసారిగా ఒక తెలుగు శాసనాన్ని వేయించిన సంగతి మనందరికీ తెలిసిందే. అయితే దాదాపు 75ఏళ్ల తరువాత, వేంగీచాళుక్య రాజ్యస్థాపకుడైన కుబ్జవిష్ణువర్ధనుని కుమారుడు, మొదటి జయసింహుడు క్రీ.శ.649వ సం॥లో విప్పర్లలో ఒక తెలుగు శాసనాన్ని వేయించి, శాసన పరిశోధకులు, చరిత్రకారుల దృష్టిని ఆకర్షించాడు. సంస్కృతభాషా తుపాను తాకిడికి విలవిలలాడుతున్న తెలుగు భాషకు ఊపిరులూదిన జయసింహుని శాసనాన్ని తడిమి మొక్కాలనిపించింది. అది బలమైన కోరికగామారి, తీరికలేకపోయినా, మాచర్ల చేజర్లలను పక్కనబెట్టి, విప్పర్లవెళ్లటమే మేలనిపించింది. ఒకవారంపాటు ఆగింతర్వాతగాని ఈ ప్రయాణం కుదిరి, నా మనసు కుదుటపడింది. పల్నాటివైపు అడుగుపడింది.

ఎలాగైనా ప్రియుణ్ణి కలుసుకోవాల్సిందేనని నిశ్చయించుకొన్న ఓ ప్రేయసి, గండుమీనులున్న గంగానదిని దాటటానికి, ఆహారపు ముద్దల్ని సవ్యసాచిలా విసురుతుంటే చేపలు ఉబలాటంతో అటూఇటూ మళ్లగా చాకచక్యంగా నదిని దాటిన ఆ విరహోత్కంఠలా, నేను నాపనుల్ని పక్కనబెట్టి, పయనంకట్టి, పల్నాటిబాట పట్టాను. మామూలుగానే తెల్లవారుఝామున బయలుదేరిన నేను నర్సరావుపేట, నకరికల్లుమీదుగా విప్పర్ల అడ్డరోడ్డు చేరుకొనే సరికి సరిగ్గా ఉదయం ఆరైంది. అప్పుడప్పుడే తెల్లవారుతుంది. అడ్డరోడ్డు మీద అలికిడి పుంజుకుంది. కారులో నన్ను తీసుకొచ్చిన, ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాస్, ఇక్కడ టీతాగి పోదామన్నాడు. అప్పటిదాకా కార్లో కాళ్లుమడుచుకొని కూర్చున్న నాకాళ్లు సంకెళ్లు తెంచుకొన్నంత ఆనందంతో ఉప్పొంగి పోయాయి. టీ తాగి బయలుదేరామోలేదో, విప్పర్ల చేరుకొన్నాం. కొత్తగా నిర్మించుకొన్న ఆనందంలో మునిగిపోతున్న శ్రీనివాస్‌గారితో కొత్తదనం పేరిట చరిత్రను చెరిపేస్తున్నామని వాపోయాను. తెలుగుభాషాచరిత్ర గ్రంథాలన్నిటిలో చోటుదక్కించుకొన్న విప్పర్తి ముఖచిత్రం మసకబారిందన్న నా బాధనువెళ్లగక్కాను. మావూరికి అంతచరిత్ర ఉందా అనిఅడిగాడు శ్రీనివాస్ అమాయకంగా. నాతోపాటు ఆయన్ను చెరువుకట్టపైకి తీసుకెళ్లి తూర్పు చాళుక్య మొదటి జయసింహుని శాసనాన్ని చూపించాలనుకొన్న శాసనం దొకరలేదు. కొద్దిదూరంలో వక్షస్థలం వరకూ కూరుకుపోయిన క్రీ.శ.9వ శతాబ్ది శిల్పాన్ని చూపించాను.



చెరువుకట్ట దిగి కొత్తగా కట్టుకొన్న గుళ్లదగ్గరకెళ్ళి, పడమరవైపు కాంపౌండుగోడకు ఆనించి వాలుగా నిలబెట్టిన జయసింహుని శాసనాన్ని చూచి ఊపిరిపీల్చుకున్నాను. ఆశాసన పలకను పట్టుకొని అక్షరాల్ని ఆలింగనం చేసుకొన్నాను. ఈ శాసనంలోని తెలుగు పదాల్ని నా పెదవులపై పలికించుకొన్నాను. తెలుగుభాషకు పట్టంగట్టిన జయసింహునికి చేతులెత్తిమొక్కాను. ఎక్కడో, కర్ణాటక రాష్ట్రంనుంచివచ్చిన అతని తండ్రి కుబ్జవర్ధనుడు ఇక్కడే స్థిరపడి, స్థానిక ప్రజల మన్ననలు పొందగా, ఆయన కుమారుడైన జయసింహుడు మరో అడుగుముందుకేసి, తన అమ్మనుడి కన్నడభాషను, సామాన్య ప్రజలకు తెలియకపోయినా, దేశమంతటా రాజ్యమేలుతున్న సంస్కృత భాషను పక్కనబెట్టి, తెలుగుభాషకు పట్టంగట్టిన తీరును వివరిస్తుంటే- శ్రీనివాస్ విస్తుబోయాడు. ఈ శాసనంలో సంవత్సరంబుళ్, ఎదుంబొది(ఎనిమిది), పుణ్ణమనాణ్ణు (పున్నమినాడు) పులోంబున (పొలాన), ఆఢపట్టుసేను (వడ్డు పండే భూమి) తాళుతోంటి (తాటితోపు) పాఅపదువారము (పండుగకు బ్రాహ్మణులకిచ్చే కానుక) యిఱ్లకారు (రెండు కార్ల పంట), విత్పర్తి గాణంబు (విప్పర్తిపొలం) కవుల ఆయం.........(పొలాన్ని కవులుకివ్వగా వచ్చే ఆదాయంతో)పాఅ (బ్రాహ్మణుడు) అన్న అచ్చతెలుగు పదాల్ని వినిపిస్తుంటే శ్రీనివాస్ కళ్లల్లో కాంతులు వెల్లివిరిచి వళ్లంతా పులకింతకు గురికావటం చూచి ఆనందించాను.



యుద్ధభూమిలో రెక్కలుతెగి పడిపోయిన యోధుల్లా, అక్కడే ఉన్న మరోమూడు శాసనాలు పట్టించుకొనే

వాళ్లకోసం పరితపిస్తున్నాయి. ఒకటి క్రి.శ.1074 నాటి తూర్పుచాళుక్య విష్ణువర్ధన మహారాజుల శాసనం, రెండోది క్రీ.శ1125నాటి మహామండలేశ్వర కీర్తిరాజు మల్లిదేవచోడమహారాజు శాసనం, మూడోది క్రీ.శ. 1264 నాటి మహామండలేశ్వర అల్లాడ పెమ్మయ దేవమహారాజుల శాసనం. ఆ శాసనాలను చూస్తున్నంత సేపు తాతముత్తాతలను చూస్తున్నంత ముచ్చట పడిపోయాను. విప్పర్తిని, విత్పత్రి, విత్పత్రి, పెదవిప్పత్తి అని పిలిచేవారని, ఆలయంలోని శివుణ్ణి మహామల్లేశ్వరుడనేవారని, శ్రీనివాస్‌కు వివరించాను. శాసనాల్లో పాఱ అన్న శబ్దం బ్రాహ్మణులను సూచిస్తుందని, కడపజిల్లా కొర్రపాడు, రామాపురం (క్రీ.శ.8వ శతాబ్ది) క్రీ.శ.10వ శతాబ్దినాటి అరకటవేముల శాసనాల్లో కూడా కనిపిస్తుందని చెప్పాను. అంతేకాదు ఈనాడు మనం రాయబారిగా పిలుచుకొంటున్న పదానికి రాయపాఱ అన్న పదం మూలమని, అనగా, ఒకరాజు మరో రాజుకు తన ప్రతినిధిగా పంపే పాఱ (బ్రాహ్మణుడు) ను రాయపాఱ అని పిలిచేవారని చెప్పాను.

విప్పర్లలోని క్రీ.శ.1195 నాటి శాసనంలోని మల్లిదేవచోళమహారాజు ప్రస్తుత ప్రకాశంజిల్లా కొణిదెన నుంచి పాలించాడు. అతడు ఇక్కడి మల్లేశ్వరస్వామి దేవాలయంలో పుణ్యక్షేత్రాల సందర్శకులకోసం ఒక చలివేంద్రాన్ని, రోజూ వెయ్యమందికి భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశాడంటే, ఆకాలంలో విప్పర్ల ఒక ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఎంతగా వెలుగొందిందో తెలుస్తుంది. ఇక తూర్పుచాళుక్యుల కాలపు ఈ శివాలయం లింగంపైన 'శివశివ' అన్న క్రీ.శ.8 వ శతాబ్ది తెలుగు-కన్నడ అక్షరాలున్నాయి. చండి, వినాయక, మహిషాసురమర్దిని, భైరవ శిల్పాలు వేంగీచాళుక్య శిల్పకళకు అద్దంపడుతున్నాయి. పల్లవ బాదామీ చాళుక్య (రెండోపులకేశికొప్పరం) శాసనాల్లో కూడా విప్పర్ల ను విఱిపఱగా పేర్కొన్న సంగతి విని- శ్రీనివాస్ మురిసిపోయాడు. నేలమీద పడుకోబెట్టిన, గోడకు ఏటవాలుగా ఆనించిపెట్టిన వెయ్యేళ్లకుపైగా చరిత్రగల శాసనాలు, శిల్పాలను పీఠాలపై నిలబెట్టి, వాటి వివరాలు రాసిన పేరుపలకల్ని ఏర్పాటుచేయమని శ్రీనివాస్‌కు చెప్పాను. తరువాత శాసనాల్లో పేర్కొన్న మ్లావిండ్ల చెరువును ఒకసారి కలియజూచి, కట్టమీద చండికను పైకిలేపమని చెప్పి, విప్పర్ల, రెడ్డిపాలెం మీదుగా చేజర్లకు బయలుదేరాం.

చేజర్లకు వెళుతూ కుంకలగుంట చేరిన మమ్మల్ని, బాపతు సత్యనారాయణరెడ్డిగారు వాళ్లింటికి ఆహ్వానించి, అతిథి మర్యాదల నందించారు. ఆయనే స్వయంగా, కుంకలగుంటలో పునర్నిర్మించబడిన వీరభద్రాలయం, భోగేశ్వర, కేదారేశ్వర, చెన్నకేశవాలయాల్ని చూపించారు. భోగేశ్వరాలయంలోని క్రీ.శ.1347నాటి కొండవీటి ప్రోలయ వేమారెడ్డి శాసనంలో, క్రుంకలకుంటలోని వల్లభేశ్వరుని ఉపహారాలకు, గుడ్డపల్లి, ముప్పాళ్ల చెరువులక్రింద ఇచ్చిన భూముల వివరాలు, పూజారుల పేర్లను ఒకసారి జ్ఞాపకం చేసుకొన్నాను. స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయంలోని క్రీ.శ.1275 నాటి కాకతీయ రుద్రమదేవి అంగరక్షకుడు చేసిన భూదాన శాసనం, వీరభద్రాలయంలోని క్రీ.శ.1321 నాటి కాకతీయ ప్రతాపరుద్రునికి పుణ్యంగా మోట్టపల్లి భాస్కరదేవుని మంత్రి మల్లయగారు కుంకలకుంట్ట మూలస్థాన కేదారదేవునికి భూమి, గానుగ, వీసం ధనం, పెట్టిన వివరాలున్న శాసనాలను పరిశీలించాను. చేజర్లకు బయలుదేరుతుంటే భోజనంపెట్టిన బాపతు సత్యనారాయణరెడ్డి గారు నన్నొక ప్రశ్నవేశారు. మావూరు పేరు కుంకలగుంటకు అర్థం చెబుతారా అని. క్రుంకలగుంట/కుంకలగుంట అంటే క్రుంక=మునుగు అని, కుంక=బాలవితంతువని శబ్దరత్నాకరంలో ఉందనీ, బహుశా, చేజర్ల పుణ్యక్షేత్రాన్ని సందర్శించటానికి వెళ్లేవాళ్లు ఇక్కడున్న గుంటలో మునిగి పవిత్రస్నానమాచరించే వారేమోనని ఒక వివరణ ఇచ్చాను. మరో అర్థం ప్రకారం, బాలవితంతువులెక్కువగా ఉన్న వూరుగానీ, లేక బాలవితంతువుల పునరావాస కేంద్రంగానీ, ఆరోజుల్లో ఉండి ఉండవచ్చున్న రెండో వివరణ కూడా ఇచ్చాను. ఆయన ఎందుకో మొదటి వివరణవైపే మొగ్గుచూపాడు. ఇక నేను శ్రీనివాస్‌తో కలిసి చేజర్లకు పయనమైనాను.

గుంటూరుజిల్లాలో మంచికల్లు, గురజాల, గోలి, కంభంపాడు, కోటనెమలిపురం లాంటి బౌద్ధక్షేత్రాల నడుమ శాతవాహన కాలంలో విలసిల్లిన బౌద్ధారామాల సరసన చేరిన చేజర్ల ఇక్ష్వాకుల కాలంలో ఎందరో



బౌద్ధభిక్షువులకు నిలయమై, ఉపాసక, ఉపాసికల సందర్శనతో నిత్యం కళకళలాడింది. **రానురాను ఆదరణ కోల్పోయిన బౌద్ధచేజర్ల, అనుకోకుండా బ్రాహ్మణీయ చేజర్లగా మారిపోయింది.** 1917-18 సం॥లో, ఏ.హెచ్.లాంగ్‌హరిస్ట్, చేజర్ల పురాతన కట్టడాలను పరిశీలించి, క్రీ.శ.7వ శతాబ్దిలో బౌద్ధచైత్యాలయం, శివాలయంగా మార్చబడిందని తెలియజేశాడు. ముందున్న విజయనగర కాలపు ప్రవేశ (ద్వార) గోపురమండపంనుంచి లోనికెళ్లి కపోతేశ్వరాలయాన్ని చూశాను. ఒక్కసారి చుట్టూతిరిగొచ్చాను. ఆలయ సముదాయంలో, 78చారిత్రక ఆనవాళ్లున్నాయి.

వీటిలో 25 దేవాలయాలు,26 లింగపీఠాలు, 4 నాగస్థంభాలు, 18 చిన్నరాతి శిల్పాలు, 5 శాసన స్థంభాలు, కొత్తగా బయల్పడిన 4 ఇటుకరాతి ఆలయాలు కనిపించాయి. శాసనాల్లో చేజర్ల, కందరపురమని, కపోతపురమని, కందరకపోతపురమని, చెరుంజెర్ల అని పిలువబడింది.

ఒక్కో చారిత్రక ఆనవాలూ, ఒక్కో రాజవంశాన్ని, ఒక్కో రాజును, ఒక్కో సందర్భాన్ని గుర్తుకుతెస్తున్నాయి. ఇక్ష్వాకుల అనంతరం చేజర్లను రాజధానిగా జేసుకొని పాలించిన ఆనంద గోత్రిస రాజుల్లో, క్రీ.శ.310-15మధ్య పాలించిన దామోదరవర్మ శాసనాల్లో తాను బౌద్ధోపాసకుణ్ణని, సంయక్సంబుద్ధస్య పాదానుధ్యాతుడనని చెప్పుకొన్నాడు. శాతవాహనకాలంనాటి రెండువందల ఏళ్ల తరువాత వుంది.చేజర్ల చైత్యానికి మరమ్మత్తులు చేయించాడు. గత వైభవాన్ని పునరుద్ధరించాడు. తరువాతవచ్చిన పల్లవులు శైవంవైపు మొగ్గుజూపగా చేత్యాలయం కాస్తా కపోతేశ్వరాలయంగా మారింది. ఒకవైపు పల్లవులూ, మరోవైపు విష్ణుకుండినులు, బౌద్ధంకుత్తుకపై కత్తినుంచి, త్యాగశీలాన్ని ప్రబోధించిన శిబిజాతక మహోన్నతాశయాన్ని అపహాస్యంచేస్తూ, బౌద్ధజాతక కథను స్థలపురాణంతో కప్పి, బుద్ధభగవానుని నీడలో ఈశ్వరుణ్ణి ప్రతిష్ఠించినవైనం నా మనసును కలచివేసింది. పరమబౌద్ధుడైన అశోకుడుకూడా ఇతర మతాలను గౌరవించి సమాదరించమని తన శాసనాల్లో చెప్పుకున్నాడు. ఇక్కడ మాత్రం ఆధిపత్యధోరణికి బౌద్ధం మౌనాంగీకారాన్ని తెలపటం తప్ప ఏమీ చేయలేకపోయింది. ఆనందగోత్రినుల చివరిరోజుల్లో జాతకంమారిన చేజర్ల, విష్ణుకుండిన, తొలిపల్లవ, తూర్పుచాళుక్య, యాదవ, కాకతీయ, రెడ్డి, గజపతి, విజయనగర రాజుల కాలంలో శైవక్షేత్రంగా విరాజిల్లింది. ఆలయం వెనుక, లోపలి మరో మండపంలోనూ ప్రవేశద్వారం దగ్గర ఉన్న బౌద్ధఆనవాళ్లను చూస్తూ నిర్లిప్తంగా ఉన్న నన్ను శ్రీనివాస్ పలకరించాడు. సార్ నిజంగా చేజర్ల బౌద్ధక్షేత్రమా అని అడిగాడు. ఆలయంపేరు కపోతేశ్వరుడుకదా మీరు అలా అంటారేమిటన్నాడు. అతనికి జరిగిన చరిత్ర చెప్పాను. మతమార్పిడి మనకు కొత్తకాదన్నాను.

నిజమే చేజర్ల శివలింగంపేరు కపోతేశ్వరుడు. బౌద్ధ జాతక కథల్లో కిరాతుని నుంచి పావురాన్ని రక్షించి తూనికలో శిబిచక్రవర్తి తన తొడనుకోసి, పావురమంత మాంసాన్ని దానం చేయటానికి పూనుకొన్న ఇతివృత్తంగా బోధిసత్వుని త్యాగనిరతిని అనుకరిస్తూ ఈ శివాలయం రూరుదిద్దుకుంది. అయినా ఏనుగు వెనుకభాగాన్ని గుర్తుకుతెచ్చే విధంగా నిర్మించిన చైత్యాలయం బౌద్ధధమ్మవీచికలను వెదజల్లుతూనే ఉంది. ఆలయంలోపలి మహామండపంలోనున్న బౌద్ధ శిలామండప స్తంభాలు, బౌద్ధానికి మూలస్తంభాలైన శీల, సమాధి, ప్రజ్ఞల్లో, శీలానికి ప్రతీకలుగా ఇంకా నిలిచి, బౌద్ధాన్ని పూర్తిగా మార్చాలనుకున్న వారి అవివేకం పట్ల జాలిపడుతునే ఉన్నాయి.

ఆలయం వెనుక, బౌద్ధారామ ఆనవాళ్లతోపాటు పల్నాటి సున్నపురాతి స్తంభం, దానిపైన ఇక్ష్వాకుల కాలపు ప్రాకృత శాసనంలోని అందమైన అక్షరాలు, మళ్లీ ఇక్కడ బౌద్ధం పల్లవిస్తుందన్న ఆశను ఊరిస్తున్నాయి. భారత పురావస్తు సంస్థ రక్షిత కట్టడాల జాబితాలో చేరిన ఈ సముదాయంలో, చాళుక్యుల నమూనా ఆలయాలు, పల్నాటి సున్నపురాతి రెండుచేతుల గణేశుడు, సూర్యుడు, రాష్ట్రంలోని మొదటిదైన వేయిలింగాల శిలాఫలకం, చాళుక్య సంప్రదాయంతో తీర్చిదిద్దిన నంది, సహజసిద్ధ మాతృత్వానికి ప్రతీకలైన సప్తమాతలు, రకరకాల శివలింగాలు, ఒకటేమిటి తరతరాల వాస్తుశిల్ప ప్రదర్శన శాలను తలపించింది- చేజర్ల.

అన్నీ బాగానే ఉన్నాయి గానీ, వంచనకుగురైన పంచశీల గుర్తుకొచ్చి చరిత్రకు జరిగిన హాని నా గుండెల్లో గునపంలా గుచ్చుకుంది.

చేజర్లలో ఇక్ష్వాకుల కాలపు ప్రాకృత శాసనంకాక, ఉన్న తొమ్మిది శాసనాల్లో తూర్పుచాళుక్యరాజైన విషమసిద్ధి క్రీ.శ.7వ శతాబ్ది తెలుగుశాసనం, తేదీలేని రెండు కన్దరపుర వరజనపదపతి శాసనాలు, క్రీ.శ. 9వ శతాబ్ది తెలుగుశాసనం, క్రీ.శ.1140 నాటి బఙయనాయకుని గొత్తిల దానశాసనం, క్రీ.శ.1163, 1165, 1174 నాటి తాడూ కేతిరెడ్డి శాసనాలు, క్రీ.శ.1247 నాటి నాలుగు



సహస్రలింగాల శాసనాల్లో, తెలుగు భాష చరిత్రకుపకరించే రెండు శాసనాలు ముఖ్యమైనవిగా చెప్పుకోవచ్చు.



విజయనగర సామ్రాట్టు శ్రీరాజాధిరాజ రాజపరమేశ్వర శ్రీవీరప్రతాప శ్రీకృష్ణదేవమహారాయల ప్రసక్తిగల క్రీ.శ. 1517, జూన్ 19 వతేదీనాటి శాసనం ఆలయ మండపందగ్గర ఉంది. 97 పంక్తులున్న ఈ తెలుగు శాసనంలో, శ్రీకృష్ణదేవరాయని రాజ్యంపై శ్రీసాళ్వతిమ్మరుసయ్యంగారు, శ్రీకపోతేశ్వరానికి చెందిన (చేజర్ల) శ్రీకరణ నమశ్రవారుల / నమశ్శివాయ గారు శ్రీకపోతేశ్వరస్వామికి ఇంకా ఇతర శివాలయాలకు ఇచ్చిన వివరాలు ఉన్నాయి.

తెలుగుశాసనమున్న దేవాలయాన్ని చూడబోతున్నామని చెబుతూ విజయవాడలో బయలుదేరి విప్పర్లకు చేరిన నాకు నిర్లక్ష్యంగా పడిఉన్న శాసనాలు నిరాశను మిగిల్చాయి. ఉన్నపళంగా మత మార్పిడికి గురైన చేజర్ల బౌద్ధ ఆరామంలోని స్తంభాలు, శివాలయ మండప భారాన్ని మోస్తూ నిట్టూర్పులు విడుస్తున్నాయి.

ఒకప్పుడు బౌద్ధధర్మ నిలయాలైన చైత్య, విహార శిధిలాలు -మరో అశోకుని కోసం ఎదురుచూస్తున్నాయి. త్యాగనిరతికి, బౌద్ధ ధార్మిక ఔన్నత్యానికీ ప్రతీక అయిన శిబిజాతకం మరో-మత ఘాతుకానికి బలైంది బౌద్ధభిక్షువుల వర్షావాసాలుగా, ధ్యానం చేసి సమాధి స్థితిలో(2) నిర్వాణానందాన్ని చవిచూపించిన గుహలు, కల్పిత మేఘాల మల్లయ్య నివాసాలుగా మారిపోయాయి. ఏదిఏమైతేనేం, విప్పర్లలో తొంగి చూచిన తెలుగు, అటు తరువాత వెలుగును కోల్పోయింది. వెయ్యేళ్లపాటు వెలుగొందిన బౌద్ధం నిషిద్ధగీతమైందని, ఒక కొత్తమతం



ప్రజల అభిమతాన్ని కాదని, మౌఢ్యాన్ని నూరిపోసింది. శాంతిని కాంక్షించిన బౌద్ధం, రెక్కలు తెగిన పావురమైంది. గతాన్ని తలచుకుంటూ అనాగత్వాన్ని ఆహ్వానిస్తూ తిరుగు ప్రయాణం ముగించుకొని ఇంటికి చేరుకున్నాను. విప్పర్ల శాసనం, చేజర్ల చైత్యాలయం నన్ను ముసురుకొని ఉక్కిరిబిక్కిరి చేస్తూనే ఉన్నాయి. చరిత్రకు, చారిత్రక ఆనవాళ్లకు మళ్లీ మంచిరోజులు రాకపోతాయా అనుకునేలోపు కంటికి కునుకు పట్టింది.



కన్నడ మూల:డా. చంద్రప్ప సోబటి;తెలుగుసేత:రంగనాథ రామచంద్రరావు
90597 79289



# కొయ్యబొమ్మలాట కళాకారుడు గొంబేగౌడర రామనగౌడ ఆత్మకథ

**13-14 శతాబ్దాలలో** జరిగిన శైవ, వైష్ణవ ధార్మిక ఘర్షణల పరిణామంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల శ్రీశైలం కొండ నుంచీ ఈనాటి కర్నాటక ప్రాంతానికి వలస వచ్చినవారు. ఈ దూర ప్రయాణ సమయంలో వీరికి కొయ్యబొమ్మలాటతో పరిచయం ఏర్పడింది. ఆసక్తితో ఆ ఆటను నేర్చుకుని అందులో నైపుణ్యాన్ని సాధించారు. అప్పటి నుంచి కొయ్యబొమ్మలాట ప్రదర్శిస్తూ కర్ణాటకలోని వివిధ గ్రామాలలో తిరిగి ఈనాటి కుందగోళ రెడ్డేర నాగనూరు గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. అప్పటికే గ్రామగ్రామాల్లో వీళ్ల కొయ్యబొమ్మలాట ప్రదర్శనతో ధనవంతులయ్యారు. పేరు ప్రఖ్యాతులు కలిగాయి. ఆ కారణంగా అక్కడికి వచ్చి స్థిరపడిన కొంత కాలంలోనే వారికి 'ఊరి గౌడ' పదవి దొరికింది. ఆ కారణంగా అదే గ్రామంలోని మూలనివాసులకు, వలస వచ్చినవారికి మధ్య ఘర్షణ మొదలైంది. కాలక్రమంలో వాళ్లు హావేరి జిల్లాలోని రాణిబెన్నూరు తాలూకా అంతరవళ్ళి గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు.

'గొంబె'గౌడ పూర్వీకులు తెలుగే మాట్లాడేవారట. ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న రెడ్డిలింగాయతుల్లో ఇప్పటికీ 'తెలుగు' వాడుక ఉంది. బళ్ళారి, చిత్రదుర్గ జిల్లాలలో ఈ 'తెలుగు భాష' వాడకం ఎక్కువ ఉనికిలో ఉంది. సరిహద్దు ప్రాంతాలతో పోలిస్తే 'మధ్య కర్నాటక'లో ఈ తెలుగుభాషా ప్రభావం తక్కువ. సుమారు నాలుగైదు తరాల నుంచి తెలుగు వాడకపు గురుతులు వీళ్ళల్లో లేవు. వీరి వంశంలో కొయ్యబొమ్మలాట వృత్తి చరిత్ర సుమారు 600 సంవత్సరాల కన్నా ఎక్కువగానే ఉంది. వీరి గొప్పదనాన్ని మెచ్చుకున్న విజయనగర రాజులు వీరికి రాగి శాసనాలు కానుకగా ఇచ్చారు. అప్పటి నుంచి వీరి పూర్వీకుల ఇంటిపేరు 'జీవనగౌడ' అన్నది మరుగై 'గొంబె'గౌడ అనే ఇంటిపేరు ముందుకొచ్చింది. ఇది వీరి కళానైపుణ్యాన్ని తెలియజేస్తుంది.

నేనొక కొయ్యబొమ్మల కళాకారుడిని. వయసు అరవైయారు. పదమూడేళ్ళ వయసు నుంచి ఈ బొమ్మల ఆటలో నిమగ్నమయ్యాను. మా ఊరు అంతరవళ్ళి. ఇది హావేరి జిల్లా రాణిబెన్నూరు తాలూకాలో ఉంది. మా నాన్న హనుమనగౌడ. అమ్మ కమలమ్మ. 1947 మార్చి 1న నేను పుట్టిన రోజు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సంవత్సరంలోనే నేను పుట్టాను. ఇది నా అదృష్టం కాదా? మా కులం రెడ్డి లింగాయత. ఇంటిపేరు జీవనగౌడ అని. జీవన గౌడ అన్నది మా వంశంలోని ఒక పెద్దాయన పేరు.

చుట్టుపక్కలున్న పల్లెల జనం మమ్మల్ని 'గొంబే గౌడ' (గొంబే అంటే బొమ్మ అని అర్థం) అని పిలుస్తారు. ఈ పేరు మా వంశానికి సుమారు నాలుగు వందల సంవత్సరాల నుంచీ వాడుకలో ఉందని మా నాన్న చెప్పేవారు. మా వంశంలోని ఒక పూర్వీకుడు ప్రదర్శించిన బొమ్మల ఆటను చూసి మెచ్చుకున్న విజయనగరం రాజులు తామ్ర శాసనం ఇచ్చారంట. ఆ తామ్ర శాసనాన్ని పూనా విశ్వవిద్యాలయం పరిశోధకులొకరు వచ్చి తీసుకునిపోయాడు. తిరిగి తెచ్చి ఇవ్వనే లేదు. మా వంశంలో పారంపర్యంగా వస్తున్న కొయ్యబొమ్మల ఆట గురించి ఉన్న ముఖ్యమైన సాక్ష్యాన్ని పోగొట్టుకున్నాం. ఇలాంటివి చేయకూడదన్న అవగాహన విద్వాంసుల్లో ఉండాలి. సరే, మా వంశానికి విజయనగరం కాలం నుంచి 'గొంబె గౌడ' అనే పేరు వాడుకలో వచ్చివుండొచ్చనే అనుమానం నాది.

మా తల్లితండ్రులకు పెళ్ళయి పన్నెండేళ్ళు గడిచినా పిల్లలు కాలేదంట. అంటే నేను, మా అన్న , తమ్ముడు, చెల్లెలు, ఎవరూ పుట్టలేదు. మమ్మల్ని కనటానికే మా అమ్మ కనిపించిన దేవతలందరికీ మొక్కుకుందట. ముడుపులు కట్టిందట. మా కులదైవం వీరన్నకైతే అనేక ముడుపులు కట్టి వాటిని తీర్చిందట. 'గొడ్రాలు' అనే సూటిపోటీ మాటల నుంచి విముక్తి పొంద వలసిందేనన్నది అమ్మ గొప్ప కోరికట.

నాన్న కొయ్యబొమ్మల ఆట చూసి మెచ్చుకున్న గ్రామీణులు ఆయనను మెచ్చుకుంటున్నప్పుడూ, మాటల్లో మా నాన్నకు పిల్లలు లేకపోవటం గురించి ప్రస్తావించేవారట. అది మరింత బాధ కలిగించేదట. ఈ ఆటలు ప్రదర్శిస్తుండటం వల్లనే తమకు ఎక్కువ అవమానం కలుగుతోందని నాన్న అమ్మ దగ్గర కూర్చుని ఏడ్చేవారట. ఈ రోజు ఇదే బొమ్మలాట వల్లనే కీర్తిమంతుడినీ, అవమానితుడినీ అవుతున్నానని కుమిలిపోయేవారట.

కీర్తి తెచ్చిన బొమ్మల వల్లనే అవమానం నుంచి విముక్తిపొందాలని అనుకుని ఇంట్లో ఉన్న కొయ్యబొమ్మలనే పూజించటం ప్రారంభించారు. ఆ బొమ్మలనే దేవుళ్ళుగా నమ్మారు. వాటిలో గొప్పదైన బొమ్మ 'శ్రీకృష్ణుడు' అని మా తాతయ్య అప్పుడప్పుడు చెప్పేవారు. నాన్నయితే కృష్ణుడి బొమ్మను చాలా ఇష్టపడేవారు .మా అమ్మకూ అంతే. కృష్ణుడి బొమ్మ అంటే ఎక్కడా లేని ప్రేమ, భక్తి, గౌరవం. శ్రీకృష్ణుడే మా బతుకుబండి సారథి అని నా నమ్మకం. ఈ 'నమ్మకమే' మా బతుకుకు స్ఫూర్తి అయ్యింది. ఈ 'నమ్మకం' అనే గుణం నాన్న నుంచి నాకు వచ్చింది. నా పిల్లల్లోనూ అదే 'నమ్మకం'

కొనసాగింది.

సంతానం కోసం ఆటబొమ్మలను అమ్మ పూజించేది. వీధిలోని పిల్లలను తెచ్చుకుని వాళ్ళకు అన్నం పెట్టేది. బట్టలు ఇచ్చేది. ఇంటికి బిచ్చానికి వచ్చిన సాధువు-సంతులకు భోజనం పెట్టడం చేసేదట. మా ఇంట్లో ఇప్పటికీ ఈ పద్ధతి ఉంది. పారంపర్యంగా వచ్చిన సంప్రదాయాన్ని అదే రీతిలో ముందుకు కొనసాగించాం.

ఊరికి వచ్చిన సాధువులు-సంతులు మరొక ఊరికి లేదా వాళ్ళ ఊరికి వెళ్ళటానిక బస్సు ఛార్జీలకు లేదని మా ఇంటికి వస్తే, వాళ్ళ ఊరికి వెళ్ళటానికి కావలసినంత డబ్బు ఇచ్చి పంపేవాళ్ళం.

మేము చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు, అదీ ప్రత్యేకించి బొమ్మల పూజ చేయడం ప్రారంభించిన పన్నెండేళ్ళకు మా అమ్మకు సంతానం కలిగింది. ఈ విషయాలను నాన్న కథలా చెప్పేవారు. వీరన్నకు కట్టిన ముడుపు కారణంగా పుట్టిన మొదటి కొడుకుకు అంటే మా అన్నకు వీరన్నగౌడ అని పేరు పెట్టారట. 'నేను గొడ్రాలిని అనే అపవాదం నుంచి విముక్తి కలిగించమని శ్రీకృష్ణుని దగ్గర ఒక బిడ్డను ఇవ్వమని అడిగాను. అయితే ఆ దయామయుడు కృష్ణుడు పాండువుల్లా అయిదు మంది పిల్లలను ఇచ్చాడు" అని అమ్మ సంతోషంతో చెబుతుండేది. ఆ కథ విని నాకు ఒక్కోసారి ఏడుపు వచ్చేది. ఆ ఏడుపే నేను సుసంస్కృతంగా పెరగటానికి కారణమైందేమోనని అనిపిస్తోంది.

మా తల్లితండ్రులు మమ్మల్ని పొందటానికి పడిన కష్టం నన్ను పదేపదే వేధించేది. నా కొడుకుకు తొందరగా పిల్లలు కలిగినప్పుడు కూడా నాకు మా తల్లితండ్రులు చెబుతున్న కథ గుర్తుకొచ్చేది.

మేము అయిదు మందిమి. అందులో నలుగురు మగపిల్లలు. ఒక ఆడపిల్ల. నేను రెండోవాడిని. చెల్లెల్ని నాన్న ఎప్పుడూ కూతురుగా భావించలేదు. కేవలం ఆడపిల్లగా చూడలేదు. మా ఇంటి వెలుగు, జ్యోతి, దీపం అనేవారు. నలుగురు మగపిల్లలను ముందుకు నడిపించే దేవత అనే పిలిచేవారు. ఆమె కూడా అంతే. నాన్నంటే ప్రాణం పెట్టేది. నాన్నను కన్నతల్లిలా చూసుకునేది.

మేము అంత ధనవంతులం కాము. అంత బీదవాళ్ళమూ కాము. నాన్న కాలానికి లేదా మా చిన్నతనంలోని రోజులతో పోల్చితే ఈ రోజు శ్రీమంతులమయ్యాం. నాన్న కాలంలో తిండికీ, బట్టకూ కొరత లేదు. నాన్న ముఖ్యమైన వృత్తి వ్యవసాయం. సంవత్సరంలోని కొన్ని రోజులు పురాణ ప్రవచనాలు చేసేవారు. అప్పట్లో బొమ్మలాట ప్రదర్శనలు విపులంగా ఉండేవి. మా తాలూకాలోని చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న అనేక తండాలు ఉన్నప్పటికీ నాన్న ప్రదర్శించే కొయ్యబొమ్మలాట చాలా ప్రసిద్ధి చెందింది.

నాన్న వ్యవసాయం చేస్తున్న పొలంలో పంట కూడా బాగానే పండేది.

అప్పుడు మేము చిన్నవాళ్ళం.

ఇంటి ఖర్చు తక్కువే. ఆదాయం ఎక్కువ.

నాన్నకు ఎలాంటి దురలవాట్లు లేవు. ఆయన అన్నదమ్ముల నుంచి (సవతి పిల్లలు) వేరుపడినప్పుడు ఆయన పాలికి వచ్చింది కేవలం ఒకటిన్నర ఎకరం పొలం మాత్రమే. ఆయన ఒక్క రోజు కూడా ఊరి హోటల్లో ఏమీ తిన్నవారు కారు. ఆట ఆడటానికి పల్లెలకు పోయినప్పుడు కూడా అంతే. తప్పనిసరి పరిస్థితిల్లో మాత్రమే హోటల్లో భోజనం చేసేవారు. అక్కడ ఎవరైనా భోజనాలకు పిలిస్తే చాలు వారింట్లో భోజనం చేసి వచ్చేవారు. సంపాదించిన సొమ్మును పొదుపుగా ఖర్చు చేస్తూ ఎంతో కొంత కూడబెట్టేవారు. బహుశా ఆ కారణంగానే నలభై ఎకరాల పొలం చేసుకున్నారు. ఇందువల్ల నాన్నతో కలిసి ఆట ఆడటానికి వచ్చిన కళాకారులకు సమయానికి వారి సంభావన (కట్నం) ఇవ్వడానికి, అవసరమైతే మరింతగా సహాయపడటానికి సాధ్యమయ్యేదని నాన్న చెప్పేవారు. మేము కూడా ఇలాంటి గుణాలను అలవరుచుకుంటే మంచిదన్నది ఆయన ఆశయం.

అయితే నాన్నలోని అన్నీ మంచి గుణాలను అలవరుచుకుని బతకడానికి నా వల్ల కాలేదు. కొన్నింటిని వదలకుండా పాటిస్తాను. నాన్న కష్టపడినంతగా నేను కష్టపడలేదు. ఆయన సవితి తల్లి ఆశ్రయంలో, తల్లితండ్రుల ప్రేమ కొరతలో పెరిగారు. ఒక్క పూట భోజనం కోసమూ కష్టపడ్డారట. తనలా తన పిల్లలు తల్లిదండ్రుల ప్రేమ కొరతలో, ఆహారం కొరతలో కుమిలిపోకూడదని ఆయన కోరిక. తన కుటుంబం ఎక్కడ కష్టపడిపోతుందనే భయమూ ఆయనలో ఉండేది. బహుశా అందువల్లనే అంత పొదుపుగా ఉండి ఆస్తి సంపాదించారేమో! మమ్మల్ని చాలా ప్రేమగా చూసుకున్నారు. పెంచారు.

అలాంటి ప్రేమ, అక్కరల మధ్య పెరిగినవాళ్ళం మేము.

**దేవుడికి వదిలిన గేదెల పాలు తాగి పెరిగాం**

మా చిన్నతనంలో మా ఇంట్లో చాలా పశువులు ఉండేవి. పాలు-వెన్నలకు కొరతే లేదు. అంతేకాకుండా దేవుళ్ళకు గేదెలను వదిలే సంప్రదాయం మా ఇంట్లో ఉండేది. అంటే దేవుడి పేరిట, ముడుపు రూపంలో వదిలిన రెండు గేదెలు ఉండేవి. అలాంటి రెండు గేదెలలో ఒక గేదె కులదేవత 'చంద్రగుత్తెమ్మ' పేరిట, మరో గేదె గ్రామంలోని 'వీరభద్రస్వామి' దేవుడి పేరిట ఉండేది.

గ్రామంలోని వీరభద్రస్వామి దేవాలయానికీ మా వంశానికీ ప్రాచీన కాలం నుంచీ ఆచరణ సంబంధం ఉంది. ఇది ఎందుకు వచ్చిందో మాకు తెలియదు. మేమేమి ఆ దేవుడి పూజారులం కాదు. వీరభద్రుని జాతరలో చేసే ఆచరణల కోసం ఉపయోగించే 'డప్పు' మా ఇంట్లో ఉండేది. ఇప్పటికీ ఆ సంప్రదాయముంది.

అయితే దేవుడికి గేదెను వదిలే సంప్రదాయం లేదు. ఇది నాన్న కాలంలోనే మాయమైంది. అలాంటి ఎన్నో సంప్రదాయాలు ఈ రోజు కనుమరుగయ్యాయి. దీనివల్ల మాకు అనేక పరిమాణాలు జరిగాయి. జరుగుతూ ఉన్నాయి. ఈ రోజు మా ఇంట్లో పాలు లేవు. పిల్లలకు, మనవళ్ళకు పాలకోసం డబ్బులు చేతిలో పట్టుకుని గంటలకొద్దీ అంగళ్ళ ముందు నిలబడవలసి వచ్చింది.. ఇలాంటి ఊహించలేని పరిస్థితిని తెచ్చుకున్నాం. మా చిన్నతనంలో ఇలాంటి రోజులు ఉన్నట్టు లేదు.

మేము ఈ రోజు పిల్లల్లా బయట తిన్నవాళ్ళమూ కాదు.

ఇంట్లోనే పెరిగినవాళ్ళమూ కాదు.

ఇంట్లో జొన్న రొట్టె, వెల్లుల్లి కారం, వేయించిన పప్పులు, ఆ పప్పులు ఎంత ఉంటాయో అంత వెన్న వేసి తినడానికి మా అమ్మ ఇచ్చేది. పచ్చి వెన్న తింటే కడుపుకు చల్లదనం. కడుపు నొప్పి రాదని అనేది. రొట్టెలకు వెల్లుల్లి కారం పూస్తే అది ఎంత ఉంటుందో



అంత నెయ్యి అమ్మ వేసేది.

నాగుల చవితి పండుగ సమయంలో అయితే పెద్ద కుండ నిండా శెనక్కాయల ఉండలు, నువ్వుల ఉండలు, వేరు శెనక్కాయల ఉండలు, ఇలా వేరు వేరు రకాల ఉండలు కట్టి కుండలలో భద్రపరిచేవారు.

ఇంట్లో కట్టిన గేదెపాలతో చేసిన వెన్న, నెయ్యి కుండల నిండా ఉండేది. పులుసు అన్నంలో తేలాడేలా నెయ్యి పోసుకుని తినేవాళ్ళం. అంతతిన్నా ఆరోజుల్లో కడుపులో ఏలాంటి ఇబ్బందులు కలిగేవి కావు, ఇప్పుడు కొంచెం ఎక్కువ నెయ్యి తింటే చాలు పొట్ట చెడిపోతుంది.

అప్పట్లో పాలు, నెయ్యి తినాల్సిందే.

ఒకసారి గేదె ఈనేంత వరకూ మరో గేదెపాలు, పెరుగు, వెన్న, నెయ్యి, అమ్మకుండా కడుపుకు తింటే మూడేళ్లు కడుపు నొప్పి రాదని చెప్పి నాన్న బలవంతంగా మా చేత తినిపించేవారు.

అలాంటి గేదె పాలు, పెరుగు, వెన్న, నెయ్యిలతోపాటు, మా తల్లిదండ్రుల మమతల ఒడిలో మేము పెరిగాం. అందువల్లనే నేను ఆరోగ్యంగా ఉన్నాను.

**కుంటి సాకు చెప్పి బడి మాన్పించారు**

అప్పుడు నేను ఏడవ తరగతి చదువుతున్నాను. మా ఊరి పాఠశాల వదిలి వేరే ఊరుకు వెళ్ళలేదు. ఏడవ తరగతి తరువాత కూడా చదవాలనే కోరిక ఉండేది. కానీ నాన్న నా కోరికకు సహకరించలేదు. ఇందులో ఎలాంటి స్వార్థం ఉండలేదు. ఇంటి పరిస్థితుల వల్ల తప్పనిసరిగా అలాంటి నిర్ణయం తీసుకున్నాను.

నాకు అప్పుడు పదమూడేళ్ళు. అప్పట్లో మాకు పదమూడు ఎకరాల పొలం ఉండేది. వ్యవసాయం చేసేవారు ఎవరూ ఉండలేదు. నేను, అన్నయ్య, తమ్ముళ్ళు బడికి వెళ్ళేవాళ్ళం. నన్ను మాత్రమే ఎందుకు బడి మాన్పించారో నాకు స్పష్టంగా తెలియదు. అయితే ఆ వయసులోనే ఖాళీగా ఉన్నప్పుడు పొలం పనులు, ఇంటి పనులు చేసేవాడిని.

ఇంట్లో ప్రదర్శన కోసం జరుగుతున్న ఆటల అభ్యసన సందర్భంలో అభ్యసనానికి కావలసిన బొమ్మలను సందూకం నుంచి, పెట్టెల నుంచి తీసిపెట్టే పనిలో ముందుండేవాడిని. అంతేకాకుండా ఇంటికి వచ్చే మేళం(కళాకారుల బృందం) సభ్యుల అతిథ్య సేవల బాధ్యతలను చూసుకునేవాడిని. బహుశా ఈ పనులను గుర్తించిన నాన్న నన్ను బడి మాన్పించి ఉండాలి.

బడిని వదిలి పెట్టిన ఆరంభంలో అంత దుఃఖం కలగలేదు.

మాకు చాలా భూమి ఉండేది. చుట్టుపక్క రైతుల్లా నేనూ మంచి పంటలు పండించాలనే పట్టుదల, కోరిక కలిగాయి. రెండు మూడేళ్ళు నేను, అన్నయ్య, నాన్న, అమ్మ, అందరం కష్టపడి వ్యవసాయం చేశాం. అందులో నేను చేసే పనే ఎక్కువ. అన్నదమ్ములు బడికి వెళ్ళడానికి మునుపే ఉదయం పనులు చేసిన తరువాతే బడికి వెళ్ళేవారు. అనుకున్నట్టుగానే పంట బాగా పండింది. అప్పుడే మళ్ళీ తొమ్మిది ఎకరాల భూమి కొనుక్కున్నాం.

నేను బడి మానేసి రెండేళ్ళు గడిచి ఉండాలి. అప్పుడు మళ్ళీ బడికి వెళ్ళాలనే ఇచ్ఛ కలిగింది. పొలంలో పనులు చేస్తున్నప్పుడు ఒకసారి నా మనసులోని కోరిక చెప్పాను. నా మాటలు వింటుండగానే నాన్న కోపగించుకున్నారు. పెద్దగొంతుతో 'వయసు పెరిగిన తరువాత బడికి పోతారా?' పెద్దలు 'చదువ ఒకపాలు, బుద్ధి ముక్కాలు' అంటారు. బుద్ధి ఖర్చు చెయ్. అభివృద్ధిలోకి వస్తావని అన్నారు.

అంతేకాకుండా మా ఇంట్లో మా అత్త కూతురును సాకుతున్నారు.

మేము పుట్టడానికి ముందే మా అత్త అంటే మా నాన్న అక్క భర్త చనిపోయిన తరువాత మా ఇంటికి వచ్చింది. వచ్చిందని అనటం కంటే మా నాన్నే పిల్చుకొచ్చారు. ఆమె చాలా మంచిది. నెమ్మదైన మనిషి. ఇంటి పనులలో ఆమె మా అమ్మకు చాలా సహాయం చేసేది. ఆమె మా ఇంట్లో ఉంటున్న కారణంగా ఆమె కూతురు కూడా మా ఇంట్లోనే ఉండేది. ఆ అమ్మాయితోనే నాకు పెళ్ళి జరిపించాలని నిర్ణయించుకున్నారు.

ఆ నాటి కాలంలో పిల్లలు పుట్టినపుడే ఆమె ఫలానా వాడి భార్య, ఫలానా ఇంటివారి కోడలు అని నిర్ణయించే పద్ధతి కుటుంబ సంబంధాలలో ఉండేది. నేను బడికి వెళ్లాలనే కోరిక బయటపెట్టినపుడు ఆమె ఆరవ తరగతి చదువుతుండేది. "నీ భార్య చదువుతోందికదా? నువ్వు చదివినా ఒకటే, నీ భార్య చదివినా ఒకటే. ఆ సర్టిఫికెట్ నీకే చెందుతుంది కదా?" అని కుంటిసాకులు చెప్పిన 'ముసలోడు' (రామనగౌడు, ఇతర సోదరులంతా తమ తండ్రిని ఇంట్లో ప్రేమగా 'ముసలోడు' అని పిలిచేవారట. ఈ పేరుతో మొదట తమ తల్లే పిలిచేదట. అందువల్ల మాకూ అలా పిలవటమే అలవాటైందని రామనగౌడ అంటారు.)

అయితే ఆ ముసలోడి మనసులోని కోరికనే వేరుగా ఉంది.

తన తదనంతరం ఈ 'కొయ్యబొమ్మల ఆట'ను ముందుకు కొనసాగించే చేవ ఇతనిలో(నాలో) ఉందని ఆయన గుర్తించారు. ఈ అభిప్రాయాన్ని ఎన్నోసార్లు తన సహచరుల దగ్గర, మేళం వారి దగ్గర చెప్పుకున్నారు. పిల్లలందరూ బడికి వెళితే వంశపారంపర్యంగా వచ్చిన ఈ కళను ప్రదర్శించేవారు ఎవరు? అనే భయం నాన్నకు ఉండేది.

అందువల్లనే నన్ను బడికి పంపడానికి ఇష్టపడలేదేమో?

నేను మళ్ళీ బడికి వెళతానని చెప్పటంతో కాబోలు మూడు నాలుగునెలల తరువాత తనతోపాటు ఆటలు ఆడటానికి (ప్రదర్శించడానికి) పల్లెలకు పిల్చుకుని పోవటం మొదలుపెట్టారు.

నా కళ్ళముందు కొత్తలోకం కనిపించటం ప్రారంభమైంది!

(తరువాయి వచ్చేసంచికలో...)

డా॥ పి.శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# అమ్మనుడికి పట్టం కట్టిన ఎ.కె.రామానుజన్

## ఉద్యోగ, సాహిత్యరంగాలు మారినా వలసవాసన వదలలేదు

**ఆంగ్ల** భాషను బోధించే అట్టపతి కృష్ణస్వామిరామానుజన్, తను చిన్ననాటి నుండి విన్న తమిళ కన్నడ జానపద సాహిత్యానికి, చికాగో విశ్వవిద్యాలయానికి వెళ్లి, ఆంగ్లంలోకి చేసిన అనువాదం Folktales from India. ఈ కథా సంకలనమే కాక, జానపదుల భారతీయుల దృక్పథాన్ని, ప్రత్యేకతను విదేశీ విచార ధారతో పోలుస్తూ అతడు రాసిన వ్యాసాలను సమీక్షిస్తూ ప్రసిద్ధ పాశ్చాత్య పండితులు రాసిన పరిచయంతో విజయ్ ధార్వాడ్ కర్ తెచ్చిన సంకలనం The collected eassays of A.K.Ramanujan..ఇలా మన జానపద సంప్రదాయాలకు అంతర్జాతీయ ప్రాసంగికత తెచ్చిన రామానుజన్ ధన్యుడు. ఈ సాహిత్యం సాహిత్యగాళ్ళకు వినిపించకపోవచ్చు, కానీ ఈ సంప్రదాయాలు రూపం మార్చుకుంటూ కొనసాగుతూనే ఉన్నాయి.

'Is there Indian way of thinking' లో జానపదుల జ్ఞానం దేశకాల సాపేక్షమని వివరించిన తీరు, చరిత్ర పరిశోధకురాలు రమేలా థాపర్. మన చారిత్రక స్పృహను స్పష్టం చేసిన తీరును గుర్తు తెస్తుంది. where mirrors are windowsలో, కథ చెపితే బరువు దించుకున్నంతగా మనసు తేలికౌతుందని, విన్నవారికి తమను బంధించిన గోడలు కూలిపోతాయనే ఓదార్పు దొరుకుతుందని (ఈ వ్యాసం కొంత ఆంధ్రజ్యోతిలో ఒక వ్యాసంలో ద్రావిడ విశ్వవిద్యాలయం లో ఇంగ్లీష్ ఆచార్యులు బి.తిరుపతిరావు అనువదించారు) Food for thought వివిధ సందర్భాలలో మన వంటల గూర్చి మెదడుకు మేత, జానపదులవి కోరదేవతలని, నాగరికులవి స్తన దేవతలని అతడు విడమరిచి చెపుతాడు. మరో వ్యాసం పట్టణం,.గ్రామం,మన్యంలలో వైవిధ్యాన్ని, వైరుధ్యాన్ని రూపిస్తుంది..జానపద రామాయణ ,భారతాలను, మనం బి.రామరాజు సేకరించిన సాహిత్యం, వ్యాసాలలో కూడా చూడొచ్చు. దీనిలో మూడువందల రామాయణాలు వ్యాసాన్ని రచయిత్రి సత్యవతి గారు అనువదించగా హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించింది. పాశ్చాత్య సాహిత్య విమర్శలో చర్చించే ఈడిపస్ భావనలు భారతీయ కథలలో ఎలా కనిపిస్తున్నాయో వివరించటం ఒక విశిష్టమైన వ్యాసం. ఈ వ్యాసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆయన చదువుతుంటే నేను విన్నాను. ఆయన ఆంగ్లంలో చాలా కవితలు రాసారు.వాటితో పాటు, ఇటువంటి జానపద సాహిత్యంమీద రామానుజన్ వ్యాసాలు ఆంగ్ల సాహిత్యవేత్తలు ఎంత బోధిస్తున్నారో తెలియదు కాని ఆయన మీద ఇటీవల ఒక పుస్తకం రాసిన స్పానిష్ యువకుని ప్రసంగం హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో విన్నాను. రామానుజన్ రచనలు తెలుగులో వస్తే తెలుగు జానపద సాహిత్యాన్ని విశ్లేషించే పద్ధతులకు, ఎంతో ఉపయోగపడుతుంది.






**సమష్టి నుండి వ్యక్తినిష్టంగా మారిన రచనలు..**

అయితే, జానపద సాహిత్యంలో భారత కథలు సమష్టిచేతనను మేలుకొలుపుతుంటే, భారతం మీద ఇరావతి కార్వే, భైరప్ప, ప్రతిభా రే, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచనలు, పాత్రలు, ముఖ్యంగా ద్రౌపది చుట్టూ వ్యక్తినిష్టంగా, ఐదుగురితో ఆమె కోరికల మధ్య తిరుగుతాయి. ద్రౌపది, ఆనాటి దాసీవ్యవస్థలో స్త్రీలను ఒక వస్తువుగా చూసే పురుషాధిపత్యాన్ని ధిక్కరించటానికి, అన్ని పరిస్థితులను, షరతులను తట్టుకుని, ఒప్పుకుని, తిక్కన చిత్రించినట్లు 'రక్కసి తాల్మి'తో 'చిచ్చొడింగట్టినయట్లు', బతుకుబండిని నెట్టుకొచ్చి జాతికొక హెచ్చరికగా నిలిచింది.. మృచ్ఛకటికంనుండి రాయలసీమలో జరిగే గంగజాతరలో తనను బలవంతంచేసే దొరను, వాడి మారువేషాలను కనిపెట్టి వెంటాడే గంగ, మహిషాసురుని నవరాత్రులలో సంహరించిన దుర్గను తలపిస్తుంది. ఆ

వీరరసంలో ఊగిపోతాం తప్ప, ఆపాత్ర, సెక్సప్పీల్ వైపు మనదృష్టి పోదు.. భైరప్ప మరో రచన 'వంశ వృక్షంలో కథానాయకుడికి చివరలో తను తండ్రికి కాక వేరొకరికి పుట్టినట్లు తెలిసి మనసు వికలమౌతుంది. ఇలా మొరటుగా కాక, తన తండ్రికి బ్రహ్మోపదేశం ఇచ్చింది ఒక దళితుడు అనితెలిసి జ్ఞానోదయం అయింది అని మలుపు తిప్పితే బాగుండేది. అటువంటి కథలు ఎన్నో ఇతిహాస పురాణాలలో, జానపదులలో ఉన్నాయి. రవీంద్ర టాగోర్ ఇంటా బయటా, గోరా; ఉన్నవ మాలపల్లి, తిరుపతి వెంకటకవుల పాండవోద్యోగ విజయాలు,గయోపాఖ్యానం, రామాంజనేయయుద్ధం, కొండ, నదులను పాత్రలుగా మలిచిన వసుచరిత్ర భావసంఘర్షణను అద్భుతంగా చిత్రించి మనసును ఊపేస్తాయి,

షేక్ స్పియర్ టెంపెస్ట్ నాటకాన్ని, ఆఫ్రికన్ రచయితలు వలస ప్రభావం నుండి బయటపడటానికి మలుచుకున్నారు. ఈ నాటకంలో కథానాయకుడికి ద్వీపాంతర శిక్ష లాంటిదేదో విధించారు.అతడు ఆ ద్వీపంలో కొందరిని లోబరుచుకుంటాడు. వారికి, బానిసత్వం నుండి విడుదల చేసి, రాజ్యాన్ని అప్పగించి వెళతానని ఆశపెడతాడు. కాని చాలామంది ఎదురుతిరుగుతూనే ఉంటారు. స్వతంత్రం వచ్చాక బానిసలు ఉద్యోగులు, నాయకులుగా మారితే, బీదసాదలు తిరుగుబాటు చేస్తూనే ఉంటారు.ఈ కథ ఈ నాటికీ ఆఫ్రికన్‌లకు స్ఫూర్తి నిస్తుంది. అక్కడ కూడా కొందరు యూరోప్ పాలన ప్రభావం నుండి మాత్రమే కాదు., అంతకుముందు ముస్లిం పాలకుల ప్రభావం నుండికూడా బయటపడాలని వాదించే చిన్వేజు లాంటి వారున్నారు.వారిని టార్జాన్ యుగంలోకి తీసుకుపోతున్నారని ఓలే సోఎంకా వంటివారు విమర్శిస్తుంటారు. ఇతరభాషలలో ఉన్న ఆఫ్రికన్ సాహిత్యం బోధించాలిగాని, ఆ భాషల చరిత్ర సాహిత్యం మనకు ఎక్కించే ప్రయత్నం తగ్గించాలని గుగి పోరు పెడతాడు. ఈ దశలలో రచనలను అమెరికాలో సాహిత్యం బోధించే హోమీ కే బాబా (natives)స్థానికులు, (setllers)స్థిర పడినవారు, (hybrids)అంటుమొక్కలు, విత్తనాలు, కళలు, (mimics) కాపీరాయుళ్ళుగా పేర్కొంటాడు. బెంగాలీ దీపేశ్ చక్రవర్తి అటు తన మాతృభాషలో, ఆంగ్లంలో అధోజగత్ సహోదరుల ఉద్యమ సంప్రదాయాలకు వ్యాఖ్యాతగా రాణిస్తున్నాడు. ప్రపంచమంతా ఇంత చర్చ జరుగుతుంటే, తెలుగులో మాత్రం, తీర్థం తీర్థం, ప్రసాదం ప్రసాదంగా అనువాదాలు, సిద్ధాంతాలు, రచనలు, బోధనలు సాగుతున్నాయి. ఎదో గుంపుకు చేరబడి చతికిలపడుతున్నాయి. జీసస్ కిచ్చేది జీసస్‌కు, సీజర్ కిచ్చేది సీజర్ కు అన్నట్లు, తము చేసే ఉద్యోగాలు ,చేసే ప్రసంగాలు రచనలు దేని దోవ దానిదే అన్నట్లు వేషం రక్తికట్టిస్తున్నారు.

హరితవిప్లవం వర్ధిల్లిన పంజాబ్, హర్యానాల రైతుసంఘాలు కదంతొక్కుతుంటే, అన్నపూర్ణ అయిన తెలుగునాట సంఘాలు పార్టీలకు తోకాడిస్తున్నాయి. ●

కవిత

## మన తెలుగు

తెలుగంటే మన భాష
తెలుగంటే ఘన భాష
వేలాది యేండ్లుగా వెలుగునిచ్చిన భాష
బౌద్ధ విహారమ్ము -చాళుక్య ద్వారమ్ము
కాకతీయుల కోట - కృష్ణరాయల బాట
కీర్తి శిఖరాలుగా వ్యాప్తి చెందిన భాష

కడప కలమళ్లలో కంకులేసిన భాష
అద్దంకి సీమలో ముద్దులొలికిన భాష
బెజవాడ నగరాన ప్రజలు మెచ్చిన భాష

నన్నయ గంటమై
తిక్కన్న కంఠమై
పాల్కురికి సోమన్న పదమైన జనభాష
పోతన్న కవితలో పులకరించిన భాష
వేమన్న వేదమై- త్యాగయ్య నాదమై
గురజాడ - గిడుగుల - జనవాణి సాక్షిగా
ఉద్యమ స్ఫూర్తితో ఉరకలేసిన భాష

మదుర తంజావూరు- మొరస నాడుల్లోన
వీనుల విందుగా విస్తరించిన భాష
చెన్నపురి నగరాన వన్నె కెక్కిన భాష
కొంగునాడంతట చెంగు చెంగున సాగి
రంగూను నగరాన పొంగులెత్తిన భాష

సురవరం మాటగా
సుద్దాల పాటగా
మన తెలంగాణలో మారు మ్రోగిన భాష
కర్నాటకము నుండి ఖండాంతరాల్ దాక
కడలి కెరటమ్ముగా కదలి సాగిన భాష.

**-మేడిశెట్టి తిరుమలకుమార్**
94835 02333

**కవిసంధ్య, వింజమూరి అచ్చుతరామయ్య స్మారక వచన కవితల పోటీలు - 2021**

మార్చి 21 ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవిసంధ్య, వింజమూరి అచ్యుతరామయ్య స్మారక సమితి సంయుక్త నిర్వహణలో వచన కవితల పోటీలను నిర్వహిస్తున్నాం. మొదటి బహుమతి రూ. 2,500/-, రెండవ బహుమతి రూ.1500/- మూడవ బహుమతి రూ. 1000/-. ప్రోత్సాహక బహుమతులు 5 కవితలకు ఒక్కొక్కదానికి రూ. 500/- పోటీలో పాల్గోనే కవులు తప్పక కవిసంధ్య చందాదారులై వుండాలి. కవితల ఇతివృత్తం వర్తమాన సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేదైవుండాలి. కవితలను సాధారణ పోస్టు రిజిష్టర్ పోస్టు, స్పీడు పోస్టు, కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి. చివరి తేది15ఫిబ్రవరి 2021. బహుమతులు 2021 మార్చి 21 జరిగే కవితా దినోత్సవ సభలో ప్రదానం చేయబడతాయి. **వివరాలకు** ఫోను: 9440155987

హోసూరు తావు నవల

అగరం వసంత్
094883 30209




3

“**ఏమి** సిక్కనోనికి సద్ది సిక్కితే తిరిప్తిగంటా తిరిగి చూడకుండా తింటా పోయెనంటా అట్లా నాయాళ్లప్పా ఈ ఉడుకు (వయసు) చిన్నోళ్లు. ఊరి ముందర రచ్చతావ కూకొని పుంగు మాటలు చెప్పేదాంట్ల వీళ్లని మీరినోళ్లు ఇంగెవురు లేదు” వెక్కాసముగా అనె పిల్లన్న తాత.

“వాళ్లకి దానికన్నా పంగేముంది, రాగులు, వడ్లు వచ్చి ఇండ్లు చేరిండాయి కదా, తినేది, తిరిగేది, ఆరట్లు కొట్టేది ఇదే పని” వక్కాకు నమలతా నారాయణన్న అనె.

ఆ పక్కనింకా ఆడబిడ్లు నడస్తా వస్తా వుండారు. వాళ్లను చూస్తానే ఉడుగు చిన్నోళ్లంతా కోతులు, ఉడతలు అయి మాన్లు ఎక్కిరి. పువ్వులు, కాయలు పీకి ఆడబిడ్లపైన వేసిరి.

ఇది కోతుల పనే అని ఆడబిడ్లు నగుకొని పోతావుండారు.

ఇది చూస్తానే రంగన్న తాతకి రేగిపోయె. వీళ్లకి ఎట్లన్నా బుద్ది చెప్పాలని యోచన చేస్తావుండె.

“తాగతా నీయబ్బ తాగతా, నీ సొమ్ము తాగతా నా సొమ్ము తాగతా ఎవడప్పా సొమ్మైనా ఎంతైనా తాగతా” పాట పాడతా వూగుకొని వస్తా వుండాడు కాపోళ్ల మునిగాడు.

“సారాయి సొర్గము సేద్యము నరకము రామసెంద్రా” అంటా ఎదురు పద్యము పాడి వాన్ని తన అద్దులా పెట్టుకొనె పిల్లన్న తాత.

ఇద్దరూ చేరి పనికివచ్చే పద్యాలు, పనికిరాని పద్యాలు పది పాడిరి.

“ఈ ఉడుకు చిన్నోళ్లు వుండారు చూడు మునిగా వీళ్లకి అద్దుపొద్దు లేదు. వాళ్లు ఆడిందే ఆట పాడిందే పాట. వీళ్ల రావిడికి వూరిలా వయసు ఆడబిడ్లు ఎవురూ పారాడేనట్లలే. అబుడే మీ వీదినింకా ఇద్దరు ఆడబిడ్లు వచ్చిరప్పా. వాళ్లను అడ్డమేసి, జడలు ఈడ్చి ‘గేలి’ చేసిరప్పా” అంటా మునిగాన్ని కొండ ఎక్కించె.

అంతే మునిగానికి ఏడలేని కోపము వచ్చేసె. రచ్చతాకి పోయె.

“రేయ్! ఎవడ్రా అబుడే మా వీది ఆడబిడ్లని గేలి చేసింది. మీ ఇండ్లలా ఆడబిడ్లు లేరేంరా. మీ అక్కచెల్లెల్ని ఎవరైనా గేలి చేస్తే మీరు కలకుండా వుంటారా. మీకు సిగ్గు, శరము లేదేంరా, మిమ్మల్ని కాదురా మిమ్మల్ని పుట్టిచ్చిన వాళ్లని అనాలిరా” అని నోటికొచ్చిన మాట అని పెట్టేసె.

అందాతలికే ఊరివాళ్లు కొందరు వచ్చి, సమాచారము తెలుసుకొని తిట్టుమీద తిట్టు తిట్టి పెట్టిరి.

అంతే బిర్నా ఈ సమాచారము ఉడుకు చిన్నోళ్ల అమ్మలకి తెలిసిపోయె.

కొందరు అమ్మలయితే ఏమి జరిగె అని తెలుసుకోకుండానే వాళ్ల చిన్నోళ్లని పరకల్లా వేసిరి, అది చూసినంక పిల్లన్న తాతకి పరమాన్నము తిනినంత ఆనందము ఆయె. నగుకొని ఇంట్లోకి వెల్లీసె.

ఆ పొద్దునింకా ఉడుకు చిన్నోళ్లు ఊరి వెనక వుండే చింత మాను తావుకి మకాం మార్చిరి.

“ఆ తాగుబోతు మునిగాని నింకా మనము పూర్లా మానము పోగొట్టుకొంటిమి. వానికి ఈపొద్దు సరైన పూజ చేయాల” అని చిన్నోళ్లంతా వాడు వచ్చే దోవలా నిలిచిండారు.

వాడు వచ్చి మందుగుండు తీసుకొని పక్కలా వుండే మామిడి మాను తావ తాగేకి సురువు చేసె.

చిన్నోళ్లంతా మొకాలకి తువ్వాలు చుట్టుకొని వాని పక్కలా ఒగొగరే చేరిరి.

“మొన్న మన పక్కుర్లా ఆడబిడ్డని గేలి చేసిందానికి ఆవూరి జనాలు వాళ్లకి బాగా పూజ చేసిరంట” అంటా మాట్లాడిరి.

ఆ మాట వింటానే మునిగానికి రెక్కలకి నీళ్లు వేసినట్ల ఆయె. “అట్ల చేసింది ఎవరనుకొంటా వుండారుపా నేనే” వీరావేశముగా అనె.

“నీ అట్ల అడిగేవాళ్లు చేసేవాళ్లు వుంటే ఊర్లు బాగు పడతాయినా” అంటా పురమాయిచ్చిరి. బాగా తాపి తినిపిచ్చిరి.

“అనా నువ్వు ఎబుదు చూసినా ఈడే వుంటావు కదా, పూర్లా నడిసే విషయాలు నీకెట్లా తెలుస్తాయనా?” సందేహము పడతా ఒగ చిన్నోడు అడిగె.

“నీ మాట నిజమే పా, నాకెట్ల తెలుస్తాది. నేను ఎబుడూ మాదిరిగానే నాపాటికి నేను పోతా వుంటిని. మావూర్లా వుండే పిల్లన్నతాత నాకు అసలు విషయము చెప్పె” అనె.

“ఓ ఇదీ సమాచారము, మేము నిన్ను అకలాయముగా తంతావుంటిమే” అని మనసులా అనుకొని ఆడనింకా వచ్చిరి. పిల్లన్న

తాతపైన కన్నేసిరి.

ఆపొద్దు మావూర్లా నాగులకు కాయలు కొట్టే పండగ. దీన్ని ఇంతకు ముందర టెంకాయల పండగని, ఈ నడమ వినాయకచవితి అని అంటావుండారు.

ఆడోళ్లంతా తట్టలా పూజ సామాను, అంటిపండ్లు, సేపుకాయలు దోసకాయలు, జొన్నెన్నులు ఎత్తుకుని నాగులబాయి తావ వుండే నాగులకి పూజ చేసి నానిన బీము, నూగులు, బెల్లము, కలిపిండే ప్రసాదము అందరికీ ఇస్తా వుండారు. ప్రసాదము తీసుకొనేకి పిల్లన్నతాత కూడా వస్తా వుండాడు.

అది చూసిన ఒక చిన్నోడు "తాతకి ప్రసాదము కావాలంటకా" అని అడిగె. ఆయమ్మ పిడికిలి నిండా పట్టి ఆ చిన్నోని దోసిల్లా పోసె.

అబిటికే వీళ్లు తెచ్చి పెట్టుకొని వుండే జాపాళము విత్తనాల్ని (వేరుశెనగ విత్తనాల్లా వుంటాయి. వీటిని తింటే విపరీతంగా విరేచనాలు అవుతాయి) కలిపి తాతకి ఇచ్చిరి. తాత నగతా తీసుకొని బాగా తిని చేతుల్ని నాకి పెట్టేసె.

ఉడుకు చిన్నోళ్లంతా నగుకొని వెలెసిరే. పిల్లన్న తాతకి బేదులు నిలస్తాలేదంట, సర్కారి ఆసుపత్రిలా అయ్యేలేదనేసిరంటా, బెంగుళూరుకి పోయిండారంట అనే సుద్ది ఊరువూరంతా పాకిపోయె.

"అయ్యో! తాత సావాలని మేమిట్ల చేయలే. తమాషాకి చేస్తిమి. తాత బతికి బాగుపడాలా" అని ఉడుకు చిన్నోళ్లంతా దేవునికి మొక్కుకొనిరి.

వీళ్ల మొక్కులు విని ఆ దేవుడే తాతని కాపాడినో, లేదా డాక్టర్లు దేవుళ్లయి తాతని కాపాడిరో కాని పిల్లన్నతాత బతికె. కాని సాకన్న తాత ఎదనెప్పి వచ్చి సచ్చిపాయె.

ఊరువూరంతా సాకన్నతాత ఇంటితావ గుమిగూడి వుండారు. పెద్దోళ్లంతా వచ్చి పీనిగమింద పువ్వుల ఆరాలు వేసి కాళ్లకి దండం పెట్టి పోతావుండారు. సాకన్నతాత సావుసుద్దిన్ని చెప్పేకి ఎవురెవురు ఏయే వూర్లకి పోవాలని గౌడు చెప్పతా బస్సు చార్జీలకి దుడ్లు ఇస్తా వుండాడు.

పొద్దప్పుడు పొద్దు మునిగింది. సెంద్రుడు చూసినట్లుండాడు. ఆకాశములా గూరాడతా పైపైకి వస్తావుండాడు.

"వీళ్లకి ఎపుడూ వచ్చేది పోయేది ఒగే పంగ (పని). అదే పంగ. వీళ్లకి వేరే పంగ లేదేమో, ఎపుడూ చేసిందే చేస్తారు. కాని మనుషులు అట్ల కాదు. పుట్టినబుటినింకా చచ్చేవరకు వేరే వేరే పంగలు ఎన్నెనో పాట్లు పడాలా, అయినా మనుషులు ఏమిటికి ఈ పంగ చేసేది. ఆడేమన్నా పంగ లేకుండా ఈడికి వచ్చిరా? లేదా ఈడినింకా ఆడేమన్నా పంగ చేసేకి పోతావుండారా? ఆ పొద్దునింకా ఈపొద్దు కంటా ఎందరో జనాలు అదెందరో జనాలు.అదేమిటికి వచ్చిరో. అదేడకి పోయిరో. వచ్చేది పోయేది. ఇదే పంగ. ఒగే పంగ. ఆ వూరోళ్లది ఈ వూరోళ్లది. ఆ దేశమోళ్లది ఈ దేశమోళ్లది. ఇదే పంగ, ఇదే పంగ. ఏమిటికి వీళ్లకి ఈ పంగ ఏమిటి కోసరము వీళ్లు పంగ చేసేది. ఎందరప్పా! ఇబుటికి ఎందరప్పా.. పాతలెక్క ఎంతని లెక్క తీసేకి అవుతుంది? కొత్తలెక్క కత ఇంతని ఇట్లని కనిపెట్టేకన్నా అవుతుందా? సాములమని, దేవుళ్లమని, కీర్తులు రాసులు పోసుకొన్న వాళ్లంతా పోయిరి. ఏమీ లేనోళ్లూ పోయిరి. ఇంగెవుడు, ఈ పంగ ఏమని చెప్పేది పంగ గుట్టు కనిపెట్టేది ఎవరు, అదెవరో" ఏకనాదము



వాయిస్తా ఎర్రన్న, ఏమేమో మాట్లాడతా వుండాడు.

రాత్రి తొమ్మిదిగంటల పొద్దు కావస్తుంది. నందిమంగలం, తోటగిరి, పాతకోటల నింకా బజన గుంపోళ్లు వచ్చి బజన సురువు చేసిరి.

"జీవా నీవిది కానవా నువ్వుండే ఇంటి మర్మము ఎరుగావా ॥జీ॥
తొమ్మిది వాకిండ్ల కొంప దుఃఖములకిది మూలదుంప
ఎంచితే కలగూరగంప – తెలుసుకో నీ తాడు తెంపా ॥జీ॥
డెబ్బదిరెండువేల నాళ్లు అరువది తొమ్మిది కీళ్లు
తోక పురుగులు మూడుపాళ్లు నిండి వున్నది నీచునీళ్లు ॥జీ॥
మలమూత్రముల కుంట మాంసమునెత్తూరు పెంట
మురికిపేగుల ముద్దుజంట కూడినది మలకోవి తుంటా ॥జీ॥

కైవారము నారాయణ తాతగారి తత్వాలు పాడతా వుండారు. కొంతసేపు పాడినంక కొందరు 'టీ' ఇంకొందరు నీళ్లు తాగి తిరగా పాడేకి సురువు చేసిరి.

"నీవూరు పేరేమి జీవయ్య నీవు ఎందూకు వస్తివి జీవయ్యా
నీకు బంధువులెవరు జీవయ్య – నీ చందాము ఏమందు జీవయ్యా
అన్నాలుంటేనేమి జీవయ్య బంధు బళగముంటే నేమి జీవయ్యా
పారాడి పారాడి జీవయ్యా నీవు కుంటుచూనున్నావు జీవయ్యా
కర్మబంధనాలు జీవయ్యా నిన్ను కష్టపెట్టునయ్య జీవయ్యా
దుర్మార్గములు విడచి జీవయ్యా నీవు సన్మార్గమున వుండు జీవయ్యా
ఇహములోనా బుట్టి జీవయ్యా గురుని మహిమ కనలేవు జీవయ్యా
పుట్టినందుకు ఏమి జీవయ్యా నీకు పుణ్యఫలమున్నాది జీవయ్యా
మోహపాశములందు జీవయ్యా నీవు మునుగుచున్నావు జీవయ్యా
ఈ మురికిదేహమందు జీవయ్యా నీవు ఎట్లావున్నావు జీవయ్యా
తనువు విడచినీవు జీవయ్యా ఇక ఎందు పోయేవు జీవయ్యా
తనువుతో ఒకమాట జీవయ్య నీవు చెప్పకా పోవలదు జీవయ్యా
నీవున్నా పురమునా జీవయ్యా బేరినాదా మృదంగాము జీవయ్యా

*ఓంకార ప్రణవము జీవయ్యా ఘణఘణ నాదములు జీవయ్యా*
*నీవెంతో మోసకారి జీవయ్యా ఇకను నమ్మతగదూ నిన్ను జీవయ్యా*
*సంసారబంధనా జీవయ్యా – నీవు సరిచూడగలేవా జీవయ్యా*
*నిన్ను నమ్మివుంటి జీవయ్యా నన్ను విడనాడిపోయేవు జీవయ్యా*
*బ్రహ్మాండపురమునా జీవయ్యా నీవు బయలుదేరవయ్యా జీవయ్యా*
*రామాకృష్ణార్యులు జీవయ్యా గురిజూపిరి గుట్టెల జీవయ్యా*
*ఆంజనేయదాసు జీవయ్యా గురుని మరువడు మనసునా జీవయ్యా"*

ఈకిత ఆంజన్నప్ప స్వాముల తత్వము పాడిరి. ఆమీట(తర్వాత) "కైవారం తాతగారి పాదాలకు గోవింద. సీకనపల్లి ఆంజనప్ప పాదాలకి గోవింద. అరసపల్లి దేవప్ప సామి, లక్కూరు కిష్ణసామి, బేరిక బుట్టప్ప సామి. చూడగొండపల్లి రామలింగప్ప సామి, దొడ్డి వెంకటగిరియప్ప సామి పాదాలకి గోవిందా గోవిందా" అంటా గోవిందులు పెట్టిరి.

నేను గోవిందులు పెడతా అదెబుదు కన్ను మూసితినో పొద్దిన కన్ను తీసేతలికి ఇంట్లో వుండా.

తాత సావాసగాళ్లు, సొంతమోళ్లు వూరువూరంతా నిండిపోయి వుండారు. తాత చేసిన మంచిపనుల గురించి మాట్లాడతా వుండారు.

"మనిషి పుట్టేతబుదు ఉసురుతో పుడతాడు. పోయేతబుదు దాన్ని విడచి పోతాడు. నాది నేను అని ఒళ్లుతో తిరిగే మనిషి కడకి దాన్ని విడచి పోతాడు. అది తెలుసుకోకుండా ఒకర్ని ఒగరు కొట్టుకొనేది తిట్టుకొనేది. జాతిపేరులా కొందరు, నీతిపేరులా ఇంకొందరు. ఇంకా దేవుడు, దెయ్యమని జనాలని ఏమారిచ్చి (మోసంచేసి) సంపాదిస్తారు. సచ్చేతబుదు ఏ సంపద వస్తుంది. ఏ సొంతమోళ్లు వస్తారు. నిజానికి మనిషి సంపాదించాల్సింది నలుగురు మనుషుల్ని. తను పోతే 'పాడి' మోసేకి నలుగురు పోటీ పడతా వస్తే వాడే గొప్పమనిషి" అంటా గుర్రన్న గుంపుజనాలకి చెప్పతా వుండాడు.

ఆయప్ప మాటలకి కొందరు తలలు గుంకాయిచ్చి ఏదో గేణము (ఆలోచన)చేస్తా వుండారు. అది గూబగేణమా ఘనమైన గేణమా నాకైతే తెలీలా.

ఇంకొందరు మొకాలు మాడినట్ల, సోడ.

మొకాలు పెట్టుకొని నిలచిండారు. రేపు మనకి ఇదేగతి వస్తుందనేమో... మేమూ సావాలనేమో... దిగులనుకొంటా...

"సావంటే నాకు దిగులు లేదు" కిట్టన్న గట్టిగా అనె.

"అది వొచ్చినబుదు తెలుస్తుంది అన్నకి" పిట్టన్న అనె.

"సావు వొచ్చినపుడు మనకి గేణము వుంటే కదా తెలిసేది. ఒళ్లులా సత్తువ పోయి, గేణము పోయినంకే మనము సచ్చేది" శీకలన్న చెప్పె.

"అదీ నిజమే సావు చెప్పి వస్తుందా?" చింతచేసె సొణ్ణప్ప.

సావు సమాచారము మాట్లాడతా చానా జనం వీదంతా నిలచిండారు.

*"శివుడు గలడనుచు శిలలకు మొక్కెడి*
*వెర్రి జీవులారా వెతలు విడుడి*
*జీవులందే కాక శిలలనేమున్నది*
*విశ్వదాభిరామ వినుర వేమ* అన్నట్లుగ్గా.. సచ్చిపోయిన మారాజు నేరుగా సొర్గానికి పోవాలని తలచి మా రామచంద్రన్న పదిరూపాయలు ఇచ్చి బలే పొగిడించిరప్పో" అంటా పలక వాయిస్తా మోటప్ప ముందర నడస్తా వుంటే పీనిగని ఎత్తుకొని జనం వెనక నడస్తా వుండారు.

వాళ్లవాళ్ల బతుకుల్లా తాత నెనపుల్ని నెమరు వేసుకుంటా... మసాణములా తీసిండే గుంతలా తాతని పెట్టి మన్ను చేసిరి.

ఇందాగంట నేలపైన నడిచిన తాత, ఇబుదు నేల లోపలికి పోయె ఏల? ఏల గుంతలా వేసిరి అంటా గూబగేణము చేస్తిని.

"రేయ్! నా గేణము ఏమిటికిరా నీకు, అయినా మనిషి వచ్చిన తావుకే తిరిగి పొయ్యేది. దాన్నింకానే ఆ తాతని అట్ల చేసిరి" అనె గుడ్లగూబ.

"ఏమి గూబమ్మ, మనిషి గుంతలా నింకా వచ్చెనా, బలే చూసినట్ల చెప్పతావు" అంటిని.

"రేయ్! తిక్కల తిమ్మా, మీ బతుకులు నాకు తెలీదా, మాజాతి బూమిమింద బతికి బట్టకట్టినంకే మీ జాతి పుట్టింది. విష్ణుమూర్తి అవతారాలు నీకి తెలీదేంరా" అనె.

"లేదు" అని తల తిప్పితిని.

"ఇదీ తెలీకుండా, ఇన్నాళ్లు ఈనేల పైన నడచి అదెట్ల బతికి బట్టకడితివిరా" అంటా నన్ను ఉమిసె.

"ఈపొద్దు నా జాతకము సరిలే" అని తలగీరుకొంటిని.

"ఏం రా! జాతకము, గీతకము అంటావు. పరక(చీపురు)లా వేస్తా నా బట్టా, మీరు, మీ తోలుబలము, బుద్ధిబలముతో బతికేది వదలి పెట్టి గ్రహాలు, నక్షత్రాల పైన పడి ఏడుస్తారేంరా" కోపముగా పరక ఎత్తుకొనె.

"అయ్యో! గూబమ్మా నీకు నామీద కోపము వుంటే పరకలా వేయి పర్వాలేదు కాని అలకామాటిల్లా తిట్టద్దే. అందరి మాదిరిగానే నేను, గుంపులా గోవింద అన్నెట్ల నాకు ఈ జాతకము గేణానికి వచ్చె. నన్ను విడువుమా" అంటా బేళాడితిని (బతిమిలాడితిని).

"సరే" అని గూబమ్మ తన గూట్లోకి వెల్లెసె.

అన్నా.. అక్కా .. గూబ గేణము, గూబనా బట్ట, గూబ ముండ గూబ గుడ్లదాన్నా అని నోటికొచ్చినట్లు తిట్టేది ఇంగన్నా విడచి పెట్టండ. గూబగేణము ఎంత పెద్ద గేణమని మీకు ఇబుదు తెలిసె కదా.

×××

"అంబపలుకు... జగదాంబ పలుకు" అంటా బుడబుడికి ఆడిస్తా జోస్యం చెప్పతా ఇంటి ముందర నిలచిండాడు బుడబుడకలాయప్ప.

తలకి ఎర్రతువ్వాలు, తెల్లనిపంచె, నల్లకోటు వేసుకొని చూసేకి బలేగా వుండాడు. అమ్మ ఇచ్చిన తెల్లబట్టను బుజముమింద వేసుకొని బీమును జోళిగిలా పోసుకొని, ఇంగో ఇంటి ముందరికి పోయె. నేను అన్నము తిని అవతలికి వస్తిని.

*"గొబ్బియాలో వాగుల్లో గోవులు క్షేమంగుండాల*
*గొబ్బియాలో వాగుల్ని కాచేది వన్నాశంకరుడే*
*గొబ్బియాలో గోవుల్ని మేపేది గోపాల సామి*
*గొబ్బియాలో ఆమంద ఈమంద మునిమందలాయ"*

గొబ్బియాలో పాటలు పాడతా వూర్లాకి వస్తా వుండారు ముగ్గురు ఆడోళ్లు. వాళ్లని చూసి నేను తిరగా అమ్మతావుకి పారితిని.



"ఎవురుమా వాళ్లు? వాళ్ల తలమింద వుండే మక్కర్లలా ఏముంది మా" అంటా అడిగితిని.

"వాళ్లు జంగాలోళ్లు చిన్నా. ఆ మక్కరిలాని ఇత్తడితట్టలా గౌరమ్మని (పసుపుముద్ద) పెట్టుకొని, చేమంతి, చెలుమల్లి, గన్నేరి, తంగేడి పువ్వులతో అలంకారము చేసి పెట్టుకొని వుంటారు" అనె.

"ఏలమ్మా వాళ్లట్ల చేసేది"

"అది వాళ్ల పబ్బతి, ఈ సుంకురాతిరి నెలంతా వాళ్లట్ల చేసి, కడగా గౌరమ్మని జలిదిలా విడస్తారు. అబుడు వూర్లావుండే ఆడోళ్లందరు పసుపుముద్దని అదే గౌరమ్మని ముట్టుకొని తాళిబొట్టుకు పసుపు పెట్టుకొంటారు" అంటా అమ్మ చెప్పతావుంది.

అందాతలికే (ఆవేళకే) "రేయ్! గంగెద్దులాయప్ప వచ్చిండాడ్రా" నా సావాసగాడు రాంగాడు పిలిచె. నేను ఒగే వుసురులా గుడితావు పారితిని.

నేను పోయేతలికే రామునికి సీతకి పెండ్లి అయిపోయివుండె. అదేదన్నా పోని అంటే, మనిషి ఎదపైన ఎద్దు నిలుచుకొనే గట్టమూ అయిపోయిండె.

గోపన్న పదిరూపాయలు తీసి గంగెద్దులాయప్పకి ఇచ్చె. ఆ కాసుల్ని జేబులా పెట్టుకొని,

"అడవి పక్షులకెల్ల ఆహారమెవ్వరిచ్చె
మృగజాతి కెవ్వరు మేత పెట్టె
వానరజాతికి భోజన మెవ్వరిచ్చె
చెట్లకెవ్వరు నీళ్లు చేది పోసే" అంటా నరసింహ శతకము పద్యాలను సొంపుగా పాడె గోపన్న.

మొన్న బేరికలా లేపాక్షి రామాయణము ఆడినబుడు పోయింటిని. ఎదురెదురు చప్పరములు వేసుకొని రామకథని రెండుదినాలు పద్యాలు, పాటలుగా పాడింది నాకు ఇబుడు గేణానికి వచ్చె. నా నోటికి వచ్చిన పాటను నేను అట్లే పాడితిని.

కంచుతట్ట ఎత్తుకొని పొద్దప్పనిపక్క తిప్పేసి మల్లేసి చూస్తా వుండాడు మాతాత.

"ఈకిత సంకురుడు దేనిమింద వచ్చిండాడు మామా" రామక్క అడిగె.

"నందిమీద మా"

"నంది అయితే పర్వాలేదు, పోయిన కిత, పంది మిందవచ్చి దేశములా శానా అనిష్టాలు జరిగె" అంటా పాత గేణము చేసె రామక్క.

సంకురాత్రి పండగ ముందుదినము సంకురుడు పుడతాడంట. ఈ దినములా అనపకాయల్ని ఉడకేసుకొని తింటే ఒళ్లుకు చానా మంచిదంట. నాకు ఆ గేణము వచ్చి నా సావాసగాళ్ల జతలా చేనులకి పారితిని.

కుక్కతొలసి రెంబల్ని యించి సట్టి చుట్టూరా పేరిచి, దాంట్లో అనపకాయలు, సెనక్కాయలు, సిన్నసిన్నగా కత్తిరించిండే చెరుకు ముక్కలు వేసి మూతగా కుక్కతొలిసి రెంబల్ని సట్టిపైన బాగా కూరిస్తిని.

ఆమీట నేలని రవంత గుంత చేస్తిమి. ఈ గుంతలా సట్టిని తిప్పేసి పెట్టి సుట్టూరా మన్ను తోస్తిమి. సట్టి పైన ఎండిండే పిడకలు, ఎండిండే కట్టెలు పేరిచి అగ్గి మంటేస్తిమి.

అగ్గి బాగా కాలి, నిప్పులు చల్లారినంక సట్టిని పైకి తీసి కుక్కతొలసి రెంబల్ని పక్కకేసి లోపల ఉడికిండే అనపకాయలు సెనక్కాయలు తింటా వుంటే ఆ రుచే వేరే. ఇంగ రేపే సంకురాత్రి పండగ.

నేను నిద్రలేచేతలికే అమ్మ ఇంటి ముందర ముగ్గేసి ముగ్గు మద్దిలా పేడదీపము (గొబ్బెమ్మ) పెట్టి దానికి గొబ్బియాల పువ్వులు, గురుగు పువ్వులు, తీళ్లతీగ, జిల్లిడి పూలు కుచ్చింది. దాల్బందరము (ఇంటి ద్వారం) తావ, మూడుపక్కలా గోడకి పేడ మెత్తిచ్చి పువ్వులు కుచ్చింది.

నేను, అబ్బ కూడా ఆవుల్ని, గొర్రెల్ని కడిగేకి ఏటితావుకి పోతిని. మొదలు గొర్రెల్ని, మేకల్ని ఈ గడ్డనింకా ఏట్లోకి తోలితిమి. అవి మీజుకొంటా (ఈదు) ఆ గడ్డతాకి వస్తానే ఆడే నీళ్లలా నిలుపుకొని బాగా కడిగితిమి.

ఆమీట ఆవుల్ని, దూడల్ని, ఎద్దుల్ని, కొమ్ములనింకా, కాళ్ల గొరిసెలదంకా (గిట్టలు) బాగా పుజ్జి కడిగి, రంగులు పూసి మెడలకి కూరిసిపెట్టిండే సెనక్కాయలు, చెరుకు సరాలు వేస్తిమి.

"మంద ఎచ్చుకాని.. మంద ఎచ్చుకాని" కాటమరాజు పూజ అయినంక వూర్లాకి నడిస్తిమి.

ఊరి ముందర అగ్గేసి మామిడితోరణాలు కట్టిండారు. అద్దుతావ ఊరి గౌడు, పెద్దోళ్లు, దాసప్ప నిలిచిండారు. దాసప్ప రోకలిని అద్దుకి అడ్డముగా వేసి పూలుపెట్టి పూజ చేస్తానే, డోలు కొట్టేకి సురువు చేసిరి.

ఎద్దుల్ని ఆవుల్ని అద్దు దాటిచ్చిరి. దీన్నే కుచ్చులపండగ అనేది. దిగువ తమిళనాడులా దీన్ని జల్లికట్టు అని అంటారు.

వయసు చిన్నోళ్లంతా ఎగిరి ఎద్దుల వెనక పారతా, ముగుదాడు పట్టుకొని వొంచి కాసులు పీక్కోని జేబుల్లా వేసుకొని, సెనక్కాయ, చెరకు సరాలు పీకి చిన్నోళ్లకి ఇస్తా వుండారు.

దాసప్ప పోయి వూర్లా వుండే ఆవులిండ్లలా తీర్థము చల్లి వచ్చె.

నేను ఇంటికి పోయి కారం పిడకపప్పు, తీపి పిడకపప్పు (అనప విత్తనాలతో చేసే వంటలు) తిని ఆయిగా పనుకొంటిని.

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# ప్రభావాలూ - ప్రలోభాలూ

వస్తువే తనకు సరిపోయే శిల్పాన్ని యెన్నుకుంటుందని విమర్శకులు అంతా అంటుంటారు. అయితే శిల్పాన్ని నిర్ణయించడంలో ప్రముఖపాత్ర వస్తువు మాత్రమే కాదని చరిత్ర చెబుతోంది.

పాశ్చాత్య దేశాల్లో ముఖ్యంగా ఇంగ్లాండులో నవలారచన ప్రారంభమైన కొత్తలో నవలను “వచనంలో వుండే హాస్య పురాణం”(comic epic in prme) అని జేబులో ఉండే నాటకమనీ (pocket thate) రచయితలు, విమర్శకులూ, నిర్వచించుకున్నారు. అంటే అప్పుడా నవలా నిర్మాణం ప్రాచీన పురాణాలలోని సంఘటనల సమాహారాల పద్ధతినీ నాటకాల్లోని అంక విభజననూ నాటికీయతను దాదాపుగా అనుసరించిందని అర్థం. కథానిక శిల్పం దగ్గరకొచ్చేసరికి శిల్ప ధోరణులు నవలా పద్ధతిలోనే సాగిందని తెలుస్తోంది. తెలుగు కథానిక శిల్పంలో వచ్చిన మార్పులకు సాహిత్య సాంస్కృతిక రంగాల్లోని పరిణామాలకు మధ్య ఉండే సంబంధాల్ని తరచి చూసినప్పుడు ఆసక్తికరమైన అంశాలు వెల్లవయ్యాయి.

తెలుగు కథానిక శిల్పంపైన ప్రభావాన్ని చూపెట్టిన తెలుగు పత్రికలే! కథానిక నవల పక్రియలు పాశ్చాత్య దేశాల్లో గూడా పత్రికల ఆలంబనలోనే పుట్టిపెరిగాయి. 1908 లోనే ప్రారంభమైన ఆంధ్ర పత్రిక వారపత్రిక; 1950 నాటికి గాని ప్రాచుర్యానికి రాలేదు. 1950 నుంచి ఇప్పటివరకూ సాగుతున్న తెలుగు సాహిత్యాన్ని కథానికాయుగమని పిలవడానికి ఆ కాలంలో గొప్ప మాధ్యమంగా ఎదిగిన కథానిక ప్రక్రియతోబాటు ఆ కథలకు ఆలంబనగా ఉన్న పత్రికలు కారణమే. అయితే ఆ పత్రికల ధోరణుల్లో వచ్చిన మార్పులు కథానిక శిల్పం లోనూ మార్పుల్ని తీసుకొచ్చాయి.

1950 నుంచి దాదాపు రెండు దశాబ్దాలు పాటు ఆంధ్ర పత్రిక ప్రభ వారపత్రికలోని కథలు మధ్యతరగతి జీవుల జీవితపు అన్ని పార్శ్వాలనూ, వస్తువులుగా తీసుకున్నాయి. అప్పుడు వారపత్రికల్లోని కథలన్నీ ఆనాటి పత్రికల కొలతల్లో ఐదారు పేజీల దాకా పెరిగేవి. అంటే 1/4 దమ్మీ అని మనం పిలిచే 8.5× 11” యించీల కొలతల్లో వుండే పేజీల్లో ఆ కథలు పది పన్నెండు పేజీలదాకా వచ్చేవి. అందువల్ల వస్తువులేవైనా అప్పుడా పత్రికలకు రాసిన కథకులంతా తమ కథల్ని ఆ కొలత మేరకి పెంచేవారు. కొందరు స్పృహ తోను కొందరు తెలియకుండా కూడా ఆ సరిహద్దుల్లోపలే తమ కథల్ని యిచ్చేవాళ్ళు.

భారతి మాసపత్రికలో నవలికలంత పెద్దదైన కథల్ని, ఆంధ్ర పత్రిక వుగాది సంచికల్లో నవలికలకూ కథానికకూ మధ్య రూపమైన కథల్నీ ప్రచురించడం కూడా 1950 ప్రాంతాల్లోనే ప్రారంభమయ్యింది. అప్పుడు ప్రచురించబడిన చాలా కథలు విస్తృతంగా అంగలు చాచుకుంటూ, తీరిగ్గా నెమ్మదిగా విప్పారేధోరణిలో, అడవిలో చెట్లు పెరిగేటంత స్వేచ్ఛగా పెరిగాయి. 1991లో భారతి మూతపడగానే నవలికంత పెద్దగా పెరిగిన కథానికల కాలమూ చెల్లిపోయింది.

ఆంధ్ర పత్రిక కంటే యెక్కువగా వెలిగిన ఆంధ్ర ప్రభకూడా ఆగిపోయిన తరువాత ఆంధ్రజ్యోతి వారపత్రిక తెలుగు కల్పనా సాహిత్యానికి పెద్ద ఆలంబనగా వుండేది, యాజమాన్యపు మార్పులు, సంపాదకుల మార్పులమధ్య వూగిసలాడుతూ ‘నవ్య’ అనే పేరుకూడా మార్చుకున్న ఆంధ్రజ్యోతి వారపత్రిక, యిటీవల కరోనా సాకుతో ఆగిపోయేంతవరకూ పది పదిహేనుపేజీల విస్తృతుండే (1/4డమ్మీ) కథలకు ప్రోత్సాహకరంగా వుండేది. ఆ ఒక్క పత్రిక తప్పితే పాలపిట్ట, చినుకు లాంటి మాసపత్రికలు కూడా అదే రకపు కథలకు వేదికగా వుండేవి. ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభలు ప్రాచుర్యంలో వున్నప్పుడే ఆంధ్రభూమి, స్వాతి వంటి వారపత్రికలూ, యువ,జ్యోతి,విజయ వంటి మాసపత్రికలు, అదే ధోరణిలో వెలువడేవి.

1975-77 మధ్య కాలంలో ఆంధ్రజ్యోతి వారపత్రికలో సత్యం శంకరమంచి గారి అమరావతి కథలు నూరంటే నూరు వెలువడ్డంతో కథామాలికలనే కొత్త ప్రక్రియకు నాంది పలికింది. పత్రికల్లో వొక పేజీలో ఇమిడిపోయే ఈ కథామాలికలెంత ప్రాచుర్యంలోకి వచ్చాయంటే అలాంటివిప్పటికీ తెలుగులో నూరుదాకా వెలువడి వుంటాయి. త్వరగా చదివేయగలగడం, బాల్య స్మృతుల్ని నెమరేసుకోవడం అనే రెండు ఆకర్షణీయమైన లక్షణాలున్న కథామాలికలంతా పెద్ద ప్రాచుర్యానికి రావడం వెనకగూడా తెలుగువాళ్లదే అయిన స్వభావం స్పష్టంగా కనబడుతోంది. **క్రమంగా సాహిత్య పఠనానికి అయిదు పది నిమిషాలుకంటే ఎక్కువ ఏకాగ్రతనివ్వలేని తెలుగు వాళ్ల వ్యాపార స్వభావానికి పెద్ద ఉదాహరణగా వుండేది.**

2000వ సం॥ తరువాత వారపత్రికలు ఆగిపోవడంతో కథానికలకు దిన పత్రికల ఆదివారం అనుబంధాలే వేదికలయ్యాయి. 4 పేజీలతో ప్రారంభించిన ఆదివారం కథానికలు యిప్పుడు మూడుపేజీలకే కుదించుకుపోయాయి. యేమాత్రం రసవంతంగా అనవసరపు కాని బంగారాల వార్తా కథనాల మధ్యలో కథానికకు అంతకంటే యెక్కువ స్థలమివ్వలేని ఆదివారం అనుబంధాలు గొల్లుమంటున్నాయి. ఈ ఆటంకాలపైన తిరగబడిన కొందరు కథకులు ఒకే కథతో చిన్న పుస్తకాలు ప్రచురించసాగాయి. పదినుంచి 20 పేజీలుండే ఈ చిన్న పుస్తకాల మనుగడ పెద్దగా లేకపోయింది.

2010 ప్రాంతానికి వెబ్ పత్రికలు ప్రారంభయ్యాయి. మొదట్లో యీ వెబ్ పత్రికలన్నీ అమెరికా నుంచే వచ్చాయి. తొలి రోజుల్లో వచ్చిన ‘భారతి’ మాస పత్రికల కృషి చూసి అబ్బుర పరచినట్లే ‘ఈ మాట’వెబ్ పత్రికలో వ్యాసాల్ని, కథల్నీ చూసి అబ్బుర పడవచ్చు. తొలిరోజుల్లో అమెరికాలో స్థిరపడిన కథకులు భారతీయ వేర్లను వెతుక్కోవడంతోనే గడిపేసారు. యిప్పుడు వాళ్లు అమెరికన్ సమాజంలో కలిసి పోయి అమెరికా కథలే రాస్తున్నారు. భారతీయ వారసత్వమున్న మహిళ అమెరికాకు ఉపాధ్యక్షురాలు కావడం ఈ

సామాజిక పరిణామాన్ని స్పష్టంగా నిరూపిస్తోంది.

వెబ్ పత్రికలు వచ్చాక కథానిక పేజీల సంఖ్యపేరుతోవున్న పరిమితుల్ని అధిగమించగలిగింది. 2019 వచ్చేసరికి వెబ్ పత్రికల సంఖ్య పెరిగింది. వెంటనే పాఠకుల స్పందననికూడా తెలుసుకో గలిగే అవకాశం దొరికింది. అయితే ఇంకా వెబ్ పత్రికల్లో దొరికిన యీ స్వేచ్ఛను కథానిక చెప్పుకోదగినంతగా వుపయోగించుకోలేదు.

2010 ప్రాంతంలో కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారాలను ప్రారంభించింది. ముప్పయి అయిదు సంవత్సరాల్లో ఉన్న యువ రచయితలకు పురస్కారాలనివ్వసాగింది. ఐతే ప్రారంభించిన 4,5 సం။లలో తెలుగులో ఈ యువప్రాయంలో రాసే రచయితలు దొరకలేదు. సాహిత్య సృజనకు అంతరాయం వస్తుందేమోనన్న భయంకూడా కలిగింది. సరిగ్గ అప్పుడే చాలామంది విద్యాధికులు యిటు స్వదేశంలోనూ అటు అమెరికాలోనూ వున్న వాళ్లు, ఐటీ రంగంలో ఉన్నవాళ్లు, కథలు రాయడం ప్రారంభించారు. బాగా పనివుండే ఉద్యోగాల్లో ఉన్న ఆ రచయితల కథానికలపైన వాళ్ల జీవిత స్వభావపు ప్రభావం బాగా కనబడుతుంది. కథను వేగంగా, క్లుప్తంగా, స్పష్టంగా చెప్పడానికింత ప్రాముఖ్యతను 'రచన' నివ్వలేకపోయారు.

సరిగ్గా అదే సమయంలో విద్యాధికులైన చాలా మందికి, ముఖ్యంగా ఐటీ రంగంలో ఉన్న ఉద్యోగాలకు, పత్రికల్లో పనిచేస్తున్న యువ సంపాదకులకు సినిమా పరిశ్రమలో వెళ్లాలనే కోరిక పెరిగింది. అదే పనిగా సినిమాను చూడ్డం, సినిమాలకవసరమైన స్క్రిప్టు రాయడం, నాటకీయమైన కథల్ని యెక్కువగా చదవడం ప్రారంభమైంది. అందుకే వాళ్ల కథానికలపైన సినిమాటోగ్రఫీ పడసాగింది. యిలా యితర కథల ప్రభావం సాహిత్యం పైన పడటం కొత్తేమీకాదు. శిల్పాన్ని కల్పనా సాహిత్యం అన్ని కళలనుంచి నేర్చుకొంది. సంగీతము, చిత్రలేఖనాలతో మొదలుపెట్టి ఆధునిక కళారూపమైన సినిమా వరకూ అన్ని కళల సంపర్కంతో సాహిత్యం వెలిగిపోతూనే వుంది. అయితే 2010 తరువాతి రోజుల్లో సినిమాటోగ్రఫీ ప్రభావంలో పడిన రచయితల కథలుమాత్రం పురోగమనంలో వుండలేక పోయాయి. యీ ప్రభావం శైలిలోగూడా కనబడుతోంది. చకచక నడిచే చిన్న చిన్న సంభాషణలతో పంచ్ డైలాగులు అని కొత్తపేరు పెట్టుకున్న సంభాషణా చాతుర్యాలతో నడిచే యీ కథల్ని శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు కేవలం సంభాషణలతోనే నడిపిన కథలతో పోల్చి చూసినప్పుడు తేడా స్పష్టంగా వెల్లువడుతుంది.

గత సంవత్సరంగా ప్రపంచానంతా పట్టి వేధిస్తున్న కరోనా ప్రభావంకూడా కథానికా శిల్పంపైన పడింది. దాదాపుగా యింటికే పరిమితమైపోయిన చాలామంది విద్యాధికులకు యిది కొంత తీరికనిచ్చింది. బాగా పనుల్లో పడి విసిగిపోయే ఉద్యోగులు వినోదంకోసం వెతుక్కో సాగారు. ఈ సమయంలో వీళ్లందరికీ "ఫేస్ బుక్" అనే అంతర్జాలపు వేదిక అనుకూలమైన మాధ్యమంగా మారింది. దానికి పరిమితులూ, నియమాలూ, నిబంధనలూ ఏమీ లేవు. యెప్పుడు యేది తోస్తే అది రాసుకోవచ్చు. ఎవరికి కావలసిన పాఠకులు వారికి దొరుకుతారు. యిందులో వున్న విపరీత ధోరణులను పక్కనపెట్టి, మంచినే వెతుక్కోవచ్చు. కొందరు యువ కథకులు "ఫేస్‌బుక్"లో కథామాలికల్లాంటి తన అనుభవాల్ని రాసుకున్నారు. కొందరు అనుభవాల్ని తరువాత పుస్తకాలుగాకూడా తీసుకొచ్చారు. వీళ్లల్లో కొందరు అవి కథలో కావో తెలియదని, ప్రక్రియ లక్షణాల్ని తెలుసుకొని ఆ పరిమితుల్లో తాము రాయలేదని వినయంగా చెప్పుకున్నారు. "నా యిచ్ఛయేగాని నాకేమి వెరపు" అనే వీళ్ల రచనల్ని చదివి ఆనందించే "యిన్‌స్టెంట్" పాఠకలోకమూ వచ్చింది.

సాహిత్యమూ, మానవజీవితంలాగే ఒక సజీవ స్రవంతి. ప్రవహించడం దాని స్వభావం. పరిణామశీలంగా మారడం దాని లక్షణం. అయితే ఎలా మారడం అవసరమో, ఎలా మారడం తిరోగమనమో తెలుకోవడం మరీ కష్టమేమీ కాదు. సాహిత్య స్వభావమూ, దాని ప్రయోజనము యేమిటో తెలుసుకున్నప్పుడు వివేకవంతులైన సృజనశీలురు అప్రమత్తంగానే వుంటారు. అ


## గ్రంథాలయం



**'సంపద సృష్టికర్తలు' ఎవరు ?**
పుటలు: 144, వెల :40/-
రచన:రంగనాయకమ్మ
ప్రతులకు:
అరుణా పబ్లిషింగ్‌హౌస్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2
ఫోన్: 94406 30378



**కాలం నేర్పిన పాఠం** (కరోన కథలు)
రచన : శిరంశెట్టి కాంతారావు
పుటలు:118, వెల: రు. 100/-
ప్రతులకు :శిరంశెట్టి కాంతారావు,
1-1-177, మమతలకోవెల,
శ్రీనివాసపురంకాలనీ, పాతపాల్వంచ,
చరవాణి: 98498 90322



**నెల్లూరి నెఱనౌకలు**
రచయిత: పలగాని గోపాలరెడ్డి
పుటలు:277, వెల :300/-
ప్రతులకు :నవోదయ బుక్‌హౌస్ హైదరాబాదు
మరియు
ఆర్.బి.వి.ఆర్. రెడ్డి హాస్టల్
బ్యాంక్ ఆఫ్ బరోడా
మెయిన్ బ్రాంచ్ దగ్గర, అబిట్స్, హైదరాబాదు.



**కళ్యాణి కథ** (నవల)
పుటలు326,వెల:రు. 100
రచన : రంగనాయకమ్మ
ప్రతులకు :
అరుణా పబ్లిషింగ్‌హౌస్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2
ఫోన్: 94406 30378



**తొవ్వ ముచ్చట్లు** (భాగం 5)
రచన:జయధీర్ తిరుమలరావు
పుటలు:230, వెల :200/-
ప్రతులకు :సాహితి సర్కిల్,
402, ఘరోండా అపార్ట్‌మెంట్స్,
ఒ.యూ. మెయిన్ గేటు దగ్గర,
1వ వీధి, డి.డి.కాలనీ,
హైదరాబాదు - 500 007
చరవాణి : 99519 42242

పుస్తక సమీక్ష

# ...అంతా రామమయం




ఈ గ్రంథ రచయిత విహారి ప్రసిద్ధ సాహితీవేత్త, కథారచయిత, నవలారచయిత, కవి. దాదాపు 40కి పైగా గ్రంథాలు రచించారు. 40 సంస్థల నుండి అవార్డులు పొందారు. పలు పత్రికల్లో శీర్షికలు నిర్వహించారు. ఎంతోమంది కథారచయితల జీవిత విశేషాల్ని పాఠకులకందించారు. వీరి రచనల్లో సమాజాన్ని ఎంతో నిశితంగా పరిశీలించిన వైనం కనబడుతుంది. ఈ గ్రంథ రచనకు ముందే "శ్రీపదచిత్ర రామాయణం" అనే కావ్యాన్ని రచించారు. కరోనా సంవత్సరంగా ముద్రపడిన 2020లో వెలువడింది 'అంతా రామమయం'. దాదాపు ఇందులోని వ్యాసాలన్నీ ఇంతకుముందే 'భక్తి' మాస పత్రికలో ప్రచురించారు.

లోకంలో రాముడంటే దేవుడనే నమ్మకం ఉంది. మనిషికి, సమాజానికి మంచి చేసే లక్షణం రామాయణంలో ఉందని- విహారి ప్రగాఢ విశ్వాసం. అందుకే వాల్మీకి రామాయణంలోని 16 పాత్రలనుగూర్చి 6 కాండలలోని ధర్మసూక్ష్మాలను గూర్చి విశదంగా విస్పష్టంగా వివరించారు. ఇంకా తక్కిన వ్యాసాల్లో తెలుగులో వెలసిన పద్యరామాయణాలను గూర్చి కావ్యరూపంలో ప్రకటితమైన రామాయణాన్ని వివరించారు. వాల్మీకి రామాయణాన్ని సమాజ దర్పణంగా వర్ణించి, శ్రీరామతత్వాన్ని లోకానికి విశదపరచారు.

రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను ధర్మము, శ్రద్ధ, భక్తి, శక్తి రూపుదాల్చిన మూర్తిమంతులుగా- వాల్మీకి తీర్చిదిద్దారని తెలిపారు. రామాయణం ద్వారా వాల్మీకి సమాజానికి రామునిలా ప్రవర్తించు, రావణునిలా కాదనే సందేశాన్ని ఇచ్చారని తెలిపారు. రామాయణంలో వాల్మీకి తీర్చిదిద్దిన పాత్రల గుణగణాల్ని చక్కగా వివరించారు.

కళ్యాణధాములైన శ్రీరామసోదరులకు విశ్వామిత్రుడు బోధించిన గృహస్థాశ్రమ ధర్మాల్ని పురుషార్థాల ప్రాధాన్యాన్ని సామాజికహితైకాభిలాషులు వ్యక్తిగత సుఖభోగాల్ని త్యజించాల్సిన ఆవశ్యకతను వివరించారు. వాల్మీకి చెప్పిన రామాయణంలో లేని వశిష్ఠగీత లేదా యోగవాశిష్టాన్ని గూర్చి, దానిపై వచ్చిన వ్యాఖ్యానాలను గూర్చి తెలిపారు.

వాల్మీకి రామాయణాన్ని గురించి సంగ్రహంగానైనా సరైన అవగాహన కోసం ఆధారపడదగిన రచన ఇది. రచయిత కృషి ఎంతైనా అభినందించదగినది.

వెల:రు. 150/-

ప్రతులుకు: జె.ఎస్. మూర్తి (విహారి)
16-11-310/12/ఎ/1/1/
గణపతిగుడి వీధి, సీలంనగర్-2, మలక్‌పేట,
హైదరాబాద్-500 036
సెల్: 98480 25600

డా॥వెన్నిసెట్టి సింగారావు
సెల్ : 9393015584.

కవిత

## ఉసురు కింద ఉరిబాధ

శిక్షాస్మృతి కాలంలో
సూదులై గుచ్చే
స్వప్నాల్లోనే మనిషి బ్రతుకు మొత్తం

దేవులాడే కళ్ళల్లోనే
దేవుడి ఆలోచన
దెయ్యం నీడై నిలబడ్డ చీకటి

నీడను నైతికానైతికాల
సానమీద అరగదీసే
మందితో మతం
కులంతో గుంపు
అపరిచితంగా వీధి
బంధమాక్రమిత దుఃఖంలో ఇల్లు

తప్పు ఒప్పుల
వెలుగు చీకట్ల
వెలివేతల వెలితిలో
ఉసురకింద
ఊపిర్ని బిగదీస్తున్న ఉరిబాధ

శిక్షాస్మృతులు సూదులై గుచ్చే
స్వప్నాల్లోనే మనిషి బ్రతుకు మొత్తం

పాపికి పాపం తెలియదు!
శిక్షకు పుణ్యం తెలియదు
దేవులాడే కళ్ళల్లోనే
జీవితాన్ని కూల్చుకుంటున్న మృత్యునీడ

బలిసూత్రం త్రాసుతో
బ్రతుకుల్ని తూచే
నైతికానైతికాల మధ్య
మతంతో మంది
కులంతో గుంపు
అపరిచితంగా వీధి
బంధాలు ఆక్రమించే దుఃఖంలో ఇల్లు

-దుర్గాప్రసాద్ అవధానం
94926 08314

తెలుగువారింట జరిగే పెళ్లి అయినా పండుగ అయినా పిలుపు
తెలుగులో ఉండాలి. స్వాగత ద్వారాలు కూడా తెలుగులో ఉండాలి.

పనికొచ్చేకథ

# ఒక్క ఆలోచన ఊరినే మార్చేసింది!

ఆదూరి హైమావతి
87902 24030

**పే**దవాడైనా చాలా తెలివైన రాము, తన ఊరి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కొత్తగా వచ్చిన సైన్స్‌మాస్టారు పిల్లలకు ఎన్నో కొత్త విషయాలు చెప్పి ఉత్సాహపరచేవాడు. "మీలా చిన్నవయస్సులోనే ప్రయత్నించి చాలామంది ఆవిరియంత్రం, టి.వి, బల్బు, టెలిఫోన్, సైకిల్ వంటి అనేక వస్తువులు కనిపెట్టి మేధావులుగా గుర్తింపు పొందారు. మీరూ మీఊరి కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలని ఆలోచించండి. మీకేదైనా సాయంకావాలంటే నన్ను అడగండి" అనిచెప్పేవారు.

రాము వాళ్ళనాన్న పొలం నీటి సౌకర్యంలేక బీడుపడింది. వాళ్ళనాన్న పరాయిచోట కూలిపని చేసి సంపాదించి తెచ్చిన సొమ్ముతో ఇంటిల్లిపాదీ పొట్టపోసుకుంటుండటం రాముకు చాలాకష్టంగా ఉంది. ఎలాగైనా తండ్రి కష్టమే కాక, ఊర్లో చాలామంది రైతుల కష్టం తీరేలాగా ఊరిపొలాలకు నీటిసదుపాయం ఎలా కలుగుతుందాని రోజూ ఎంతో సేపు ఆలోచించేవాడు.

ఒకరోజున సైన్స్ పాఠం జరుగుతుండగా బాగా వర్షం వచ్చింది. దూరంగా ఊరికి ఉత్తరంగా ఉన్నకొండల మీద పడ్డనీరంతా పల్లానికి ప్రవహించి పక్క ఊరి సరిహద్దుల్లోకి ప్రవహించడంచూసి, వాడిమనస్సులో ఒక ఆలోచనవచ్చి, క్లాస్‌లో ఉన్నానని మరచి, పెద్దగా "ఆపండి! అపండి!' అని అరిచాడు. క్లాసంతా రాము అరుపుకు నిశ్శబ్దమైపోయింది. సైన్స్‌మాస్టారు రాము దగ్గరికి వచ్చి, వీపుమీదతట్టి, "రామూ! ఏమైంది? ఎందుకలాఅరిచావు?" అని అడిగాడు.

రాము ఆలోచనల్లోంచీ బయటికివచ్చి, "మన్నించండి మాస్టారూ! ఏదో ఆలోచిస్తూ అలాపైకి అరిచినట్లున్నాను." అన్నాడు. సైన్స్ మాస్టారు క్లాసయ్యాక రామూను దగ్గరికి పిల్చి అడిగి, వాని ఆలోచనను మెచ్చుకున్నాడు.

ఆ సాయంకాలం పిల్లలందరినీ మాస్టారు ఆ కొండవద్దకు తీసుకెళ్ళి, రామూ ఆలోచన వివరించారు. దాన్ని ఊరి వారికి వివరించను రామూ స్నేహితుల సాయంతో బంకమట్టితో ఒక మోడల్ తయారు చేశాడు. గ్రామపంచాయితీ సమావేశం ఏర్పాటుచేసి, సైన్స్‌మాస్టారి సాయంతో ఊరివారి కంతా కొండలు, నీరు ప్రవహించే దిశా, ఆ నీటిని ఆపను- ఒక చెరువు త్రవ్వాల్సిన విధానాన్నీ వివరించాడు.

మాస్టారు రామూ ఆలోచనను మెచ్చుకుని, 'ఊరివారంతా వెళ్ళి ఇతరులకు కూలీచేసేబదులు, తమ ఊరికోసం తామే కొంత శ్రమదానం చేస్తే, అందరికీ ఉపయోగమవుతుందని' అర్థమయ్యేలా వివరించాడు. కొందరు" ఈ చిన్నపిల్లవానిమాటలునమ్మి మేమంతా మాతిండి కోసం చేసే పనులు మానుకుని, కడుపులు మాడ్చుకుని అక్కడ త్రవ్వితే మాకుటుంబాలకు తిండి ఎలా వస్తుందీ?" అని మాస్టారును ప్రశ్నించారు.

"బాలకృష్ణుడు ఎంతవాడని, అంతా అతడ్నినమ్మి, కొండ క్రింద చేరారు? ఎలా ఇంద్రుడ్ని కాక, గోవర్ధనగిరిని,పూజించారు? మంచి మాటఎవరు చెప్పినా మనమంతా వినాలి. నాకే తట్టని ఆలోచన ఇంత చిన్నవానికి తట్టింది, మీరంతా రండి నేను చూపుతాను. "అనిచెప్పి, అందర్నీ కొండ దగ్గరకు ఒక వర్షం పడేరోజు తీసుకెళ్ళి చూపారు మాస్టారు. అక్కడ కొండ మీద నుంచీ పారే నీటి వాలునుచూసి, ఒక పెద్దగుంత త్రవ్వించి దానికి అడ్డుకట్టవేయగా నీరు నిలిచింది.

"ఎటూ మీకు పనులులేవు. ఊరికే కూర్చునేబదులుగా, ఈసమయంలో మీఊరికోసం శ్రమించండి. రేపు చెరువు ఏర్పడి నీరునిండితే మీ పొలాలకే నీరువచ్చి పంటలు పండుతాయి కానీ, నాకేమి లాభం? ఆలోచించండి."అన్నారు మాస్టారు.

అంతా అంగీకరించారు. పనిమొదలైంది. అందరూ అత్యుత్సాహంగా చిన్నపెద్ద ముసలీ ముతకా పారలు, పలుగులూ, తట్టలు, బుట్టలూ తీసుకుని పనిలోకి దిగారు. కొండలనైనా పిండి చేయగలది ఐకమత్యం అని నిరూపిస్తూ, కొద్దిరోజుల్లో ఒక చెరువు ఏర్పడింది. సైన్స్‌మాస్టారి కొడుకు సివిలింజనీరు. అమెరికాలో ఉద్యోగంచేస్తూ, తనదేశానికి అవసరమైన చోట తండ్రి సలహామేరకు సాయం చేస్తుంటాడు. అతడు సొమ్ము పంపాడు చెరువు కోసం. ఇంకా లోతుగా త్రవ్వితే నీరుబాగా నిలువ ఉంటుందని పట్నం నుండీ త్రవ్వేమిషన్ తెప్పించిపనిచేయించారు మాస్టారు. బాగా ఆలోచించి మట్టి కాలువ కాకుండా సిమెంట్‌లనుతెప్పించి అందరి పొలాలకూ నీరు అందేలా బిగించి, పైపు పని పూర్తిచేయించారు మాస్టారు.

భగవంతుడు వారి శ్రమను, కష్టాన్నీ చూసి కరుణించాడా అన్నట్లు వారంపాటు భారీవర్షం పడి చెరువు నిండిపోయింది. అందరూ ఆనందంగా వానలో తడుస్తూనే నిల్చుని చూడసాగారు. అంతా దుక్కిదున్నుకుని రైతుకూలీలంతా తిరిగి రైతులయ్యారు. వర్షాధాం పొలాలన్నీ చక్కని పంటపొలాలయ్యాయి. ఆలోచన రామూది, భగవంతుని అనుగ్రహంతో సైన్స్‌మాస్టారు లాంటి మంచి మనసున్న గురువుద్వారా ఆ ఊరి కరువు తీరిపోయింది.

ఆ చెరువుకు 'శ్రీరాంసాగర్' అని పేరు పెడదామని ఊరి పెద్దలకు చెప్పి వప్పించాడు రాము..శ్రీరాం**-మాస్టారిపేరు, సాగర్ ఆయన కుమారుని పేరూ. ఊరివారంతా మహదానందపడ్డారు.**

**చూడండి ఒక బాలుని 'ఆలోచన ఒకఊరినే మార్చేసింది' కదూ! మేధావులూ బాలలైనా పెద్దలైనా వారి మాటను పాటిస్తే మంచే జరుగుతుంది. -**

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

# మోదుకూరు(కృష్ణాజిల్లా-ఆం.ప్ర)లో తెలుగుజాతి కవి 'వేమన సాహిత్య వికాస పరిషత్' భవనం









## వేమనను గుండెల్లో నిలుపుకొన్న 'మోదుకూరు'

గుంటూరు జిల్లాలో తెనాలికి దగ్గరలో చైతన్యవంతులైన రైతు కుటుంబాలున్న ఒక ప్రముఖ గ్రామం మోదుకూరు. 1929 నుండే వేమన జయంతి ఉత్సవాలను ప్రతి ఏటా జరపడం వీరు మొదలుపెట్టారు. ఈ సందర్భంగా వేమన పద్యాల ప్రచారంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడాన్ని ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా చేస్తున్నారు. క్రమంగా ఒక చిన్న గ్రంథాలయాన్ని, సాంస్కృతిక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసుకొన్నారు. జయంతి ఉత్సవాల్లో ఎందరో పండితులు, కవులు, రాజకీయ నాయకులు, పాలకులు, సాహిత్యవేత్తలు, ఉద్యమకారులు పాల్గొంటున్నారు. దీనిని సంకల్పించి నిర్వహించిన వారిలో ముఖ్యుడు కీ.శే. మొవ్వా వీరారెడ్డి గారు ఇప్పుడాయన మనుమడు డా॥మొవ్వా శ్రీనివాసరెడ్డి ప్రభుత్వం నుండి, గ్రామపెద్దలు, మిత్రుల నుండి విరాళాలు సేకరించి, పట్టుదలగా కొన్నేళ్లు శ్రమించి అందమైన పెద్ద సభాభవనాన్ని నిర్మించారు. దాని పేరు 'వేమన సాహిత్య వికాస పరిషత్'. 90 ఏళ్లుగా జరుగుతున్న వేమన జయంతి కార్యక్రమాలకు ఇకపై ఈ భవనం కేంద్రం కానున్నది. అంతేగాక ఇకపై మరికొన్ని విశిష్టమైన కార్యక్రమాలను కూడా అందరి సహకారంతో నిరంతరం నిర్వహించనున్నామని డా॥మొవ్వా శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

ఈ భవనం ప్రారంభోత్సవం 2021 జనవరి 19న ఘనంగా జరిగింది. ఆరోజంతా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు 2 పుస్తకాలను ముద్రించి విడుదల చేశారు. అవి: 1.కొడాలి లక్ష్మీనారాయణ, తియ్యగూర సీతారామిరెడ్డి రచించిన మోదుకూరు గ్రామచరిత్ర 2. చక్రాల దుర్గానంద్ రచించిన 'శబ్దగాండీవి వేమన'. (ఈ పుస్తకంలోని పెద్ద వ్యాసంతోపాటు మరికొందరు ప్రముఖులు వేమన గురించి వ్రాసిన వ్యాసాలను 'నడుస్తున్న చరిత్ర', **'అమ్మనుడి'** పత్రికల్లో తొలుత ప్రచురించిన సంగతి తెలిసిందే.)

గ్రామస్తులంతా తరలివచ్చి సభను జయప్రదం చేశారు. ఎందరో అధికార, అనధికార ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పండితుల, విద్యావేత్తలు పాల్గొన్నారు. ఇంత గొప్పగా భవన నిర్మాణాన్ని, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించిన డా॥ శ్రీనివాసరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు, గ్రామపెద్దలు అందరూ ఎంతో అభినందనీయులు. ఇది మోదుకూరు గ్రామ ప్రతిష్ఠకు తోడుగా శాశ్వతంగా నిలిచే చారిత్రాత్మక కృషి.

–అమ్మనుడి

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly) Date of publication : 1st of every month RNI-APTEL / 2015/62362
February 2021 Vol :6, Issue 9 Date of posting : 3rd & 6th of every month Postal Reg NO. TEN/14/2021-23

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలతో...

# ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ (లి) తెనాలి

Regd. No. A.M.C./G.N.T./D.C.O./2001/532 స్థాపితం : 2001

## పూర్తి కంప్యూటరైజ్డ్ చేయబడిన బ్యాంకింగ్ సంస్థ

హెడ్ ఆఫీస్ : కొత్తపేట, **తెనాలి** – 522 201. గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 08644 – 235671, 235672

బ్రాంచి ఆఫీసులు :

1) **అంగలకుదురు** ఫోన్ : 08644 – 233299
2) **కొల్లూరు** ఫోన్ : 08644 – 243788
3) **బాపట్ల** ఫోన్ : 08643 – 224051
4) **కొల్లిపర** ఫోన్ : 08644 – 245399
5) **రేపల్లె** ఫోన్ : 08648 – 222388
6) **మంగళగిరి** ఫోన్ : 08645 – 231255

### ఖాతాదారులకు మా సేవలు

| | |
|---|---|
| సేవింగ్స్ ఖాతాలపై | 5.0% |
| 30 రోజుల నుండి 45 రోజుల వరకు | 5.0% |
| 46 రోజుల నుండి 90 రోజుల వరకు | 6.0% |
| 91 రోజుల నుండి 180 రోజుల వరకు | 7.0% |
| 181 రోజుల నుండి 1 సంవత్సరము వరకు | 7.5% |
| 1 సంవత్సరము పై కాలము నుండి 24 నెలల వరకు | 8.0% |

**అప్పులు**

బంగారు వస్తువుల హామీపై ప్రతిరోజూ గ్రాముకు రూ. 3,500/-లు చొప్పన 11.5% తక్కువ వడ్డీకి అప్పులివ్వబడును ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు, ఇతర స్థిరాస్తుల హామీపైన మరియు పర్సనల్ లోన్స్ 16% వడ్డీకి ఇవ్వబడును

**డిపాజిట్స్ పై సీనియర్ సిటీజన్స్‌కు ఒక శాతం అదనపు వడ్డీ**

నెలవారీ రికరింగ్ డిపాజిట్స్ సదుపాయం కలదు
చిన్న మొత్తాల పొదుపు పథకం - డైలీ డిపాజిట్

**లాకర్స్ సదుపాయం కలదు**

సెక్రెటరీ : కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి, చరవాణి : 93478 96473



### పాలక మండలి

శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు, అధ్యక్షులు
శ్రీ గ్రంథి చంద్రమౌళీశ్వరరావు, ఉపాధ్యక్షులు
శ్రీ వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, డైరెక్టర్
శ్రీ కఠారి వాసుదేవనాయుడు, డైరెక్టర్
శ్రీ షేక్ ఖలీల్, డైరెక్టర్
శ్రీ పి.ఎస్.ఆర్. బ్రహ్మాచార్యులు, డైరెక్టర్
శ్రీ యడ్లపాటి విజయరంగనాథ్, డైరెక్టర్
శ్రీ అంబటి పోతురాజు, డైరెక్టర్
శ్రీ దావులూరి చక్రధర్ చౌదరి, డైరెక్టర్
శ్రీ వెలినేని రాఘవయ్య, లీగల్ అడ్వైజర్



వ్యవస్థాపక అధ్యక్షులు :
కీ॥శే॥ దావులూరి సోమశేఖరరావు

అధ్యక్షులు :
శ్రీ దావులూరి లక్ష్మీకాంతారావు

**ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యులుగా చేరండి.**
**డిపాజిట్స్ చేయండి - అధిక లాభం, విలువైన సేవలు పొందండి.**

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244